తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM గుంటూరు : fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-8-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 194 పేజీలు: 12 వెల: 6.50






**SHOWROOM: ANDHRA PRADESH:** RENAULT **GUNTUR** Ph: 8860086167.



బుధవారం న్యూఢిల్లీలో జరిగిన 'హర్ ఘర్ తిరంగా' బైక్ ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, కిషన్ రెడ్డి

# ఎందుకంత జాప్యం

>> నమోదు చేసి జైలుకు పంపించేందుకు కూడా వెనుకాడవద్దని కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు. పనుల్లో అలసత్వం వహించిన ఇఇకి మెమో జారీ చేయాలని ఇఎన్‌సి నరసింహమూర్తిని మంత్రి ఆదేశించారు. ఇకపై పుష్కర లిఫ్ట్ స్కీం పైప్‌లైన్ పనులపై ప్రతిరోజూ వర్క్ ప్రోగ్రెస్ రిపోర్ట్ అందించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రతి నీటి చుక్కను ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని మంత్రి తెలిపారు. గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు పుష్కర ఎత్తిపోతల పథకం పనులు కీలకమని పేర్కొన్నారు. ఈ నెలాఖరున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకు గోదావరి జలాలు వెళ్లేలా నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో, పుష్కర ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను, కాంట్రాక్టు ఏజెన్సీలను ఆదేశించారు.

# కీలక ముందడుగు

>> నుంది. నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో అమలు చేసే ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా ఏపి మారిటైమ్ బోర్డు బాధ్యతలు నిర్వహించనుంది. ఐఐటి మద్రాస్ నిపుణుల సాంకేతిక సూచనలు, శాస్త్రీయ అధ్యయనాల ఆధారంగా ఉప్పాడ తీర ప్రాంతానికి అనువైన రక్షణ చర్యలను రూపొందించనున్నారు. తీర కోత తీవ్రత, సముద్ర ప్రవాహాలు, అలల ప్రభావం తదితర అంశాలను సమగ్రంగా అధ్యయనం చేసి, వాటికి అనుగుణంగా తీర రక్షణ నిర్మాణాల డిజైన్‌ను సిద్ధం చేయనున్నారు.

**నవంబర్ నుంచి పనులు ప్రారంభం:**

ఐఐటి మద్రాస్‌తో అధికారిక ఒప్పందానికి సంబంధించిన ప్రక్రియ పూర్తికావడంతో, రానున్న నవంబర్‌నుంచి ప్రాజెక్టు పనులను ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు, మత్స్యకార గ్రామాల రక్షణకు ఈ ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగినదిగా అధికారులు భావిస్తున్నారు. ఈకార్యక్రమంలో కాకినాడ కలెక్టర్ ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ సెక్రటరీ శరవణన్, పాడా డైరెక్టర్ డా.ఎన్.వి. శివరామ ప్రసాద్, ఐఐటి మద్రాస్ ఓషన్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎస్.ఎ.సన్నాసిరాజ్, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖతీబ్ కౌసర్ బానో, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్‌బోర్డ్ చీఫ్ ఇంజనీర్ జి.వి.రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ ఎన్టీఆర్‌కు సర్జరీ

>> పారు. ఇటీవల జిమ్‌లో ఉండగా ఎన్టీఆర్ భుజానికి గాయం కాగా ప్రత్యేక వైద్య నిపుణుల బృందంతో చర్చించి ఆర్థ్రోస్కోపిక్ శస్త్రచికిత్స ప్రయోజనకరంగా ఉంటుందని నిర్ధారించామని తెలిపారు. ఈనేపథ్యంలో ఆర్థోపెడిక్ సర్జన్ల బృందం ఆర్.ఎ.పూర్ణచంద్ర తేజస్వి, డా.నితిన్ బెజ్జంకి, డా.మధుసూదన్ రావు, డా.శ్రీనివాస్ రావు సూరపనేని ఆధ్వర్యంలో ఈ సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారని తెలిపారు. జూనియర్ ఎన్టీఆర్ ఇప్పుడు వైద్య పర్యవేక్షణలో ఉంటారని రెండు నుంచి మూడు నెలల కాల వ్యవధిలో పూర్తిగా కోలుకుని, తిరిగి సాధారణ స్థితికి వస్తారని తాము ఆశిస్తున్నారని హెల్త్‌బులిటెన్‌లో పేర్కొన్నారు.

**మీ అందరి అండతో త్వరలో మీ ముందుకు వస్తా: ఎన్టీఆర్**

తన భుజానికి సర్జరీ విజయవంతం కావడంపై కిమ్స్ వైద్య బృందానికి జూనియర్ ఎన్టీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. మీ అందరి అండతో త్వరలో మీ ముందుకు వస్తా. నా క్షేమం కోరుకున్న అందరికీ కృతజ్ఞతలు అని ఎక్స్ వేదికగా జూనియర్ ఎన్టీఆర్ పోస్టు పెట్టారు.

# పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ మరణించారా?

## అమెరికన్ జర్నలిస్టు ప్రత్యేక కథనం



**రావల్పిండి, ఆగస్టు 12:** పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై తీవ్ర ఉత్కంఠ నెలకొన్నది. ఆయన జైల్లోనే మృతిచెంది ఉండొచ్చంటూ పాకిస్థాన్‌కు చెందిన ఓ సీనియర్ జర్నలిస్టు చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. అయితే ఈ వాదనకు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదు. అమెరికాలో ఉంటున్న జర్నలిస్ట్ వజాహత్ సయీద్ ఖాన్ ఓ ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇమ్రాన్ ఖాన్ ఇప్పుడు జీవించి లేరని ముగ్గురు సీనియర్ పాకిస్థాన్ సైనిక అధికారులు తనకు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే వాళ్లు కూడా ఈ సమాచారాన్ని స్వయంగా నిర్ధారించలేదని చెప్పారు. అనధికారిక మార్గాల్లో తమకు సమాచారం అందిందని మాత్రమే వారు చెప్పినట్లు వివరించారు. 73 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్ 2023 నుంచి రావల్పిండిలోని అడియాలా జైలులో ఉన్నారు. ఆయనపై పలు కేసులు కొనసాగుతున్నాయి. జైల్లో ఉన్న ఆయనను కలిసేందుకు కుటుంబసభ్యులకు అనుమతి ఇవ్వడం లేదంటూ పాకిస్థాన్ తెహ్రీక్‌ఏ ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ పలుమార్లు ఆరోపించింది. ఆయనకు సరైన వైద్యం అందడం లేదని కూడా పార్టీ నేతలు చెబుతున్నారు. ఇమ్రాన్ కుటుంబసభ్యులు, పీటీఐ నేతలు మంగళవారం మరోసారి ఆందోళన వ్యక్తంచేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతి ఇవ్వకపోతే సెప్టెంబర్ 27న ఇస్లామాబాద్‌కు లాంగ్ మార్చ్ చేపడతామని పీటీఐ ప్రకటించింది. అంతకుముందే నిరసనలు చేపడతామని పీటీఐ హెచ్చరించింది. ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై అమెరికా నుంచి కూడా పాకిస్థాన్‌పై ఒత్తిడి పెరుగుతోంది. 13 మంది అమెరికా చట్టసభ సభ్యులు అక్కడి విదేశాంగ మంత్రి మార్కో రూబియోకు లేఖ రాశారు. ఇమ్రాన్ ఆయన భార్య బుష్రా బీబీ నిర్బంధ పరిస్థితులపై ఇస్లామాబాద్‌తో మాట్లాడాలని కోరారు.

# నేరాల రూపం మారింది

>> నేరాలు, సోషల్ మీడియా అసభ్య పోస్టుల లాంటి నేరాలు పెరిగాయి. మహిళలపై నేరాల విషయంలో జీరో టాలరెన్స్ అని పదేపదే చెబుతున్నాను. ఈ విషయంలో కఠినంగా ఉండాల్సిందే. నేరం జరిగిన ప్రాంతాన్ని సంరక్షి ంచటంలో విఫలం కాకూడదు. నేర నియంత్రణకు పోలీసులూ గోల్డెన్ అవర్ విధానాన్ని పాటించాలి. తప్పు చేస్తే నేరస్తులు తప్పించుకోలేరని తెలిసేలా చేయాలి. వివేకా హత్య కేసు ఘటనలో పూర్తి సమాచారం రాలేదు. పోలీసుల వైపు నుంచి జరిగిన కాస్ట్ లీ మిస్టేక్ అది. కొందరు కావాలనే తప్పు దోవ పట్టించారు. ఇల్లంతా రక్తం మరకలతో తడిస్తే ఆ ఆధారాలను చెరిపేసే ప్రయత్నం చేశారు. ఇది పూర్తి నిరక్ష ్యం. నేరస్తుల పట్ల ఉదాసీనంగా ఉండొద్దు. జీరో డ్రగ్స్, గంజాయి లేకుండా జాతీయ స్థాయిలో ఓ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మహిళల భద్రతతో పాటు గంజాయి, డ్రగ్స్ నియంత్రణ కోసం డ్రగ్స్ వద్దు బ్రో అన్న ప్రచారాన్ని విస్తృతం చేయండి. రహదారి భద్రత కూడా కీలకమైన అంశం. రోడ్డు ప్రమాదాల అరికట్టేలా సైనేజీలు, రోడ్ ఇంజనీరింగ్, హాట్‌స్పాట్‌లను ఆడిట్ చేయాలి. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించండి" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**చట్టాన్ని ఉల్లంఘించే లైసెన్స్ పార్టీలకు లేదు**

"శాంతిభద్రతల విషయంలో విఫలమైతే తీవ్రమైన పరిణామాలు మనం అంతా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒక్క చిన్న నిరక్ష ్యం మొత్తం పోలీసు వ్యవస్థపైనే మరక పడుతుంది. సింగయ్య వాహనం కింద పడిపోయి చనిపోతే కూడా ఎదురు ఆరోపణలు చేశారు. జగన్ కారు కింద పడిపోయినట్టుగా వీడియో వచ్చింది. కారు తొక్కేస్తే పొదల్లో పడేశారు. ప్రాణాలు కాపాడబోయిన పోలీసులపైనే నెపం పడింది. ఇబ్రహీంపట్నంలో రాజకీయ పార్టీ ర్యాలీలో రోడ్డుపై మోటారు సైకిల్ విన్యాసాలు ఏమిటి? పోలీసులపై కూడా దాడులు జరిగే పరిస్థితి ఉంది. ఏ పార్టీ అయినా రోడ్డుపై విన్యాసాలు చేసేందుకు అవకాశం లేదు. ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా వెళ్లటం అన్ని పార్టీల బాధ్యత. రాజకీయ పార్టీ నేతలు కాబట్టి ఫ్రీగా వదిలేస్తామంటే శాంతిభద్రతల పరిస్థితి వస్తుంది. రాజకీయ పార్టీలకు ఇష్టానుసారం వ్యవహరించే లైసెన్సు ఇవ్వలేదు. ప్రస్తుతం రోడ్లపై వీరంగం సృష్టిస్తున్న వారిలో 94శాతం మంది ఒక పార్టీ నుంచే ఉంటున్నారు. పరామర్శలకు వెళ్లటం తప్పేం కాదు. రోడ్లపై చేసే ప్రదర్శనల వల్లే ప్రజలకు ఇబ్బందులు. విశాఖపట్నంలో 3 గంటల పాటు రోడ్లను బ్లాక్ చేశారు. అంబులెన్సులో ఆస్పత్రికి వెళ్లే వారు, ఆఫీసుకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రజలకు ఇబ్బందులు కలగకూడదనే సిఎంగా నేను కూడా వాహన కాన్వాయ్ కుదించుకున్నాను. మానసిక పరిస్థితి సరిగాలేని కొందరు వ్యక్తులు చేసే నేరాలపై ప్రజల్లోనూ చర్చ జరగాలి. కొందరు రౌడీలే సామాజిక మాధ్యమాల్లో హీరోలుగా మారుతున్నారు" అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**ఇక నెలవారీ పోలీసు పెర్ఫార్మెన్స్ రిపోర్టు**

"శాంతిభద్రతల విషయంలో ఎపి అత్యుత్తమ రాష్ట్రంగా ఉండాలన్నదే లక్ష ్యం. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత దూషణలు, అసభ్య ప్రచారం పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. నేర నిర్ధారణ రేటు పెరిగితే నేరాలు తగ్గుతాయి. పోలీసులు దర్యాప్తు చేసి విజయం సాధించిన కేసుల వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం పూర్తి స్థాయిలో అమలు కావాలి. రాజకీయ పార్టీల ముసుగులో కొందరు గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను ప్రోత్సహిస్తున్నారు. గతంలో మద్యం తాగించేవారు, ఇప్పుడు గంజాయి మత్తులో వీరంగం చేస్తున్నారు. కొన్ని సామాజిక మాధ్యమాల సాయంతో నేరస్తులుగా మారుతున్నారు. టెక్నాలజీ నేరస్తులను పట్టిస్తోంది, అదే సమయంలో నేరాలు పెంచుతోంది. బ్యాలెన్సింగ్, ప్రాపర్ పోలిసింగ్ ఉండాలి. పోలీసులు అంటే ప్రజల్లో గౌరవం, సంఘ విద్రోహ శక్తులకు భయం కలగాలి. రాష్ట్ర అభివృద్ధితో పాటు శాంతిభద్రతలు కూడా కీలకం. అప్పుడే సుపరిపాలన సాధ్యం. డిజి కార్యాలయం నుంచి పోలీసు స్టేషన్ వరకూ పోలీసులకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఇక నుంచి ప్రతీ నెలా పోలీసు పెర్ఫార్మెన్సు రిపోర్టును విడుదల చేయాలి. బెస్ట్ ప్రాక్టీసెస్, సక్సెస్ స్టోరీస్ సహా వివిధ అంశాలను ప్రజలకు వివరిద్దాం" అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా 1200 పోలీసు స్టేషన్ల నుంచి స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సహా శాంతిభద్రతలు, ట్రాఫిక్, జీఆర్పీ సహా వివిధ విభాగాలకు చెందిన 1650 మంది అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సమావేశానికి హోం మంత్రి అనిత, డిజిపి హరీష్ కుమార్ గుప్తా, శాంతి భద్రతల అదనపు డిజి ఎన్. మధుసూధన రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్హా, ఈగల్ టాస్క్‌ఫోర్సు ఐజి రవికృష్ణ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## నీట్ యుజి పేపర్ లీక్ కేసు..

# సిబిఐ ఛార్జ్‌షీట్ ఓకే

- ఆ వివరాలు బయటకెలా వచ్చాయి
- ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఆందోళన

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** నీట్ యుజి పేపర్ లీక్ కేసులో 13 మంది నిందితులపై సిబిఐ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను ఢిల్లీ రైస్ అవెన్యూ కోర్టు బుధవారం పరిగణనలోకి తీసుకుంది. ఈ కేసులో దర్యాప్తు సంస్థ సమర్పించిన తుది నివేదికను ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ గుప్తా స్వీకరించారు. సిబిఐ ఛార్జ్‌షీట్ వివరాలు మీడియాకు వెల్లడి కావడంపై కోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా మైనర్లతో సహా సాక్షుల వివరాలు బయటకు రావడంపై కోర్టు అసహనం వ్యక్తం చేసింది. కోర్టులో వాదనలు జరగకముందే ఛార్జ్‌షీట్‌లోని అంశాలు ప్రచురితం కావడం తీవ్ర ఆందోళనకరమైన విషయమని రౌస్ అవెన్యూ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ గుప్తా పేర్కొన్నారు. ఇటువంటి వెల్లడి చర్యలు క్రిమినల్ విచారణ ప్రక్రియ నిష్పాక్షికతను దెబ్బతీసే అవకాశం ఉందని కోర్టు అభిప్రాయపడింది. మీడియా సహా సంబంధిత వర్గాలన్నీ, తమ కథనాల వల్ల కోర్టు విచారణ ప్రభావితం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత కలిగి ఉన్నాయని కోర్టు నొక్కి చెప్పింది. మైనర్లతో సహా సాక్షుల పేర్లను మీడియా కథనాలు బయటపెట్టాయని సిబిఐ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలపడంతో ఈ విషయం తెరపైకి వచ్చింది. నిందితులకు నిష్పాక్షిక విచారణ పొందే హక్కుపై ఇటువంటి ప్రచారం ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొంటూ డిఫెన్స్ లాయర్లు కూడా ఈ కథనాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. నీట్ యుజి ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంలో 13 మంది నిందితులపై సిబిఐ దాదాపు 20,000 పేజీల ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. దర్యాప్తు సంస్థ ప్రకారం, ముగ్గురు సబ్జెక్ట్ నిపుణులు ఢిల్లీలోని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) కార్యాలయం నుండి పరీక్ష ప్రశ్నలను సేకరించి, వివిధ మార్గాల ద్వారా లీక్ చేశారు. అత్యంత గోప్యమైన విభాగం నుండి బయటకు వచ్చేటప్పుడు తనిఖీ విధానాలు లేకపోవడాన్ని నిందితులు తమకు అనుకూలంగా మలుచుకున్నారని కూడా ఆ సంస్థ ఆరోపించింది. కోర్టు ఛార్జ్‌షీట్‌ను స్వీకరించింది. అభియోగాల నమోదుపై వాదనలు ఆగస్టు 13 నుండి ప్రారంభమవుతాయని ఆదేశించింది. కేసులో తదుపరి దర్యాప్తునకు అనుమతి కోరుతూ సిబిఐ కూడా ఒక దరఖాస్తును దాఖలు చేసింది. తదుపరి దర్యాప్తు కోసం సిబిఐ దాఖలు చేసిన దరఖాస్తుపై నిందితుల నుంచి స్పందనలు కోరిన కోర్టు, గురువారం ఈ విషయాన్ని విచారించనుంది.

# ఇకపై నేరుగా తిరుపతికే

>> నేరుగా తిరుపతికి వచ్చి ఇక్కడి ఇమ్మిగ్రేషన్ తనిఖీల ద్వారా మన దేశంలోకి ప్రవేశించవచ్చు. ప్రధానంగా తిరుమలకు చేరుకునే వెసలుబాటు కలిగింది. తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంగా రూపుదిద్దుకుంది. ఇప్పటికే 11వరకు విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయి. త్వరలోనే విదేశాలకు తిరుపతినుండే విమానాలు ఎగిరే రోజులు ఉన్నాయి. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో విదేశీ శ్రీవారి భక్తులకు కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 15కి ముందే శుభవార్త చెప్పింది. కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారి దర్శనార్థం ప్రపంచ నలుమూలల నుండి విదేశీ భక్తులు వస్తున్నారు. వీరిసౌలభ్యం కోసం తిరుపతి రేణిగుంట విమానాశ్రయాన్ని ఇ వీసా ప్రవేశ పాయింట్‌గా గుర్తించింది. ఈ నిర్ణయంతో విదేశీ యాత్రికులు ఇకపై ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ కోసం ఇతర ప్రధాన నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నేరుగా తిరుపతిలోనే ఆ ప్రక్రియ పూర్తిచేసుకోవచ్చు. ప్రస్తుత నిర్ణయంతో ఇమ్మిగ్రేషన్ సమస్యకు పరిష్కారం లభించింది. ఇకపై విదేశీ భక్తులు నేరుగా తిరుపతి విమానాశ్రయంలోనే ఇవీసా ప్రక్రియ పూర్తి చేసుకుని, సులభంగా శ్రీవారి దర్శనానికి వచ్చే వెసలుబాటు కలిగింది. విదేశీ పౌరులు భారతదేశ పర్యటన కోసం ఆన్‌లైన్‌లో పొందే వీసానే ఇవీసా అంటారు.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకుని, ఫీజు చెల్లించి సేవలు అందుకుంటారు. ఇప్పటికీ తిరుపతి విమానాశ్రయానికి రెగ్యులర్ అంతర్జాతీయ విమాన సర్వీసులు లేనప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ముందుగానే ఇ వీసా ఎంట్రీ పాయింట్‌ను మంజూరు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. భవిష్యత్తులో తిరుపతి నుండి అంతర్జాతీయ సర్వీసులను ప్రారంభించేందుకు మార్గం సుగమం చేస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. తిరుపతిలో రన్‌వేను 2,286 మీటర్ల నుండి 3,819 మీటర్లకు విస్తరించారు. 2024 డిసెంబర్‌లో సింగపూర్ నుండి ఓ చార్టర్డ్ విమానం తిరుపతిలో ల్యాండ్ అవ్వడం కూడా ఈ దిశగా పడిన తొలి అడుగుగా భావిస్తున్నారు. ఈ నిర్ణయంతో తిరుపతి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అంతర్జాతీయంగా మరింత గుర్తింపు పొందింది. తిరుపతి విమానాశ్రయానికి శ్రీవేంకటేశ్వరస్వామి పేరు కూడా సార్థకం కానుంది.

# డియర్ యంగ్ ఫ్రెండ్స్

>> అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ "ప్రియమైన యువ మిత్రులారా, మీరే మా శక్తి. మీరే మా బలం. రేపటి ఆశ, వాగ్దానం మీరే" అని పేర్కొన్నారు. ప్రతి యువతీ యువకుడు తమకు నచ్చిన మార్గాన్ని ఎంచుకుని, ఆశించిన జీవితాన్ని గడిపేందుకు అవసరమైన స్వేచ్ఛ, ఆత్మవిశ్వాసం, అవకాశాలు కల్పించే భవిష్యత్తును నిర్మించడమే తమ ప్రభుత్వ లక్ష ్యమని పునరుద్ఘాటించారు. యువత కలలు కనడమే కాకుండా, వాటిని సాకారం చేసుకునేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. "మేము ఈ రోజు చేస్తున్న ప్రతి పని అంతిమంగా మీకు మెరుగైన రేపటిని అందించడం కోసమే. విస్తృత అవకాశాలు, కలలు కనే స్వేచ్ఛ, వాటిని నిజం చేసుకునేందుకు అవసరమైన మద్దతుతో కూడిన భవిష్యత్తును అందించడమే మా ధ్యేయం" అని చంద్రబాబు వివరించారు. ఈ భవిష్యత్ నిర్మాణంలో యువత కూడా భాగస్వాములు కావాలని, అందరం కలిసికట్టుగా నవ సమాజాన్ని నిర్మిద్దామని ఆయన పిలుపునిచ్చారు. యువతకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తనతో కలిసి రావాలని ఆహ్వానించారు.

## వారం - వర్జ్యం

13-08-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఆశ్లేషకార్తె
తి.పాడ్యమి రా.8.46
న1.ఆశ్లేష ఉ.6.06, న2.మఖ తె.4.39
వ.1. ఉ.6.20-ఉ.9.18
వ.2. రా.9.19-రా.12.21
దు.1. ఉ.10.04-ఉ.10.55
దు.2. మ.3.10-సా.5.01
రాహు మ.1.30-మ.3.00 శుభ లేదు.

## వార్తాఫలం

**మేషం :** క్రీడలయందు ఆసక్తి కలిగి ఉంటారు. బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తారు. బంధువుల రాక ఆనందం కలిగిస్తుంది.

**వృషభం :** సంఘంలో గుర్తింపు కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పరచుకుంటారు. ప్రయాణాలు. మిత్రుల కలయికతో విందు, వినోదాలు.

**మిథునం :** గృహనిర్మాణం ఆలోచనలు కొనసాగిస్తారు. వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఆటంకాలు తొలగుతాయి.

**కర్కాటకం :** చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. మొండి బాకీలు వసూలవుతాయి. స్వల్ప ధనలాభం పొందుతారు.

**సింహం :** అనుకోని అతిథుల నుండి శుభ వార్తలు అందుకుంటారు. వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వస్త్ర లాభం.

**కన్య :** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి.

**తుల :** చిన్ననాటి మిత్రుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు. ప్రయాణాలు.

**వృశ్చికం :** బంధువులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**ధనుస్సు :** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. సకాలంలో ఋణాలు తీరుతాయి. స్వల్ప ధనలాభం పొందుతారు.

**మకరం :** అన్ని విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి. ఉద్యోగాలలో మంచి మార్పులు ఉంటాయి.

**కుంభం :** చేపట్టిన పనులు సవ్యంగా పూర్తి చేస్తారు. నూతన పెట్టుబడులకు అనుకూలంగా ఉంటుంది. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**మీనం :** కొన్ని విషయాలలో పట్టిందల్లా బంగారంగా ఉంటుంది. ఆరోగ్య సమస్యలు తీరి ప్రశాంతత పొందుతారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



బుధవారం కురిసిన భారీ వర్షాలకు కాశ్మీర్ లోయలోని అవంతిపోరా గురుద్వారా జాతీయ రహదారి జలమయమయిన దృశ్యం

# ధైర్యముంటే అసెంబ్లీకి రావాలి

>> చర్చించి సమాధానం చెప్పేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. అసెంబ్లీ కంటే గొప్ప ప్రజాస్వామ్య వేదిక మరొకటి లేదు' అని పేర్కొన్నారు. బుధవారం టిడిపి కేంద్ర కార్యాలయంలో మంత్రి అనిత మీడియాతో మాట్లాడుతూ, ఐదేళ్లలో డిఎస్సీ చేయని వారు ఇప్పుడు మెగా డిఎస్సీపై వైసిపి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. డిఎస్సీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని, నియామకాలపై వచ్చిన ఆరోపణలకు సంబంధిత అధికారులు ఆధారాలతో వివరణ ఇచ్చారని పేర్కొన్నారు. అయినప్పటికీ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని, సిబిఐ విచారణ జరపాలని వైసిపి పదేపదే డిమాండ్ చేయడం రాజకీయ ప్రయోజనాల కోసం యువతలో అనుమానాలు సృష్టించే ప్రయత్నమేనన్నారు. 'ఐదేళ్ల అధికారంలో ఉండి ఒక్క డిఎస్సీని కూడా పూర్తి చేయలేని వారు... ఇప్పుడు ఉద్యోగాలు పొందిన తర్వాత అక్రమాలు జరిగాయని ఆరోపించడం విడ్డూరంగా ఉంది. మీ వద్ద ఆధారాలు ఉంటే అసెంబ్లీకి వచ్చి చూపించండి. ప్రతి అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని హోంమంత్రి అనిత పునరుద్ఘాటించారు.

వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడంపై స్పందిస్తూ, ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలకు శాసనసభలో తమ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించే బాధ్యత ఉందన్నారు. గతంలో శాసనమండలిని రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి, ఇప్పుడు అదే మండలికి తమ పార్టీ ప్రతినిధులను పంపుతున్నారని పేర్కొన్నారు. మరోవైపు ప్రజలు ఎన్నుకున్న వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరుకాకపోవడం సమంజసం కాదన్నారు. 'ఎమ్మెల్యేగా గెలవడం ఎంత గొప్ప బాధ్యతో, నియోజకవర్గ ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. జగన్‌తో పాటు గెలిచిన వైసిపి ఎమ్మెల్యేలకు కూడా సభలో ప్రజల తరఫున మాట్లాడే అవకాశం ఉండాలి' అని అన్నారు.

**ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల కష్టాన్ని అవమానించొద్దు:**

మెగా డిఎస్సీ నియామకాలన్నీ అక్రమమంటూ ఆరోపణలు చేయడం ద్వారా ప్రభుత్వం మీదనే కాకుండా, కష్టపడి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల ప్రతిభపై కూడా అనుమానాలు కలిగిస్తున్నారని హోంమంత్రి పేర్కొన్నారు. ఐదేళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ, కుటుంబాలకు దూరంగా ఉండి కోచింగ్ తీసుకుని, ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ఎంతోమంది అభ్యర్థులు కష్టపడి ఉద్యోగాలు సాధించారని తెలిపారు. 'ఎంతో కష్టపడి చదివి ఉద్యోగం సాధించిన యువత ఇప్పుడు తమ భవిష్యత్తుపై భరోసాతో ముందుకు వెళ్తున్నారు. మొత్తం డిఎస్సీ నియామకాలే అక్రమమని మాట్లాడితే వారి కష్టాన్ని, ప్రతిభను, వారి కుటుంబాల ఆనందాన్ని అవమానించినట్లే కాదా? రాజకీయాల కోసం యువత మనోభావాలతో ఆడుకోవద్దు' అని హితవు పలికారు. 'నిందలు వేయడం, అలజడి సృష్టించడం కాకుండా జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై బాధ్యతాయుతంగా చర్చించాలి. ప్రజలకు వాస్తవాలు తెలుసు. ప్రభుత్వం ప్రతి అంశంపై సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉంది' అని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు.

# ఎస్పైపిబి ఖాతాల్లో ప్రోత్సాహకాలు

>> చేశారు. సచివాలయంలో సిఎం చంద్రబాబు అధ్యక్షతన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం అయ్యింది. పరిశ్రమలు, ఇంధనం, ఐటి ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో మొత్తం 25 ప్రాజెక్టులకు సంబంధించి రూ.2,08,406 కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలకు ఎస్ఐపిబి ఆమోదాన్ని తెలియచేసింది. తద్వారా 21,627 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలను కల్పించనున్నారు. ఇప్పటి వరకూ జరిగిన 20 ఎస్ఐపిబి సమావేశాల ద్వారా 363 ప్రతిపాదనల ద్వారా రూ.13.78 లక్షల కోట్ల పెట్టుబడు లకు ఆమోదం దక్కింది. ఈ పెట్టుబడుల ద్వారా 10.86 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయి. గ్రీన్ అమ్మోనియాతో పాటు లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ రంగాల్లో పెట్టుబడులపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ రంగంలో పరిశ్రమల్ని ప్రోత్సహించేలా ఏం చేయాలన్న దానిపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు అవుతున్న పారిశ్రామిక ప్రాజెక్టుల గురించి ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలని సిఎం సూచించారు. కొందరు పనిగట్టుకుని కాలుష్యకారకాలంటూ దుష్ప్రచారం చేస్తున్నారని అసత్యాలను నమ్మించి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని అన్నారు.

ఉత్తరాంధ్రలో ఏర్పాటు అవుతున్న డేటా సెంటర్లన్నిటికీ 3.5 టిఎంసిల నీరు సరిపోతుందని అన్నారు. డేటా సెంటర్లపై ఉన్న అపోహలను తొలగించేలా చర్యలు చేపట్టాలని సిఎం సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలన్నారు. కొందరు రాజకీయ నిరుద్యోగులు సామాజిక మాధ్యమాల ద్వారా ఫేక్ ప్రచారాన్ని చేస్తున్నారని అన్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గ్రావిటీపై విశాఖలోని పరిశ్రమలకు పుష్కలంగా నీటిని తీసుకెళ్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వస్తున్న పరిశ్రమల ద్వారా రాష్ట్రంలోని ఎకోసిస్టమ్‌కు ఎంత విలువ జోడిస్తున్నామన్న అంశాన్ని విశ్లేషించాలని సిఎం సూచించారు. ఏపికి వచ్చే పర్యాటకులను ఆకట్టుకునేలా ఆతిథ్య రంగంలో వస్తున్న హోటల్ భవనాలు ప్రత్యేక నిర్మాణాలుగా ఉండేట్టు చూడాలని అన్నారు.

**సెప్టెంబరు నాటికి అందుబాటులోకి 175 ఎంఎస్ఎంఇ పార్కులు**

రాష్ట్రంలో ఏర్పాటవుతున్న రక్షణ రంగ ప్రాజెక్టులన్నీ జాతికి గర్వకారణమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పుట్టపర్తి సమీపంలో డిఫెన్సు, హిందుపూర్ సమీపంలో ఏరో స్పేస్ ప్రాజెక్టులు రావాలని సిఎం నిర్దేశించారు. మూలపేట పోర్టు డిసెంబరులో ప్రారంభించేలా నిర్మాణం పూర్తి చేయాలని అన్నారు. రాష్ట్రంలో లాజిస్టిక్స్, ఆధునిక వేర్ హౌసింగ్, కోల్డ్ చైన్ ప్రాజెక్టులను అనుసంధానించాలని అన్నారు. రాయలసీమలో పండే ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు వెళ్లేలా రోడ్ రైల్, పోర్టు కనెక్టివిటీ ఉండాలన్నారు. గత యేడాది నుంచి కుదుర్చుకున్న పెట్టుబడి ఒప్పందాలు, ఎస్ఐపిబిలో అనుమతి పొందిన ప్రాజెక్టులు వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ యేడాది సెప్టెంబరు నాటికి మిగిలిన 37 ఎంఎస్ఎంఇ పార్కులను కూడా పూర్తి చేసి 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక వాడలు అందుబాటులోకి రావాలన్నారు. వన్ ఫ్యామిలీ వన్‌ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమాన్ని కూడా పెద్ద ఎత్తున చేపట్టాలని సిఎం నిర్దేశించారు.

**20వ ఎస్ఐపిబి సమావేశంలో ఆమోదం పొందిన ప్రాజెక్టుల వివరాలు**

1. ఒకెయిర్ గ్రీన్ ఫ్యూయెల్స్ కర్నూలు జిల్లాలో రూ.616 కోట్ల పెట్టుబడి, 130 మందికి ఉద్యోగాలు2. జాక్సన్ గ్రీన్ రెన్యూవబుల్ కర్నూలు జిల్లాలో రూ.1533 కోట్ల పెట్టుబడి, 250 మందికి ఉద్యోగాలు3. ఎఫ్‌పిఇఎల్ రవ్వేద పవర్, విజయనగరం జిల్లాలో రూ.480 కోట్ల పెట్టుబడి, 275 మందికి ఉద్యోగాలు4. వారీ క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్, కాకినాడ జిల్లాలో రూ.15000 కోట్ల పెట్టుబడి, 1500 మందికి ఉద్యోగాలు5. ఆరాధ్యా బయోగ్యాస్ , కర్నూలు జిల్లాలో రూ.143.47 కోట్ల పెట్టుబడి, 595 మందికి ఉద్యోగాలు6. ఉషోదయా బయోగ్యాస్, నెల్లూరు జిల్లా, రూ.143.47 కోట్ల పెట్టుబడి, 595 మందికి ఉద్యోగాలు7. డేటా సెంటర్ హోల్డింగ్స్ ఇండియా, విశాఖపట్నం, రూ.58,743 కోట్లు, 1250 మందికి ఉద్యోగాలు8. మునోత్ లిథియం బ్యాటరీ లిమిటెడ్, తిరుపతి జిల్లాలో రూ.500 కోట్ల పెట్టుబడి, 240 మందికి ఉద్యోగాలు9. ఎఐఎల్ డిక్సన్ ఇండియా లిమిటెడ్, కడప జిల్లా కొప్పర్తి క్లస్టర్‌లో, రూ.450 కోట్ల పెట్టుబడి, 7000 మందికి ఉద్యోగాలు 10. రెన్యూ ఎపి గ్రీన్ డేటా సెంటర్, అనకాపల్లి జిల్లా, రూ.85,200 కోట్ల పెట్టుబడి, 1880 మందికి ఉద్యోగాలు11. ఎఎం ఇంటెలిజెన్స్ ల్యాబ్స్ లిమిటెడ్, విశాఖ జిల్లా, రూ.31,387 కోట్ల పెట్టుబడి, 1000 మందికి ఉద్యోగాలు12. సిఆర్ఆర్ హాస్పిటాలిటీ ఎల్ఎల్‌పి, తిరుపతి జిల్లాలో రూ.192.02 కోట్ల పెట్టుబడి, 200 మందికి ఉద్యోగాలు13. ఆర్కే 2 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, తిరుపతి జిల్లాలో రూ.150 కోట్ల పెట్టుబడి, 150 మందికి ఉద్యోగాలు14. సన్ రైజ్ హోటల్స్ ఇండియా లిమిటెడ్, కాకినాడ జిల్లాలో రూ.54 కోట్ల పెట్టుబడి, 75 మందికి ఉద్యోగాలు15. జెఎస్పీ హోటల్స్, రిసార్ట్స్ ఎల్ఎల్‌పి, కృష్ణా జిల్లాలో రూ.63.79 కోట్ల పెట్టుబడి, 100 మందికి ఉద్యోగాలు

16. పావులూరి హోటల్స్, తిరుపతి జిల్లా, రూ.58.74 కోట్ల పెట్టుబడి, 150 మందికి ఉద్యోగాలు17. అగస్త్యా గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, కర్నూలు జిల్లాలో రూ.7799.96 కోట్ల పెట్టుబడి, 1000 మందికి ఉద్యోగాలు18. అక్షత్ గ్రీన్ టెక్ లిమిటెడ్, విశాఖపట్నం జిల్లా రూ.1600 కోట్ల పెట్టుబడి, 750 మందికి ఉద్యోగాలు19. కోరమాండల్ ఇంటర్నేషనల్, శ్రీకాకుళం జిల్లా, మూలపేట, రూ.2125 కోట్ల పెట్టుబడి, 400 మందికి ఉద్యోగాలు20. హిందాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్, చిత్తూరు జిల్లా కుప్పంలో రూ.880 కోట్ల పెట్టుబడి, 447 మందికి ఉద్యోగాలు21. ఎస్ట్రేలా లాజిస్టిక్స్, విశాఖపట్నం జిల్లాలో రూ.90 కోట్లు, 100 మందికి ఉద్యోగాలు 22. గణేష్ సాయి మోనిష స్టీల్ వైర్స్, విజయనగరం జిల్లాలో రూ.66 కోట్ల పెట్టుబడి, 120 మందికి ఉద్యోగాలు23. విపిఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, నెల్లూరు జిల్లా, మనుబోలు, రూ.500 కోట్ల పెట్టుబడి, 2000 మందికి ఉద్యోగాలు (ప్రైవేట్ పార్క్)24. జయాదిత్యా ఆగ్రో లిమిటెడ్, కర్నూలు జిల్లాలో రూ.300 కోట్లు పెట్టుబడి, 350 మందికి ఉద్యోగాలు25. ప్రిసోల్ ఆగ్రో ఇండస్ట్రీస్, నెల్లూరు జిల్లాలో, రూ.330.71 కోట్ల పెట్టుబడి, 1110 మందికి ఉద్యోగాలు.


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
13-8-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 194 పేజీలు: 12 వెల: 6.50

**జలశక్తి కార్యదర్శిగా సీనియర్ ఐఎఎస్ అర్చనావర్మ**

**ఒమన్ తీరంలో నౌకపై హౌతీల దాడి** 9లో

## స్టైపెండ్ పెంచాల్సిందే!

**కొనసాగుతున్న జూనియర్ డాక్టర్ల ఆందోళన**

**ప్రభుత్వంతో ఫలించని చర్చలు**



**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తమ స్టైపెండ్‌ను 30శాతం వరకు పెంచాలని డిమాండ్ చేస్తూ జూనియర్ డాక్టర్లు చేస్తున్న నిరసన రెండో రోజుకు చేరుకుంది. ప్రభుత్వంపై ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో కనీసం 15శాతమైనా పెంచాలని జూడాలు విజ్ఞప్తి చేసినప్పటికీ అటు ప్రభుత్వం నుంచి మాత్రం సానుకూల స్పందన రావడంలేదు. దీంతో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని జూనియర్ డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా హెల్త్ సెక్రటరీతో జూడాల ప్రతినిధులు జరిపిన చర్చలు ఎలాంటి ఫలితాన్ని ఇవ్వలేదు. దీంతో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు బుధవారం విజయవాడతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 18 ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో నిరసన కార్యక్రమాలను జూనియర్ డాక్టర్లు మరింత ఉధృతం చేశారు. పొరుగున ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ఇస్తున్న రీతిలోనే తమకు కూడా గౌరవప్రదమైన స్టైపెండ్ అందించాలని జూనియర్ డాక్టర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సమానమైన సేవలు అందిస్తున్నప్పుడు ఎపిలో తక్కువ స్టైపెండ్ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని జూనియర్ డాక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నారు. అత్యవసర సేవలు, ఐసియు సేవలకి ఎలాంటి అంతరాయం కలగకుండా రోగులకు ఇబ్బంది లేకుండా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్వచ్ఛందంగా రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణమే జోక్యం చేసుకుని స్టైపెండ్ పెంపుపై స్పష్టమైన, సానుకూల ప్రకటన చేయాలని జూనియర్ డాక్టర్లు కోరుతున్నారు.

# నేరాల రూపం మారింది



బుధవారం సచివాలయంలో డిజిపి, స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

## పోలీసింగ్ మారాలి

**క్రైమ్ దర్యాప్తులో గోల్డెన్ అవర్ కీలకం**

**ఎపిపోలీస్ కీర్తి దేశమంతా మార్మోగాలి**

**పోలీసులకు పూర్తి స్వేచ్ఛ, గౌరవం**

**ప్రతి నెలా పోలీస్ పెర్ఫార్మెన్స్ రిపోర్టు**

**పరామర్శల పేరుతో రోడ్లపై విన్యాసాలతోనే ఇబ్బందులు**

**రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడితే కఠినంగా ఉండండి**

**రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ పోలీసు అధికారులతో సిఎం చంద్రబాబు**

**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల రూపం కూడా మారిపోయిందని, దీనికి అనుగుణంగానే పోలీసింగ్ మారాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నేరాల నియంత్రణలో తక్షణం ఆధారాలు కోల్పోకుండా చూడాలని పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. నేర నియంత్రణలో గోల్డెన్ అవర్ అత్యంత కీలకమని ఆయన అన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి డిజిపి నుంచి క్షేత్రస్థాయిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో సిఎం సమావేశం నిర్వహించారు. డిజిపి సహా రేంజ్ ఐజిలు, డిఐజిలు, డిఎస్పీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో సిఎం వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు. ఎపి పోలీసుల కీర్తి దేశమంతా మార్మోగాలని దానికి అనుగుణంగా సిద్ధం కావాలని అన్నారు. నేరాల దర్యాప్తులో టెక్నాలజీ ఇంటిగ్రేషన్ పెరగాలని సూచించారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ "డిజిపి నుంచి ఎస్‌హెచ్‌ఓ వరకూ సమావేశం నిర్వహించటం ఇదే తొలిసారి. శాంతిభద్రతల విషయంలో లోటుపాట్లను సవరించుకుంటూ ముందుకు వెళ్తున్నాం. ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నా, రాష్ట్రానికి పెట్టుబడులు రావాలన్నా శాంతిభద్రతలు ముఖ్యం. రాష్ట్ర ప్రభుత్వానికి పోలీసువిభాగం ఒక్రైడ్. ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా అంతా వ్యవహరించాలి. ఇన్విజిబుల్ పోలీసు, విజిబుల్ పోలీసింగ్ విధానం అమలు చేయాలి. గడచిన రెండేళ్లుగా కాగ్నిజబుల్ క్రైమ్స్ 14 శాతం మేర తగ్గాయి. కాలానుగుణంగా నేరాలు కూడా మారుతున్నాయి. డిజిటల్ క్రైమ్, డిజిటల్ అరెస్టులు తదితర నేరాలు కొత్త సవాళ్లుగా మారుతున్నాయి. దీనికి అనుగుణంగా సాంకేతికతను పోలీసులు అందిపుచ్చుకోవాలి" అని దిశా నిర్దేశం చేశారు

**పోలీసులకు పూర్తి స్వేచ్ఛ, గౌరవం**

"2019-24 మధ్య ఉన్న పాలకులు గంజాయి, కల్తీ మద్యాన్ని ప్రధాన సమస్యగా తయారు చేశారు. పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తాం. గౌరవం పెరిగేలా చర్యలు చేపడతాం. రాష్ట్రవ్యాప్తంగా 14,770 సిసి కెమెరాలతో పాటు ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న కెమెరాలను కలిపి 1 లక్ష కెమెరాలను అనుసంధానించాం. నేరాల దర్యాప్తులో ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్, డిఎన్‌ఏ డిటెక్షన్ లాంటి ఆధునిక విధానాలు పెరిగాయి. వేగంగా నేరాలను గుర్తించగలుగుతున్నాం. టెక్నాలజీ, నాలెడ్జి, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను పోలీసుఅధికారులు సమర్థంగా అమలు చేస్తే శాంతిభద్రతలు నియంత్రణలోకి వస్తాయి. రాజకీయ నేరాలు, డిజిటల్ >>2



## సభలో సుదీర్ఘ చర్చకు సిద్ధమే 9లో

**స్పీకర్ ఓంబిర్లాకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా లేఖ**

**విపక్షాలకు తగిన సమాధానమిస్తామని వెల్లడి**

## ఎస్క్రో ఖాతాల్లో ప్రోత్సాహకాలు

● డిసెంబర్ నుంచి వేసేలా చర్యలకు శ్రీకారం ● పల్లెలు అభివృద్ధి చెందేలా పారిశ్రామిక ప్రాజెక్టులు ● గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ రంగాలపై దృష్టి ● రూ.2,08,406 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపిబిలో ఆమోదం ● వివిధ ప్రాజెక్టుల ద్వారా 21,627 మందికి ఉద్యోగాల కల్పన ● సిఎం చంద్రబాబు అధ్యక్షతన పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం

**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఈ యేడాది డిసెంబరు నుంచి పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఎస్క్రో ఖాతాలో వేసేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించేందుకు ఎస్క్రో ఖాతాలను అనుసంధానించాలని సిఎం సూచించారు. పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఇన్సెంటివ్‌లు తప్పనిసరి అయినా ఎంత వరకూ ఆ ప్రోత్సాహకాలను ఇవ్వగలమన్న అంశంపై దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశంచేశారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందేలా పారిశ్రామిక ప్రాజెక్టులను ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం >>2

## డియర్ యంగ్ ఫ్రెండ్స్

● యువత కలలు సాకారం చేసుకునేందుకు పూర్తి స్వేచ్ఛ, అవకాశాలు కల్పిస్తాం ● మెరుగైన భవిష్యత్ అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: సిఎం సందేశం ● ఈ భవిష్యత్ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని చంద్రబాబు పిలుపు ● అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా యువతకు శుభాకాంక్షలు

**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్తప్రతినిధి:** అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు "డియర్ యంగ్ ఫ్రెండ్స్" అంటూ రాష్ట్ర యువతకు శుభాకాంక్షలు తెలిపారు. యువతే మన శక్తి, బలంఅని, రేపటి భవిష్యత్తుకు వారే ఆశాకిరణాలని ఆయన అభివర్ణించారు. యువత ఆశయాలకు అనుగుణంగా, వారికి బంగారు భవిష్యత్తును >>2



## షార్ట్‌కట్‌లు నేర్చుకుంటే జీవితం షార్ట్ అవుతుంది

**మాజీ రాష్ట్రపతి కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణలో ప్రధానిమోడీ** 9లో




## విదేశీ భక్తులు ఇకపై నేరుగా తిరుపతికే

**శ్రీవారి భక్తులకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు**

**తిరుపతి విమానాశ్రయానికి ఇ-వీసా ఎంట్రీ పాయింట్‌గా గుర్తింపు**

**త్వరలో అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభమయ్యే సూచనలు**

**తిరుమల, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం దేశం నలుమూలల నుండేగాక విదేశాల నుండి ప్రతిరోజూ భక్తులు తరలివస్తున్నారు. విదేశాల నుండి వచ్చే భక్తులకు ఇదివరకు తిరుపతి విమానాశ్రయంలో ఇ వీసా తనిఖీ ప్రవేశించే కేంద్రం లేదు. దీనివల్ల విదేశీ భక్తులు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు విమానాశ్రయాల నుండి తిరుపతికి రావలసి ఉండేది. దీనివల్ల యాత్రికులకు సమయం వృథానేగాక డబ్బు కూడా అదనంగా భారమవుతుంది. ఈ కష్టాలతో చాలామంది విదేశీ హిందూ భక్తులు నేరుగా తిరుపతి విమానాశ్రయం చేరుకునే వీలులేకపోయింది. ఇప్పుడు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సిఎం చంద్రబాబు నాయుడుకు విదేశాల్లోని హిందూ భక్తుల నుండి వచ్చిన విజ్ఞప్తులతో కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఈసమస్య తీసుకెళ్లారు. కేంద్ర విమానాయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తిరుమల భక్తుల పట్ల సానుకూలంగా స్పందించడంతో విదేశీ భక్తులు >>2

## ఎందుకంత జాప్యం



**షెడ్యూల్ ప్రకారం పుష్కర లిఫ్ట్ పూర్తి చేయాల్సిందే**

**అధికారులకు మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశం**

**పైప్‌లైన్ పనుల ఆలస్యంపై ఏజెన్సీ ప్రతినిధులపై ఆగ్రహం**

**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** పుష్కర ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ పనుల పురోగతిపై బుధవారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంపై అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీల ప్రతినిధులపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీక్షలో పోలవరం జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఇఎన్‌సి నరసింహమూర్తి, ఇఇలు, కాంట్రాక్టు ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇటీవల పుష్కర ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ పనులకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు వర్క్ షెడ్యూల్ అందజేశారని మంత్రి తెలిపారు. ఆ షెడ్యూల్ ప్రకారం పనులు జరుగుతున్నాయా లేదా అన్నదానిపై ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు క్షేత్రస్థాయిలో పరిశీలించి మంత్రికి నివేదిక అందించారు. వర్క్ షెడ్యూల్ ఇచ్చి కూడా పనుల్లో వేగం పెంచకపోవడం ఏమిటని మంత్రి అధికారులను ప్రశ్నించారు. ప్రజాప్రయోజనాలకు సంబంధించిన అత్యంత కీలకమైన పనుల్లో అలసత్వాన్ని ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టు ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రజాప్రయోజనాలకు నష్టం కలిగించే విధంగా కాంట్రాక్టర్లు వ్యవహరిస్తే క్రిమినల్ >>2

## ఉప్పాడ తీర రక్షణకు కీలక ముందడుగు



బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో ఐఐటి మద్రాస్ ప్రతినిధులతో డి.సిఎం పవన్ సమక్షంలో ఎంఒయు కుదిరిన దృశ్యం

**డి. సిఎం పవన్ సమక్షంలో ఐఐటి మద్రాస్‌తో ఒప్పందం**

**రక్షణ గోడ డిజైన్, డిపిఆర్, పర్యవేక్షణ బాధ్యతలు వారిదే**

**రూ.323 కోట్లతో రక్షణ గోడ నిర్మాణం, నవంబర్ నుంచి పనులకు శ్రీకారం**

**విజయవాడ, ఆగస్టు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** సముద్ర కోతతో తీవ్రంగా దెబ్బతింటున్న ఉప్పాడ తీర ప్రాంత పరిరక్షణకు కీలక ముందడుగు పడింది. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని ఈ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి అవసరమైన డిజైన్, సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్టు (డిపిఆర్), సాంకేతిక పర్యవేక్షణ బాధ్యతలను ఐఐటీ మద్రాస్‌కు అప్పగిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమక్షంలో బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో అవగాహన ఒప్పందం కుదిరింది. రూ.323 కోట్లతో ఈ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణం కానుంది. కేంద్ర ప్రభుత్వ విపత్తు నిర్వహణ నిధి (ఎన్‌డిఎమ్‌ఎఫ్) ఆమోదంతో చేపట్టనున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఎస్‌డిఎమ్ఎ) నోడల్ ఏజెన్సీగా వ్యవహరించ >>2

**టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ రాజీనామా** 9లో



## జగన్‌కు ధైర్యముంటే అసెంబ్లీకి రావాలి

● ఆధారాలతో చర్చకు మేం సిద్ధం ● డిఎస్పీపై ఆరోపణలు విడ్డూరం ● హోంమంత్రి అనిత

**మంగళగిరి, ఆగస్టు 12 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వంపై వైసిపి చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నామని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. 'రోడ్లపై ఆరోపణలు చేయడంకాదు. జగన్‌మోహన్ రెడ్డికి ధైర్యముంటే అసెంబ్లీకి రావాలి. వారివద్ద ఉన్న ఆధారాలను సభముందు ఉంచాలి. ప్రతి అంశంపై >>2

## జూనియర్ ఎన్టీఆర్‌కు సర్జరీ



**భుజానికి శస్త్ర చికిత్స విజయవంతమైంది**

**కోలుకోవడానికి 2-3 నెలల సమయం**

**హెల్త్ బులెటెన్ విడుదల**

**హైదరాబాద్, ఆగస్టు 12,ప్రభాతవార్త:** ప్రముఖ సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ భుజానికి శస్త్రచికిత్స విజయవంతం అయ్యింది. ఈమేరకు బుధవారం సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలోసర్జరీ నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. సర్జరీఅనంతరం ఎన్టీఆర్ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని తెలి >>2

13-8pg4_13-8pg4.qxd 12/Aug/26 10:43 PM Page 1



బుర్రలో ఎన్నో విషయాల్ని నింపి గందరగోళం చేసేది విద్య కాదు. వ్యక్తిలో శీలాన్ని పెంపొందించి జీవితాన్ని తీర్చి దిద్దుకునే అవగాహన కలిగించేదే నిజమైన విద్య.

న- సిసిరో

# కేన్సర్ కని'కట్టు'!

శంఖంలో పోస్తే తప్ప గంగాజలం తీర్థం కాబోదు. ఇదో సిద్ధాంతం. రాజపుండులా మానవ జీవాలను పీల్చిపిప్పి చేస్తున్న కేన్సర్‌ను నోటిఫై చేయాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలే దానికి నిదర్శనం. కేన్సర్ లక్షణాలు కనిపించగానే ఒక్క క్షణం కూడా జాప్యం చేయకుండా వైద్యానికి చేరువయితేనే ఆ ప్రాణం నిలబడుతుంది. లేకుంటే అదీ ఒకటి, రెండు దశలు దాటాక ఆసుపత్రికెళ్లినా ఉపయోగం ఉండొచ్చు, ఉండకపోవచ్చు. దశలు మారే కొద్దీ ప్రాణాంతకమని, ఇక సాధారణ పరిస్థితికి రాలేమని కేన్సర్ వ్యాధి చికిత్స నిపుణులు హెచ్చరిస్తూనే ఉంటారు. కానీ వైద్యానికి ఖర్చుపెట్టుకునే ఆర్థిక స్తోమత లేక ఎంతో మంది చచ్చే చావు వచ్చేవరకు మంచాన్ని వదిలిపెట్టి కదలరు. ఏనాటికైనా పోవాల్సిందే కదా! అని సరిపెట్టుకోవడం కద్దు. కేన్సర్ కూడా నయమవుతుందన్న భరోసా కల్గిస్తున్న నైపుణ్యం కలిగిన డాక్టర్లు ఉన్నా దానిగుర్తింపు వైద్య చికిత్సల కోసం ఖర్చు పెట్టేందుకు ఎంతో మందికి స్తోమత ఉండటం లేదు. అందుకే కేన్సర్‌ను నయం చేయగలిగిన వ్యాధిగా డాక్టర్లు చెప్పినా కూడా వైద్య ఖర్చులకు తట్టుకోలేక తాము జీవిత చరమాంకంలో ఉన్నామనిచెప్పుకుంటూ బతికేస్తున్నారు. స్తోమత ఉన్నవారు మంచి ఖరీదైన వైద్యం చేయించుకుని ఎంచక్కా ఆరోగ్యంతో తిరగ్గలుగుతున్నారు. మరి ఏదారీ దిక్కుతోచని వారే తమ అంతిమ యాత్ర కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. కేన్సర్ పీడిత రోగులను వారి ఖర్మకు వారిని వదిలేసేందుకు ఎవరూ సిద్ధంగాలేరు. కొన్ని విధాన నిర్ణయాల విషయంలో ప్రభుత్వాలు చొరవ చూపాల్సిన అవసరముందంటూకొందరు బాధితులుసుప్రీం కోర్టు మెట్లెక్కారు. ఉన్నత ధర్మాసనం నుంచి తగు మార్గదర్శకాలు వెలువడ్డాయి. కేన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి తగిన చికిత్స అందించేందుకు వీలుగా ఆ వ్యాధిని నోటిఫైయబుల్ డిసీజ్'గా ప్రకటించాలని తాజాగా సుప్రీం కోర్టు ఆదేశించింది. పార్లమెంటు స్థాయీ సంఘం చేసిన సిఫార్సుల మేరకు 17 రాష్ట్రాలు అమలు చేసి నోటిఫైడ్ వ్యాధిగా కేన్సర్ ప్రకటించారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు కేన్సర్ వ్యాధి చికిత్సలో ఒకే రకమైన విధానాన్ని అమలు చేయాలని సుప్రీం మార్గదర్శకాలు జారీ అవసరమని సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహన్ త్రిసభ్య ధర్మాసనం అభిప్రాయపడింది. దేశంలో అంతకంతకూ పెరుగుతున్న కేన్సర్ మహమ్మారిని అణచివేయడంలో రోగులకు సకాలంలో మెరుగైన వైద్యాన్ని అందించడానికి ఈ వ్యాధిని దేశమంతటా అన్ని రాష్ట్రాలు నోటిఫై చేయాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రస్తుతం సుప్రీం త్రిసభ్య ధర్మాసనం జోక్యంతో ఆ వ్యాధికి దేశమంతటా ఒకే రకమైన ఆరోగ్య విధానం ఉండేలా ఆదేశాలు జారీ అయ్యాయి.ప్రముఖ వైద్యులు అనురాగ్ శ్రీవాస్తవ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలు అత్యంత కీలకమైనవిగా చెప్పాలి. ఈ ఆదేశాలు అమలైతే ఇప్పటికే ఉన్న రాష్ట్రాలతోపాటు మరో 19రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కూడా ఏక రూప వైద్య చికిత్సలకు లోబడి కేన్సర్ రోగుల వైద్యంలో తరిస్తాయి. నిజానికి దేశంలో కేన్సర్‌కు సంబంధించినడేటా కొరత ఉంది. కోర్టు ఆదేశాలు అమలై కేన్సర్‌ను 'నోటిఫైయబుల్ వ్యాధి'గా నిర్ధారిస్తే దేశంలోని ప్రతి ఆసుపత్రి, వైద్యుడు వాటి డేటాను ప్రభుత్వానికి అందించాల్సి ఉంటుంది. వ్యాధి తీవ్రత, విస్తృతిని బట్టి ప్రభుత్వం నివారణ చర్యలకు ఆరోగ్య ప్రణాళిక సిద్ధం చేసేందుకు అవకాశముంటుంది. భారత రాజ్యాంగంలోని అధికరణ 14కిందనోటిఫై చేయబడిన రుగ్మతలకే ఆరోగ్య సంరక్షణ ఉంటుంది.నోటిఫై చేయడమనేది కొన్ని రాష్ట్రాలకే పరిమితమైతే మిగిలిన రాష్ట్రాలలో కేన్సర్ రోగులకు ప్రభుత్వపరంగా వైద్యభరోసా ఉండదు. కేన్సర్‌పైజాతీయ స్థాయి డిజిటల్ రిజిస్ట్రీఏర్పాటు కావాలని పిటీషనర్ కోరుతున్నారు. వ్యాధి ముదిరిన తర్వాత ఖరీదైన చికిత్సల కోసం వెంపర్లాడడం కన్నా ప్రాథమిక దశలోనే గుర్తిస్తే ప్రాణాలను నిలబెట్టుకోవచ్చు. ఇలా ఒకే ఒక లక్ష్యంతో ఫిర్యాదీ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.ఇదొక దేశ ప్రజారోగ్యానికి సంబంధించిన ఒక దిశానిర్దేశంగా చెప్పుకోవాలి. ఆరోగ్య రక్షణ వ్యవస్థకు ఇదొక పటిష్టమైన పునాదిగా చూడాలి. దేశవ్యాప్తంగా జాతీయ కేన్సర్‌నియంత్రణ విధానాన్ని రూపొందించేందుకు మార్గదర్శనం ఏర్పడ్తుంది. ప్రజలను సరైన అవగాహన లేమితో గోమూత్రం వంటి శాస్త్రీయ ఆధారాలు లేని ప్రత్యామ్నాయ చికిత్సల నుండి కాపాడిన ట్లవుతుంది. కేన్సర్ అంటువ్యాధి కాదు నయమౌతుందన్న నినాదమే కేన్సర్ రోగిని సగం బతికిస్తుంది. అదే కేన్సర్ వ్యాధి నియంత్రణకుదారులు తెరిచే ఉంటే ఆ రోగి సంపూర్ణ ఆరోగ్యంతో బయటపడే వీలుంది. కేన్సర్ నియంత్రణకు అవసరమైన వైద్యనిర్మాణసౌకర్యాలు, స్క్రీనింగ్ కేంద్రాలు, రేడియో థెరపి, కీమో థెరపీ, ఆంకాలజీ స్పెషలిస్టులు పాలియేటిక్ కేర్ అందుబాటులోకి రాగలవు. కేన్సర్ వ్యాధితో తెలుగు రాష్ట్రాల్లో పేరొందిన వైద్య చికిత్సలున్నందున అధునాతన స్కానింగ్ సౌకర్యాల కారణంగా వాళ్ల సరైన చికిత్సల ద్వారా స్వస్థతనొందుతారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్రెస్ట్, సర్వైకల్, ఓరల్, థైరాయిడ్లతోపాటు కేన్సర్ వంటి వాటికి అధునాతన వైద్యం లభిస్తుంది.అనేక రాష్ట్రాల్లో అవగాహన లేమి కారణంగా వ్యాధి ముదిరిన తర్వాతనే వైద్యం మొదలైన కారణంగా ఎంతో కాలం రోగి బతికేందుకు చాన్సులు బహుతక్కువని పిటిషనర్ పేర్కొన్నారు. వైద్యానికి లొంగిన ఇన్నాళ్లూ చెప్పుకుంటూ వస్తున్న కేన్సర్‌కు ఇక 'టీకా' దొరికిందన్న వార్త ఎంతో శుభసూచకం. కానీ అది ఏదశలో వాడాలి. ఎలా వాడాలి అన్న అంశాలపై స్పష్టమైన వైద్య అవగాహన ప్రభుత్వ రోజుల్లో ఆసుపత్రి డేటా బేసులు ప్రభుత్వ బీమా పథకాలతో అనుసంధాన నింపబడిన డేటాలేనిదే కేన్సర్ చికిత్స ప్యాకేజీగాని పరిస్థితి ఉంది. ఇన్ని పద్ధతిగా జరిగితే కేన్సర్ రోగుల సంఖ్య నానాటికీ తగ్గుముఖాన్ని పట్టినందుకు శుభ పరిణామం కాగలదు.

# 'పులి' ఉంటేనే అడవికి మనుగడ!

***నేపాల్‌లో బఫర్‌జోన్ కమ్యూనిటీ ఫారెస్ట్ మోడల్ సక్సెస్ అయ్యింది. అక్కడ స్థానికులకు టూరిజం ఆదాయంలో వాటా ఇచ్చారు. ఫలితంగా వారు స్వచ్ఛందంగా పులులను కంటికి రెప్పలా కాపాడుతున్నారు. రష్యాలో 'అముర్ టైగర్' కోసం గ్రామాలచుట్టూ ఎర్లీవార్నింగ్ సిస్టమ్ పెట్టారు. మనం కూడా ఇలాంటి మోడల్స్‌ని ఆచరణలోకి తెస్తే మరిన్ని ఆశించిన ఫలితాలు రావచ్చు. అంకితభావం గల అటవీ అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతర నిఘాలో రిజర్వ్ అడవులలో పులులసంఖ్య పెరిగినట్టే, ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతేపులి బఫర్ జోన్ దాటి టైగర్ కారిడార్‌లో కూడా సురక్షితంగా బతక గలుగుతుంది. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రభుత్వాలకూ, పౌర సమాజానికి, పత్రికలూ, ప్రసార సాధనాల సహకారం, వన్యప్రాణుల సంరక్షణ కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రభుత్వేతర సంస్థల క్రియాశీలక పాత్రలు తోడైతే ఇది 21వ శతాబ్దపు అతి గొప్ప 'పెద్దపులి సంరక్షణ' కార్యక్రమంగా నిలుస్తుందని చెప్పక తప్పదు.***



డా. నీలం సంపత్

పులుల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమౌతుందనే పర్యావరణ వేత్తల అభిప్రాయాన్ని గౌరవిస్తూ మన దేశంలో పులుల సంరక్షణ కోసం ప్రభుత్వాలు త్రికరణ శుద్ధిగా కృషి చేస్తుండడం అభినందనీయం. స్వతంత్ర భారతంలో తొలి ఇరవై ఐదు సంవత్సరాల కాలంలో దేశంలో పులుల సంఖ్య గణనీయం గాతగ్గి పులి సంతతి దేశంలో అంతర్థానమోతుందేమోననే భయం మొదలైంది. పర్యవసానంగా పులుల సంరక్షణ కోసం 1973లో ప్రాజెక్ట్ టైగర్‌ను భారత ప్రభుత్వం ప్రారంభించింది.తద్వారా పులుల సంరక్షణలో మన దేశం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది. ఇది బహిరంగ రహస్యం. మొదట 9 రిజర్వ్‌లు, 18,278 చ.కి.మీ.ల నుండి నేడు 58రిజర్వ్‌లు,84,488 చ.కి.మీ.కు పెరిగింది. ఇది దేశ భూభాగంలో 2.6 కావడం గమనార్హం. రిజర్వ్ ఫారెస్ట్‌ల ఏర్పాటు,ఆదివాసీల తోడ్పాటు, సుశిక్షితులైన అటవీ అధికారుల స్ఫూర్తిదాయకమైన మార్గదర్శకత్వం, క్షేత్ర స్థాయి అటవీశాఖ సిబ్బంది త్యాగాల ఫలితంగా 2006లో 1,411గా ఉన్న పులులసంఖ్య 2022లో 3,682కి పెరిగింది. ప్రపంచ పులుల్లో 75 భారత్‌లోనే ఉన్నాయి. ఈ అద్భుతమైన విజయగాథ చిరస్మరణీయమే. రిజర్వ్ అడవులలో పెరుగుతున్న పులులు ఇరుకుగా మారిన వాటి ఆవాసాలలో ఇమడలేక రిజర్వ్ అడవుల్లో చోటుచాలక 3540 పులులు ఇప్పుడు రిజర్వ్ ఫారెస్ట్ బయటకు వలస వెళ్లాల్సివస్తోంది. నూతన ఆవాసాల అన్వేషణలో పులులు గ్రామాలు, పొలాలు, రోడ్లతో కూడిన జనావాసాల వైపు దూసుకువస్తున్నాయి.దీంతో మనిషిపులి ఘర్షణలు పెరుగుతున్నాయి. మనుషుల, పశువుల ప్రాణనష్టం జరుగుతోంది. ఫలితంగా పులుల పట్ల ప్రజల్లో తీవ్రవ్యతిరేకత, భయం పెరిగి వాటిని వేటాడే పరిస్థితులు వస్తున్నాయి. తెలంగాణ, కర్ణాటకతో సహ పలురాష్ట్రాల్లో ప్రజల ఆగ్రహానికి పెద్ద సంఖ్యలో పులులు బలైన వైనం బహిరంగ రహస్యమే. దీనికి తోడు అంతర్జాతీయ విఫణిలో పులి చర్మానికి, గోర్లకు ఉన్న డిమాండ్, 'ఔషధ గుణాలున్నాయి' అనే మూఢనమ్మకాల కారణంగా వేటగాళ్ల ఉచ్చులో పడి రిజర్వ్ అడవుల లోపలే అడపా తడపా పులులు ప్రాణాలు కోల్పోతున్నాయి. దుర్భేద్యమైన రిజర్వ్ అడవులలోనే పోచింగ్ సాధ్యమైనప్పుడు రిజర్వ్ అడవుల బయట పులులను పోచింగ్ బెడద నుండి కాపాడడం కష్టంగా మారుతుందని చెప్పక తప్పదు. ఈ సమస్య పరిష్కారానికి 2025 అక్టోబర్ 6న డెహ్రాడూన్ లోని ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్‌లో జరిగిన వైల్డ్ లైఫ్ వీక్‌లో భాగంగా కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ,నేషనల్ టైగర్‌కన్జర్వేషన్ అథారిటీలు సంయుక్తంగా రూ.88.7 కోట్ల బడ్జెట్‌తో మూడు సంవత్సరాల కాలపరిమితితో టిఒటిఆర్ అనే వినూత్న పులుల సంరక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది.రిజర్వ్‌ఫారెస్ట్ బయట కూడా శాస్త్రీయంగా, ల్యాండ్‌స్కేప్ ఆధారితంగా పులులను కాపాడటం.అదే సమయంలో మనుషుల ప్రాణాలు,జీవనోపాధికి భంగం కలగకుండా చూడటం. రియాక్టివ్‌గా కాకుండా ప్రోయాక్టివ్‌గా, టెక్నాలజీ, ప్రజల భాగస్వామ్యంతో పని చేయడమే దీని స్ఫూర్తి. త్రిముఖ వ్యూహంగా టి.ఒ.టి.ఆర్ పని చేస్తుంది? కమ్యూనికేషన్ సిస్టమ్స్ అప్ గ్రేడ్, త్వరితగతిన స్పందించే రెస్క్యూ టీములు,రెస్క్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మెరుగుపరచడం. రిజర్వ్ అడవుల బయట మనుషులు పులులు కలిసి జీవించే పరిస్థితులుసృష్టించడం. అవగాహన కార్యక్రమాలు, నష్టపోయిన వారికి సకాలంలో పరిహారం. ఆలస్యం చేస్తే ప్రజలు



ప్రభుత్వంపై నమ్మకం కోల్పోతారు. గ్రామస్తులను భాగస్వాములుగా చేయాలి.ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ 2022 ప్రకారం 212 ఫారెస్ట్ డివిజన్లలో పులులున్నాయి.వాటిలో మొదటి ఫేజ్‌గా 9 రాష్ట్రాల్లోని 40డివిజన్లను ఎంపిక చేయడం జరిగింది. అవి ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, అస్సాం, తెలంగాణలు. తెలంగాణలో కవ్వాల్ టైగర్ రిజర్వ్‌ను ఎంపిక చేయడం హర్షనీయమే. సమీప గతంలో మహారాష్ట్రలోని తాడోబా, తిప్పేశ్వర్, ఛత్తీస్‌గఢ్ ఇంద్రావతి నుండి కవ్వాల్‌కు పులులు వచ్చేందుకు కుమ్రం భీం టైగర్ కన్జర్వేషన్ కారిడార్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక రిజర్వ్ నుండి మరో రిజర్వ్‌కు పులులు వలసవెళ్లే క్రమంలో అనివార్యంగా రిజర్వ్ బయట వాటిసంచారం కనిపిస్తోంది.అందుకే రిజర్వ్ బయట వాటి సంరక్షణ కోసమే టి.ఒ.టి.ఆర్‌ను ప్రతిపాదించారు. గతంలో రిజర్వ్ ఫారెస్ట్‌లను వ్యతిరేకించిన రాజకీయ పార్టీలే నిన్న గాక మొన్న టైగర్ కారిడార్ ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజనులను, సమీప ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజనేతరులను టైగర్ కారిడార్‌కు వ్యతిరేకంగా రెచ్చగొట్టిన వైనం శోచనీయం. పులుల సంరక్షణతో పర్యావరణ పరిరక్షణ, సుస్థిరతతో కూడిన అభివృద్ధి జరుగుతుందన్న విషయాన్ని పక్కనపెట్టి కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఈధోరణిని ప్రదర్శించడం దురదృష్టకరమనేది పులుల సంరక్షణ నిపుణుల నిశ్చితాభిప్రాయం. ఎందుకంటే టైగర్ కారిడార్ మూలంగా పోడుసేద్యం చేసుకుంటున్న గిరిజనులు,గిరిజనేతరుల ఆవాసాలు చెదిరి వారి మనుగడే ప్రమాదంలో పడుతుందని వాదిస్తున్న రాజకీయపార్టీల నేతలు దేశంలో అనేక ఇతరరాష్ట్రాలలో పాలన కొనసాగిస్తున్న తమ పార్టీ ప్రభుత్వాలు అభివృద్ధిసాకుతో లక్షల హెక్టార్ల అటవీ భూములను కార్పొరేట్లకు అప్పణంగా అప్పగిస్తుంటే మౌనంగా ఉండడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమే ననేది పర్యావరణ వేత్తల అభిప్రాయం. ఈ పరిస్థితులలో కొమ్రం భీం టైగర్ కారిడార్‌లో పోయినేడాది ప్రవేశపెట్టిన టి.ఓ.టి.ఆర్‌కు రాజకీయ పార్టీల నేతలు ఏవిధంగా సహకరిస్తారో వేచిచూడక తప్పదు. మరోవైపు గ్రామాల్లో పులి మ్యానీటర్ గామారింది 'పులి వస్తే చంపేయాలి' అనే భయం ఉంది.ఈ భయాన్ని పోగొట్టి 'పులి ఉంటే అడవి బాగుంటుంది,అడవితోనే మానవ మనుగడ సుస్థిరమౌతుందనే అవగాహన ప్రజలలో కలిగించాలి. టెక్నాలజీ తోడ్పాటు మానవ వనరుల కల్పన గిరిజన భాగస్వామ్యంతో పైలట్ ప్రాజెక్ట్ అమలులో వున్న రాష్ట్రాల్లో కెమెరా ట్రాప్స్, డ్రోన్స్,నిఘా, ముందస్తు హెచ్చరికలతో పాటు శిక్షణ పొందిన అటవీ సిబ్బంది, వెటర్నరీ డాక్టర్లు,రెస్క్యూ టీములు పని చేస్తాయి. బాధితులకు పరిహారం వేగంగా అందించడం కూడా జరుగుతోంది.ఇక్కడ అత్యంత కీలకం ఆదివాసీ భాగస్వామ్యం.శతాబ్దాలుగా అడవిలో బ్రతికే గిరిజనులకు పులి కదలికలు,అడవి రహస్యాలు బాగా తెలుసు.వారిని 'ఫారెస్ట్ గార్డ్స్' 'ఈకో గైడ్స్'గా నియమిస్తే టి.ఒ.టి.ఆర్ 200 సక్సెస్ అవుతుంది. వారిని భాగస్వాములు చేయకుండా పైనుండి ఉత్తర్వులుఇస్తే ఈ ప్రాజెక్ట్ ఆశించిన ఫలితాలను అందించడంలో విఫలమయ్యే ప్రమాదం ఉంది. నేపాల్‌లో బఫర్‌జోన్ కమ్యూనిటీ ఫారెస్ట్ మోడల్ సక్సెస్ అయ్యింది. అక్కడ స్థానికులకు టూరిజం ఆదాయంలో వాటా ఇచ్చారు. ఫలితంగా వారు స్వచ్ఛందంగా పులులను కంటికి రెప్పలా కాపాడుతున్నారు. రష్యాలో 'అముర్ టైగర్' కోసం గ్రామాలచుట్టూ ఎర్లీవార్నింగ్ సిస్టమ్ పెట్టారు. మనం కూడా ఇలాంటి మోడల్స్‌ని ఆచరణలోకి తెస్తే మరిన్ని ఆశించిన ఫలితాలు రావచ్చు. అంకితభావం గల అటవీ అధికారుల పర్యవేక్షణలో క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతర నిఘాలో రిజర్వ్‌అడవులలో పులులసంఖ్య పెరిగినట్టే, ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే పులి బఫర్ జోన్ దాటి టైగర్ కారిడార్‌లో కూడా సురక్షితంగా బతక గలుగుతుంది. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రభుత్వాలకూ, పౌర సమాజానికి, పత్రికలూ, ప్రసార సాధ నాల సహకారం, వన్య ప్రాణుల సంరక్షణ కోసం చిత్తశుద్ధి తో పనిచేస్తున్న ప్రభుత్వేతర సంస్థల క్రియాశీలక పాత్రలు తోడైతే ఇది 21వ శతాబ్దపు అతి గొప్ప 'పెద్దపులి సంరక్షణ' కార్యక్రమంగా నిలుస్తుందని

# గిగ్ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళిక

సి.హెచ్.ప్రతాప్

డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారిన శ్రామికులకు సామాజిక భద్రత అవసరం అన్న డిమాండ్ ప్రస్తుతం ఊపందుకుంది. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తున్న కొద్దీ గిగ్, ప్లాట్‌ఫామ్ ఆధారిత ఉపాధి అవకాశాలు వేగంగా పెరుగుతున్నాయి. డెలివరీ సిబ్బంది, క్యాబ్ డ్రైవర్లు, కిరాణా సరుకులు అందించే సిబ్బంది, గృహ సేవలు అందించే కార్మికులు ఆధునిక నగర జీవనానికి అవిభాజ్య భాగంగా మారారు. వినియోగదారుడి ఇంటి గడపకు చేరే ప్రతి సేవ వెనుక ఒక శ్రామికుడి శ్రమ ఉంది. అయితే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు అభివృద్ధి చెందుతున్న వేగంతో కార్మికుల సామాజిక భద్రత కూడా బలోపేతం కావాల్సిన అవసరం ఉంది. గిగ్ పనిలో సమయసౌలభ్యం, కొంత స్వతంత్రత ఆకర్షణీయ అంశాలే. కానీ దాని వెనుకఆదాయ అనిశ్చితి, ఇంధన వ్యయం, వాహన నిర్వహణ భారం, రోడ్డు ప్రమాదాల ముప్పు, వర్షం-ఎండలో పనిచేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అనారోగ్యం లేదా ప్రమాదం కారణంగా పనిచేయలేకపోతే ఆదాయం వెంటనే నిలిచిపోవచ్చు. రేటింగ్‌లు, ప్రోత్సాహకాలు, పనుల కేటాయింపు, ఖాతా నిలిపివేత వంటి ప్లాట్‌ఫామ్ నిర్ణయాలు కూడా జీవనోపాధిపై ప్రభావం చూపగలవు. అందువల్ల ఫ్లెక్సిబిలిటీ పేరుతో భద్రతను విస్మరించడం సమర్థనీయం కాదు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్లాట్‌ఫామ్ బేస్డ్ గిగ్ వర్కర్స్ (రిజిస్ట్రేషన్, సోషల్ సెక్యూరిటీ అండ్ వెల్ఫేర్) యాక్ట్, 2026 ఒక ముఖ్యమైన ముందడుగు. ఈ చట్టం గిగ్ కార్మికుల నమోదు, ప్రత్యేక గుర్తింపు, సంక్షేమ బోర్డు, సంక్షేమ నిధి, సామాజిక భద్రతా పథకాలు, ఫిర్యాదు పరిష్కారం వంటి అంశాలకు వ్యవస్థను కల్పిస్తోంది. అయితే చట్టం అమలులోకి వచ్చే తేదీని ప్రభుత్వం ప్రత్యేక గెజిట్ నోటిఫికేషన్ ద్వారా నిర్ణయించాల్సి ఉంటుంది. అలాగే నిర్దిష్ట బీమా మొత్తం లేదా ప్రతి కార్మికుడికి ఒకే విధమైన సంక్షేమ ప్రయోజనాలను చట్టం నేరుగా హామీ ఇవ్వదు. ప్రభుత్వం రూపొందించే పథకాల ద్వారా ప్రయోజనాలు అమలవుతాయి. ఇక చేయాల్సింది మరింత స్పష్టంగా ఉండాలి. పని గంటలకు గరిష్ఠ పరిమితి, నిర్బంధ విశ్రాంతి విరామాలు, వరుసగా అధిక గంటలు పనిచేయకుండా రక్షణ వంటి నిబంధనలను భవిష్యత్ నియంత్రణలో పరిగణించాలి. ప్రమాదంలో గాయపడినప్పుడు తక్షణ వైద్య సహాయం, ఆసుపత్రి ఖర్చుల భర్తీ, ప్రమాద మరణం లేదా శాశ్వత వైకల్యానికి తగిన పరిహారం కల్పించే సమగ్ర ప్రమాద బీమా అవసరం. కుటుంబ ఆరోగ్యం, ఆసుపత్రి చికిత్స, ప్రసూతి, మానసిక ఆరోగ్యం వంటి అంశాలను కూడా ఆరోగ్య బీమా పరిధిలోకి తీసుకురావాలి.అదేవిధంగా అనారోగ్యం, ప్రమాదం లేదా ప్రసూతి సమయంలో ఆదాయ పరిరక్షణ, వృద్ధాప్యానికి పెన్షన్ లేదా దీర్ఘకాలిక పొదుపు, నైపుణ్యాభివృద్ధి, చట్టపరమైన సహాయం వంటి భద్రతా వ్యవస్థలు అవసరం. ఒక ప్లాట్‌ఫామ్ నుంచి మరొకదానికి మారినా ప్రయోజనాలు కోల్పోకుండా పోర్టబుల్ సామాజిక భద్రతా ఖాతా ఏర్పాటు చేయాలి. చెల్లింపులు, కోతలు, ప్రోత్సాహకాలు, రేటింగ్‌లు, అల్గారిథమిక్ నిర్ణయాలపై పారదర్శకత తప్పనిసరి చేయాలి. అన్యాయంగా ఖాతా నిలిపివేతకు స్వతంత్ర అప్పీల్ వ్యవస్థ ఉండాలి. కేంద్ర స్థాయిలో కోడ్ ఆన్‌సోషల్ సెక్యూరిటీ, 2020కూడా గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులను సామాజిక భద్రతా చట్రంలోకి తీసుకొచ్చింది. ఈశ్రమ్ వంటి నమోదు వ్యవస్థలతో రాష్ట్రాల సంక్షేమ పథకాలను అనుసంధానించడం ద్వారా కార్మికుల ప్రయోజనాలను మరింత పోర్టబుల్‌గాచేయవచ్చు. కార్మిక సంక్షేమం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు. ప్లాట్‌ఫామ్ సంస్థలు కూడా తమ వ్యాపార నమూనాలో సామాజిక భద్రతా వ్యయాన్ని అంతర్భాగంగా చూడాలి. తెలంగాణ ప్రభుత్వం గతంలో ప్రతిపాదించిన విధానంలోప్రమాద, ఆరోగ్య బీమాకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది కూడా. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ విజయం యాప్‌ల వేగంతో కాదు. ఆయాప్‌ల వెనుక పనిచేసే మనుషుల భద్రత, గౌరవం, భవిష్యత్తుతో కొలవాలి.సాంకేతిక ఆవిష్కరణఉపాధిని సృష్టించాలి. గిగ్ ఆర్థికవ్యవస్థకు నిజమైన బలం కావాలంటే ఫ్లెక్సిబిలిటీతో పాటు భద్రత, ఆదాయంతోపాటు బీమా, ఉపాధితో పాటు గౌరవం ప్రతి కార్మికుడికి అందాలి. ●

# సామాన్యుడి నెత్తిపై ధరల పిడుగు



జీ. శ్రీలత

ఒక కుటుంబం ఆర్థిక పరిస్థితిని అంచనా వేయడానికి భారీ ఆర్థిక గణాంకాలు అవసరం లేదు. ఆ కుటుంబం నెలకు తెచ్చే సరుకుల జాబితాను ఒకసారి పరిశీలిస్తే చాలు. బియ్యం,పప్పు, వంటనూనె, పంచదార, గోధుమలు, కూరగాయలు, పాలు, ఇంధనం. వీటి ధరలు ఎంత పెరిగాయి? అనే ప్రశ్నలకు సమాధానం వెతికితే సామాన్యుడి ఆర్థిక స్థితి ఏ దిశగా వెళ్తుందో స్పష్టంగా అర్థమవుతుంది. ప్రస్తుతం దేశంలో అదే జరుగుతోంది. ఆదాయాలు పెరిగే వేగం కంటే నిత్యావసరాల ధరలు పెరుగుతున్న వేగం ఎక్కువగా ఉండటంతో కోట్లాది కుటుంబాల నెలవారీ బడ్జెట్ అస్తవ్యస్తమవుతోంది. ధరల పెరుగుదల ఇప్పుడు కేవలం మార్కెట్‌లో కనిపించే సంఖ్య కాదు.. అది ప్రతి ఇంటి వంటగదిలో కనిపిస్తున్న మంట. గత ఫిబ్రవరి 28 నుంచి ఆగస్టు 3 మధ్య కేవలం ఐదు నెలల వ్యవధిలోనే వంటింట్లో నిత్యం ఉపయోగించే అనేక సరుకుల ధరలు 5 శాతం నుంచి 40శాతం వరకు పెరిగినట్టు మార్కెట్ గణాంకాలు చెబుతున్నాయి. ప్రాథమిక ఆహార వస్తువుల ధరలు పెరగడం అంటే పేద, మధ్యతరగతి కుటుంబాలపై నేరుగా అదనపు భారం పడటమే. సంపాదనలో గణనీయమైన భాగం ఆహారం, ఇంధనం, విద్య, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలకే వెచ్చించాల్సి వస్తే పొదుపు ఎలా సాధ్యం? భవిష్యత్తు కోసం పెట్టుబడి ఎలా పెట్టగలరు? పిల్లల విద్య, ఆరోగ్యం వంటి అవసరాలకు ఎలా కేటాయించగలరు?ధరల పెరుగుదలకు అంతర్జాతీయ పరిణామాలు,యుద్ధాలు, వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులు, ఇంధన ధరలు, దిగుమతులపై ఆధారపడటం వంటి అనేక కారణాలు ఉన్నాయనడంలో సందేహంలేదు. ప్రపంచ ఆర్థికవ్యవస్థ పరస్పర ఆధారితంగా మారిననేపథ్యంలో ఒక దేశంలో జరిగేయుద్ధం, మరో దేశంలో ఏర్పడే వాతావరణ సంక్షోభం కూడా మన వంటింటిపై ప్రభావం చూపుతోంది. యుద్ధాలు ప్రభుత్వాల చేతుల్లో ఉండకపోవచ్చు. వాతావరణాన్ని కూడా నియంత్రించలేం. అంతర్జాతీయ మార్కెట్లను పూర్తిగా శాసించలేం.కానీ వాటి ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి దేశీయమార్కెట్‌ను రక్షించే విధానాలను రూపొందించడం మాత్రం ప్రభుత్వాల బాధ్యత.ఆహారనిల్వలను సమర్థంగా నిర్వహించడం, సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం, రైతులను ప్రోత్సహించడం, దిగుమతులపై అధిక ఆధారపడకుండావ్యూహాలు రూపొందించడం, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరతను అరి కట్టడం వంటి చర్యలు ప్రభుత్వ పరిధిలోనే ఉంటాయి. అందుకే ధరలు పెరిగిన ప్రతిసారి అంతర్జాతీయ పరిస్థితు లను కారణంగా చూపడం



కంటే ప్రభుత్వం ముందస్తుగా ఏం చేసింది? ఇంకా ఏం చేయాలి? అనే ప్రశ్నలకు సమా ధానం చెప్పాల్సిన అవసరం ఉంది. భారతదేశంలో కోట్లాది కుటుంబాలకు బియ్యం కేవలం ఒక ఆహార పదార్థం కాదు. అది వారి రోజువారీ జీవితంలో అత్యంత ప్రాథమిక అవ సరం. అలాంటి బియ్యం ధరలు గణనీయంగా పెరగడం ఆందోళన కలిగించే పరిణామం. దేశంలో 2025-26పంట సంవత్సరంలో వరి ఉత్పత్తి రికార్డు స్థాయిలో ఉంటుందని ప్రభుత్వ అంచనాలున్నప్పటికీ, మార్కెట్‌లో బియ్యం లభ్యత తగ్గి ధరలు పెరగడం విరుద్ధమైన పరిస్థితిని సూచిస్తోంది. ఉత్పత్తి ఉన్నప్పటికీ వినియోగదారుడికి ధర ఎందుకు తగ్గడం లేదు? రైతు నుంచి వినియోగదారుడి వరకు ఉన్న సరఫరా గొలుసులో ఎక్కడ సమస్య ఉంది? నిల్వలు ఎలా ఉన్నాయి?మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా?మధ్యవర్తుల పాత్ర ఎంత? ప్రభుత్వం వద్ద ఉన్న బఫర్ స్టాక్స్ పరిస్థితి ఏమిటి? రైతుకు తగిన ధరరావాలి. అదే సమయంలో వినియోగదారుడిపై అనవసరమైన భారం పడకూడదు. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడమే సమర్థవంతమైన వ్యవసాయ, ఆహార విధానానికి కొలమానం. నిత్యావసర వస్తువుల ధరల్లో వంటనూనెది ప్రత్యేక స్థానం. భారతదేశం తన దేశీయ అవసరాల్లో గణనీయమైన భాగం కోసం దిగుమతులపై ఆధారపడుతోంది.అంతర్జాతీయమార్కెట్లలో ధరలు పెరిగినా, యుద్ధాలు జరిగినా, సముద్ర రవాణాకు అంతరాయం ఏర్పడినా దానిప్రభావం నేరుగా భారతీయ వినియోగదారుడిపై పడుతుంది.ఇది తాత్కాలిక సమస్యగా చూడటం ప్రమాదకరం. దేశీయంగా నూనెగింజల ఉత్పత్తిని పెంచే దీర్ఘకాలిక వ్యూహం అవసరం. రైతులకు మెరుగైన విత్తనాలు, సాగు సాంకేతికత, మార్కెట్ హామీ, గిట్టుబాటు ధర కల్పించకుండా దిగుమతులపై ఆధారపడటంకొనసాగిస్తే ప్రతి అంతర్జాతీయ సంక్షోభం మన వంటింటిని ప్రభావితం చేస్తూనే ఉంటుంది. పంచదార ధరలు 8నుంచి 15 శాతం వరకు పెరగడం మరో ఆందోళనకర పరిణామం. హోల్‌సేల్ మార్కెట్‌లో క్వింటాల్‌కు గణనీయమైన పెరుగుదల నమోదవుతుండగా, దేశంలోని ప్రధాన నగరాల్లోరిటైల్ ధరలు కూడా పైకి కదులుతున్నాయి. సరఫరా తగినంతగా లేకపోతే ధరలు మరింత ఎగిసే అవకాశం ఉంటుంది.వాతావరణ మార్పులు వ్యవసాయ రంగానికి కొత్త సవాళ్లు విసురుతున్నాయి. ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులు వర్షపాతంపై ప్రభావం చూపితే పంటల సాగు, ఉత్పత్తి రెండూ దెబ్బతింటాయి. ఇప్పటికే ఖరీఫ్ పంట విస్తీర్ణం గత ఏడాదితో పోలిస్తే తగ్గినట్టు మార్కెట్ వర్గాల అంచనాలు చెబుతున్నాయి.సాగు తగ్గితే ఉత్పత్తి తగ్గుతుంది. ఉత్పత్తి తగ్గితే సరఫరా తగ్గుతుంది. సరఫరా తగ్గితే ధర పెరుగుతుంది. ధర పెరిగితే చివరికి భారం వినియోగదారుడిపైనే పడుతుంది. ధరలు పెరిగిన తర్వాత స్పందించడం కంటే ధరలు పెరగడానికి దారితీసే పరిస్థితులను ముందుగానే గుర్తించడం ప్రభుత్వాల బాధ్యత. దేశ ఆర్థిక వ్యవస్థకు నిజమైన అద్దం స్టాక్ మార్కెట్ సూచీలు కాదు. సామాన్యుడి వంటగది. ఆ వంటగదిలో మంట అదుపులో ఉన్నప్పుడే దేశ ఆర్థిక ప్రగతి

ఆదర్శాన్ని నిలపడానికి వెయ్యిసార్లు ప్రయత్నించండి. ఆ వెయ్యిసార్లు విఫలమయితే మరొకసారి ప్రయత్నించండి.



స్వామి వివేకానంద

ఆకలి రుచి ఎరుగనట్లే మనకు అవసరమైన దాంట్లో తప్పులు కనిపించవు.



ఆస్కార్‌వైల్డ్

# ప్రజావాక్కు



### పెద్దల సభకు పెద్దలనే పంపాలి

ఒక ప్రయోగం చెయ్యండి సీఎం గారూ గవర్నర్ కోటలో శాసనమండలి సభ్యులకు కానీ రాజ్యసభ సభ్యులకుగాని పూర్వం సమాజంలో రకరకాల సేవలు చేసినవారిని గౌరవంగా గుర్తించి ఆయా పదవులలో నియమించేవారు. లేక ఎన్నుకునేవారు.పార్టీలతో నిమిత్తం లేకుండా ఎన్నుకునేవారు.వావిలాలలాంటివారు అలా ఎన్నికాకబడ్డవారే! అలాంటి వారిని నియమిస్తేనే ఆయా సభలకు గౌరవం పెరుగుతుంది.అలాంటి వారిని నియమిస్తేఅవినీతికి తావు లేకుండా, స్వార్థంలేకుండా నిజంగాసమస్యల మీద పోరాడతారు.అయితే ఈరోజు బాగా డబ్బున్నవారికి,కుల పిచ్చి వాళ్లకు, మత పిచ్చుగాళ్లకు రాజ్యసభ, శాసనమండలిలోకి పంపిస్తున్నారు.మనరాష్ట్రంలో రేపుఇద్దరినిగవర్నరు కోటాలో శాసనమండలికి నియమించబోతున్నారు. సమాజాన్ని బాగా అవగాహన చేసుకున్నవారికి, వివిధ రంగాలలో పని చేస్తున్నవారికి ఇచ్చినట్లయితే ఆయా పదవులకు న్యాయం చేసిన వారవుతారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ప్రవర్తనే ప్రపంచ శత్రువుగా మారుస్తుంది

ప్రపంచాన్ని శాసించాలన్న దురాలోచనతో పలు దేశాలతో కాలు దువ్వి కయ్యం తెచ్చుకుంటున్న ట్రంప్ ప్రపంచ శత్రువుగా మారి ఒంటరౌతున్నాడు.శత్రుత్వం ఒక్కసారిగా పుట్టదు.అది చిన్నచిన్న మాటలవల్ల, చిన్నచిన్న అపార్థాల వల్ల క్రమంగా పెరుగుతుంది. కాని అంతకంటే పెద్ద పెద్ద తప్పులతో కళ్లున్న కబోదిలా ప్రవర్తించడం విడ్డూరంగా ఉంది. అవమానపరిచే మాటలు మాట్లాడితే ఎదుటివారి భావాలను గౌరవించకపోతే కోపంతో,అహంకారంతో మాట్లాడితే ఎప్పుడూ తానే సరైందని భావిస్తే ఇలాంటి ప్రవర్తన వల్ల మనకు దగ్గరగా ఉన్నవాళ్లే దూరమవుతారు. మిత్రులు కూడా శత్రువులుగా మారిపోతారు. ట్రంప్ దీనికి అతీతులు కాదు.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

### ఈ కేవైసీ తప్పనిసరి

రాష్ట్రవ్యాప్తంగా గ్యాస్ సిలిండర్‌కలిగి ఉన్న లబ్ధిదారులందరూ ఎవరి పేరు పై రిజిస్ట్రేషన్ అయిందో వాళ్ళుఈ నెల 15లోపు కచ్చితంగా ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలి. భవిష్యత్‌లో అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశంఉంది.ఇదివరకే ఈకేవైసీ చేసుకున్నవారు మరల చేసుకోవాల్సిన అవసరం లేదని అధికారులు సూచిస్తున్నారు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### సమీకృత ఉపాధి హామీ

ఉపాధి హామీని సుస్థిరం చేయడం వైపు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సగటు కూలి రోజులు 125కి పూర్తి స్థాయిలో చేరుకోవాలి. సమీకృత ఉపాధి వైపు అడుగులు వేయాల్సిందే. మరి అది ఎలాసాధ్యం. పండ్లతోటల పెంపకం వల్లనే సాధ్యం అవుతుంది. లేదా నీటి కుంటల నిర్మాణం వల్లనే సాధ్యం అవుతుంది. సమీకృత ఉపాధి హామీ అంటే ఏమిటి ఒక రైతుకు ఉపాధి హామీ ద్వారా ఒకే దగ్గర వివిధ రూపాలలో లబ్ధి చేకూర్చడం. ఉదాహరణకు పంట కుంటల నిర్మాణం చేసి వాటిలో చేప పిల్లలను పెంచి ఆ చేప కుంటల గట్టు చుట్టూ కూరగాయలు పండ్ల తోటల పెంపకం చేపట్టేట్టు వాళ్లకి అవగాహనా కల్పించాలి. తద్వారా సమీకృత ఉపాధి హామీ సాధ్యం అవుతుంది. తద్వారా ఎక్కువ రోజులు కూలి ఉపాధి హామీలోభాగం కాగలుగుతాడు. వేసవి కాలంలో వ్యవసాయధారులంతా పని లేకుండా ఉంటారు. కావున వారిని 3 నెలల పాటు కాపాడే ఆదాయం అది సమకూర్చగలదు.

- భారత అవినాష్, జనగామ

### శక్తివంతమైన వేదికలు సామాజిక మాధ్యమాలు

సామాజిక మాధ్యమాలు సమాచారాన్ని క్షణాల్లో ప్రపంచమంతా వ్యాప్తి చేసే శక్తివంతమైన వేదికలుగా మారాయి. అయితే అదే వేగంతో తప్పుడు వార్తలు, మార్ఫింగ్ చేసిన వీడియోలు,దారితప్పించే పోస్టులుకూడా విస్తరిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. నిజానిజాలు నిర్ధారించకముందే ఇటువంటిసమాచారం లక్షలాది మందికి చేరి అనవసర భయాందోళనలుసృష్టించడంతోపాటువ్యక్తులప్రతిష్టను దెబ్బతీయగలదు. అంతేకాకుండా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసి సామాజిక సామరస్యానికి విఘాతం కలిగించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా యువత ఎక్కువ సమయం డిజిటల్ వేదికలపైనే గడపడం వల్ల నిర్ధారణ లేని సమాచారాన్ని సులభంగా నమ్మి, ఇతరులకు పంపించే పరిస్థితి ఏర్పడుతోంది.

- హెచ్.సాయిరుత్విక్, శ్రీకాకుళం

### పెరుగుతున్న వృద్ధుల సంఖ్య

ఈమధ్య దేశం మొత్తం మీద వయోవృద్ధుల సంఖ్య, యువకులకంటే ఎక్కువ ఉన్నట్లు తెలిసింది.అది సహజం, వాస్తవం కూడా.యువకుల సంఖ్యాబలం ఎక్కువగా ఉన్నప్పుడే మానవ వనరులు కాస్త ఎక్కువ పొందొచ్చు. ఇది ఆయా పరిస్థితుల్లో వారి ఆరోగ్యాలు, సామాజికస్థితి,అనుకూల ధోరణి ప్రధానం. పెడత్రోవ ధోరణులు అతిగా పెరిగి వ్యక్తి వినాశనం జరుగుతున్నది. ప్రభుత్వం యువకులకు తప్పక ఉపాధి కల్పించాలి.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

గుంటూరు వార్త



# వ్యక్తి దారుణ హత్య

**దుర్గి, ఆగస్టు 12, ప్రభాతవార్త:** దుర్గి మండలం ఓబులేసునిపల్లె గ్రామంలో అర్ధరాత్రి వేళ ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఇంటి బయట నిద్రిస్తున్న వ్యక్తిపై దుండగులు గొడ్డలితో విచక్షణారహితంగా దాడి చేసి ప్రాణాలు తీశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు మరియు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓబులేసునిపల్లె గ్రామానికి చెందిన కొమ్ము ఇమ్మానుయేలు (35) అనే వ్యక్తి మంగళవారం అర్ధరాత్రి వేళ తన ఇంటి బయట నిద్రిస్తున్నాడు. ఒంటరిగా నిద్రిస్తున్న సమయాన్ని అదనుగా చూసుకున్న గుర్తుతెలియని దుండగులు, ముందస్తు పథకం ప్రకారం గొడ్డలితో ఆయనపై దాడికి తెగబడ్డారు. తల, మెడ భాగాల్లో తీవ్ర గాయాలు కావడంతో ఇమ్మానుయేలు అక్కడికక్కడే రక్తపు మడుగులో ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రంగంలోకి దిగిన పోలీసులు:బుధవారం ఉదయం ఈ ఘోర ఉదంతం వెలుగులోకి రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే గురజాల డీఎస్పీ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో సీఐ భాస్కర్, ఎస్సై గోపాల్ మరియు క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి, క్షేత్రస్థాయిలో వేలిముద్రలు, ఇతర కీలక ఆధారాలను సేకరించారు. పాత కక్షలే కారణమా?ప్రాథమిక దర్యాప్తు ప్రకారం.. ఈ దారుణ హత్యకు పాత కక్షలు లేదా వ్యక్తిగత వివాదాలే కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు వేగవంతం చేశారు. పరారీలో ఉన్న నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక పోలీస్ బృందాలను రంగంలోకి దించి వివిధ కోణాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘోర హత్య నేపథ్యంలో ఓబులేసునిపల్లె గ్రామంలో తీవ్ర భయాందోళనలు, ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గ్రామంలో గట్టి భద్రతను ఏర్పాటు చేశారు.

# డీఎస్సీ పై వైకాపా దుష్ప్రచారం దారుణం



**గుంటూరు, ఆగస్టు 12,ప్రభాతవార్త :** రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీ పై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని, నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించే కుట్రలో భాగమేనని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి విమర్శించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో ఎన్నో ఏళ్లుగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది అభ్యర్థుల కలను కూటమి ప్రభుత్వం సాకారం చేసిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. డీఎస్సీ ఫలితాలు విడుదలైన వెంటనే తెనాలి మాజీ ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు (పీఏ) ఉత్తమ ఫలితాలు సాధించారని వైసీపీ నాయకులే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి అభినందనలు తెలిపారని గుర్తుచేశారు. అప్పుడు డీఎస్సీ ప్రక్రియపై ఎలాంటి అనుమానాలు వ్యక్తం చేయకుండా, ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం అదే డీఎస్సీని బోగస్ గా చిత్రీకరించడం వైసీపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాల పేరుతో మోసం జరిగిందని, డీఎస్సీ నిర్వహణ విషయంలో కాలయాపన తప్ప మరోటి చేయలేదని విమర్శించారు. కానీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషితో మెగా డీఎస్సీ ని పారదర్శకంగా నిర్వహించి వేలాది మంది యువతకు ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. ద్యారంగ సంస్కరణలు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ విషయంలో మంత్రి నారా లోకేష్ తీసుకుంటున్న చర్యలు రాష్ట్ర విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాయని గళ్ళా మాధవి కొనియాడారు. నిరుద్యోగ యువత ఆశలను నెరవేర్చిన కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలను ప్రజలు నమ్మరని అన్నారు. తమ పార్టీకి చెందిన వ్యక్తులు ఎంపికైతే గొప్పలు చెప్పుకుని, ఇప్పుడు అదే డీఎస్సీని బోగస్‌గా విమర్శించడం వైసీపీ నాయకుల రాజకీయ అవకాశవాదానికి పరాకాష్ట అని విమర్శించారు. యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడటం మానుకుని, అసత్య ప్రచారాలకు స్వస్తి పలకాలని వైసీపీ నేతలకు హితవు పలికారు.

# ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా మరో ముందడుగు

**-జిజిహెచ్ లో మాతా,శిశు సంరక్షణకు 18 కొత్త వాహనాలు ప్రారంభం..**
**-బాలింతలు,నవజాత శిశువుల సంరక్షణే కూటమి ప్రభుత్వ ధ్యేయం..**
**- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కందుల దుర్గేష్..**



**గుంటూరు మెడికల్ ,ఆగస్టు 12:(ప్రభాతవార్త )** ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులను ప్రోత్సహించి మాతా, శిశు మరణాలను గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ప్రవేశపెట్టినట్లు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర పర్యాటక శాఖ మాత్యులు కందుల దుర్గేష్ తెలిపారు. బుధవారం గుంటూరు నగరంలోని జిజిహెచ్ ప్రాంగణంలో గల కానూరి జింఖానా స్త్రీ శిశు ఆరోగ్య కేంద్రం వద్ద స్థానిక ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తో కలిసి మంత్రి 18 తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ గర్భిణులను ఆస్పత్రికి తీసుకురావడం, ప్రసవానంతరం బాలింతలను, బిడ్డలను సురక్షితంగా ఇంటికి చేర్చడానికి ఈ వాహనాలు ఉపయోగపడతాయన్నారు. ఎయిర్ కండిషన్ తో కూడిన, ఎయిర్ బ్యాగ్‌లు కలిగిన పూర్తి సురక్షితమైన వాహనాలన్నారు. గర్భిణులు మరియు బాలింతలు 102 కాల్ సెంటర్ కు ఫోన్ చేసి ఉచితంగా ఈ సేవలను పొందవచ్చునన్నారు. వారికి తోడుగా ఆసుపత్రి సిబ్బంది కూడా వాహనంలో ఉంటారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా నిన్న ప్రారంభమైన ఈ కార్యక్రమంను గుంటూరు జిల్లాలో ఈరోజు ప్రారంభించామని, జిల్లాకు 18 వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యసాధనలో భాగంగా ఈ వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డా. దుర్గాప్రసాద్, డిఎంహెచ్ఓ డా. విజయలక్ష్మి, డిసిహెచ్ఎస్ డా. రంగారావు, ఆర్ డి ఓ శ్రీనివాసరావు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# వార్డుల వారీగా కేటాయించిన ఈఆటోలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి


## నగర కమిషనర్ కే. మయూర్ అశోక్

**గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 12( ప్రభాతవార్త) :** గుంటూరు వార్డుల వారీగా కేటాయించిన ఈఆటోలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటూ, ప్రతి ఈఆటో తప్పనిసరిగా రోజుకు 1000 ఇళ్ల నుండి చెత్తను సేకరించాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ప్రజారోగ్య అధికారులను, కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం శ్యామలా నగర్, రాజేంద్ర నగర్, బృందావన్ గార్డెన్స్ ప్రాంతాల్లో ఈఆటోల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియను కమిషనర్ నేరుగా పరిశీలించి, తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఈఆటోలు తప్పనిసరిగా ఉదయం 6 గంటలకల్లా వార్డ్ లలో ఉండాలని, ప్రతి ఆటోకి షెడ్యూల్ రూట్ మ్యాప్ ఉండాలని స్పష్టం చేశారు. ఆటోలో నిర్దేశిత వెయ్యి కిలోల సామర్థ్యంతో చెత్తను లోడ్ చేయాలన్నారు. వార్డ్ ల్లో కేటాయించిన ఇళ్ల నుండి నూరు శాతం చెత్త సేకరణ జరగాలన్నారు. నగర పరిధిలోని ఖాళీ స్థలాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, రహదారులపై రాకపోకలకు అంతరాయం కలిగిస్తూ పడి ఉన్న చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. చెత్త తరలింపుకు కేటాయించిన ట్రాక్టర్ లు కూడా ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు క్షేత్ర స్థాయిలోనే ఉండాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో పారదర్శకత కోసం కార్మికులకు తప్పనిసరిగా ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) ద్వారానే హాజరు నమోదు చేయాలని స్పష్టం చేశారు. రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో ఇష్టారాజ్యంగా చెత్తను పడేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు



ఉల్లంఘించిన వారికి స్వచ్ఛ యాప్ ద్వారా అపరాధ రుసుం విధించాలని స్పష్టం చేశారు. కళ్యాణ మండపాలు వంటి బల్క్ వేస్ట్ జనరేటర్లు తమ వద్ద ఉత్పత్తయ్యే వ్యర్థాలను జిందాల్ వేస్ట్‌టుఎనర్జీ ప్లాంట్‌కు వారే స్వయంగా తరలించాలని, లేదా వారి ఆవరణలోనే కంపోస్ట్ యూనిట్లను ఏర్పాటు చేసుకుని చెత్తను ప్రాసెస్ చేసుకోవాలని, ఈ మేరకు వారికి తక్షణమే నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నడింపాలెంలో ఆయూష్ వైద్యశాల నిర్మాణంకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించి, మెరక చేయడానికి నగరంలోని భవన నిర్మాణ వ్యర్థాలను తరలించడానికి చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. పర్యటనలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఈఈ విష్ణు, డిఈఈ వెంకటరమణ, ఎస్ఎస్ సోమశేఖర్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుంటూరు నగరంలో **తాగునీటి కష్టాలు** 10



అవయవదానం పై విస్తృత అవగాహన కల్పించాలి 11




# జీజీహెచ్‌లో జూనియర్ వైద్యుల సమ్మె ఉధృతం..

గుంటూరు మెడికల్,ఆగస్టు 12,(ప్రభాతవార్త)

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం చేపట్టిన సమ్మె బుధవారం ఉధృతమైంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో జూనియర్ వైద్యులు అత్యవసరం కాని వైద్య సేవలను నిలిపివేసి నిరసన కొనసాగిస్తున్నారు. అత్యవసర చికిత్సలు, అత్యవసర శస్త్రచికిత్సలు, అత్యవసర విభాగాల్లో సేవలను మాత్రం కొనసాగిస్తున్నారు. దీంతో సాధారణ వైద్యం కోసం ఆసుపత్రులకు వచ్చిన రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- **రెండు రోజులుగా ప్రభుత్వం-వైద్యుల చర్చలు విఫలం..**
- **అత్యవసర సేవలు మినహా మిగిలిన సేవలకు విరామం..**
- **ఉపకార వేతనం పెంచాలి..**
- **పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు మించొద్దని డిమాండ్..**
- **ఏపీ జూడా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఈశ్వర్ కుమార్..**

ఈ సందర్భంగా ఈశ్వర్‌కుమార్ మాట్లాడుతూ ఉపకార వేతనాన్ని పెంచాలని, పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు మించకుండా చూడాలని కోరారు. జాతీయ వైద్య మండలి నిబంధనల ప్రకారం ఎంఎస్సీ, పీహెచ్‌డీ నియామకాలు 15 శాతానికి లోపే ఉండాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలమయ్యాయని, తమ సమస్యలపై



ప్రభుత్వం పునరాలోచించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో జూనియర్ వైద్యులకు ఆంధ్రప్రదేశ్ కంటే సుమారు 30 శాతం అధికంగా ఉపకార వేతనం అందుతున్నట్లు తెలిపారు. సమ్మె కొనసాగుతున్నప్పటికీ అత్యవసర వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా సేవలు అందిస్తున్నామని ఈశ్వర్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రభుత్వం త్వరగా సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**ప్రధానంగా ఉపకార వేతన సవరణపైనే డిమాండ్..**

జూనియర్ వైద్యులు ప్రధాన డిమాండ్ ఉపకార వేతనాన్ని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సవరించడమే. 2009లో జారీ చేసిన జీవో 287 ప్రకారం వైద్య విద్యార్థులు, జూనియర్ వైద్యులకు చెల్లించే ఉపకార వేతనాన్ని ప్రతి రెండేళ్లకు ఒకసారి 15 శాతం చొప్పున పెంచాల్సి ఉందని సంఘం పేర్కొంటోంది. అయితే నిర్ణీత కాలానికి సవరణ జరగడం లేదని, ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత ఉపకార వేతనం సరిపోవడం లేదని వైద్యులు చెబుతున్నారు. అదే సమయంలో, ప్రతి రెండేళ్లకు 15 శాతం పెంపు కాకుండా 30 శాతం చొప్పున పెంచాలని జూనియర్ వైద్యుల సంఘం డిమాండ్ చేస్తోంది. పని భారం, పెరిగిన జీవన వ్యయం, ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో రోగుల సంఖ్య పెరగడం వంటి అంశాలను వారు ప్రస్తావిస్తున్నారు.

**ప్రభుత్వం ప్రతిపాదన ఏమిటంటే..**

జూనియర్ వైద్యుల డిమాండ్‌కు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం వార్షిక ప్రాతిపదికన ఉపకార వేతనం పెంచే ప్రతిపాదనను చర్చల్లో ఉంచినట్లు సమాచారం. ఇందులో పీజీ వైద్యులకు సంవత్సరానికి 3 శాతం, ఇంటర్న్‌లకు 5 శాతం చొప్పున పెంపు ప్రతిపాదించినట్లు వెల్లడైంది. అయితే రెండేళ్లకు 15 శాతం, ప్రస్తుతం 30 శాతం పెంపు కోరుతున్న జూనియర్ వైద్యుల సంఘం ఈ ప్రతిపాదనపై సంతృప్తి చెందలేదు. దీంతో చర్చలు ఫలించలేదు.

**ప్రభుత్వం-వైద్యుల మధ్య కుదరని ఏకాభిప్రాయం...**

సమ్మె నేపథ్యంలో జూనియర్ వైద్యుల ప్రతినిధులు వైద్య విద్యాశాఖ ఉన్నతాధికారులతో వరుసగా చర్చలు జరిపారు. సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశించినప్పటికీ రెండు రోజుల చర్చల్లోనూ స్పష్టమైన నిర్ణయం రాకపోవడంతో ఆందోళనను కొనసాగించాలని సంఘం నిర్ణయించింది.

**అత్యవసర వైద్య సేవలకు మాత్రం మినహాయింపు...**

సమ్మె కారణంగా సాధారణ వైద్య సేవలు, అత్యవసరం కాని సేవలకు అంతరాయం ఏర్పడుతున్నప్పటికీ ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు చికిత్స అందించేందుకు జూనియర్ వైద్యులు అత్యవసర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. అత్యవసర శస్త్రచికిత్సలను కూడా కొనసాగిస్తున్నారు. దీంతో సమ్మె ప్రభావం ప్రధానంగా సాధారణ వైద్య సేవలు, నిర్దేశిత చికిత్సలు, ఇతర అత్యవసరం కాని సేవలపై పడుతోంది..

**రోగులపై ప్రభావం..**

జీజీహెచ్‌కు ప్రతిరోజూ గుంటూరు జిల్లాతో పాటు పల్నాడు, బాపట్ల, ప్రకాశం తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వస్తుంటారు. జూనియర్ వైద్యుల సమ్మెతో సాధారణ వైద్య సేవలు మందగించడంతో వైద్యుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కొంతమంది రోగులు చికిత్స వాయిదా వేసుకోవాల్సి వస్తుండగా, మరికొందరు ప్రత్యామ్నాయ వైద్య సేవలను ఆశ్రయించాల్సి వస్తోంది. జూనియర్ వైద్యుల డిమాండ్లు-ప్రభుత్వ ప్రతిపాదనల మధ్య వ్యత్యాసం తొలగి, త్వరగా పరిష్కారం లభించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని సంఘం హెచ్చరిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితిని ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తుండగా, రోగులకు ఇబ్బందులు కలగకుండా అత్యవసర వైద్య సేవలు కొనసాగించడంపై అధికారులు దృష్టి సారిస్తున్నారు.

# ఏఎన్‌యు అనుబంధ కళాశాలల్లో ఎఫ్ఆర్ఎస్ అమలు

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్12, ప్రభాతవార్త:** ఏఎన్‌యు పరిధిలో ఉన్న డిగ్రీ, పీజీ, బియిడి, ఇంజనీరింగ్, ఫార్మశీ, న్యాయ శాస్త్రం, వ్యాయామ విద్య వంటి కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫేస్ రికగ్నిషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) అమలు చేయాలని సిడిసి ఇన్‌చార్జ్ డీన్ ఆచార్య వి.రవికుమార్ ఆదేశాలు జారీచేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ విధానం అన్ని కళాశాలలు అమలు చేయాలని సూచించారు. విద్యార్థులకు సంబంధించి ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎఫ్ఆర్ఎస్‌ను 5రోజుల్లో పూర్తిచేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ విధానం ఉన్నత విద్యాశాఖ కమీషనర్ నుంచి అన్ని వర్సిటీల రిజిస్ట్రార్‌లకు ఉత్తర్వులు అందాయి. అందులో వర్సిటీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులకు కూడా ఎఫ్ఆర్ఎస్ అమలు చేయాలని సూచించారు. వర్సిటీలోని అంతర్గత కళాశాలలకు వర్సిటీ అధికారులు ఆదేశిస్తారని సిడిసి డీన్ పేర్కొన్నారు. కాగా, ఈ విధానం ఏఎన్‌యులోని కళాశాలలకు ఎప్పటినుంచి అమలు చేస్తారా లేదా చేస్తే ఎప్పటిలోగా ఆన్‌లైన్ పోర్టల్‌కు అనుసందానం చేస్తారో వేచిచూడాలి.

**ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది**

నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు నెం. S 6231876 రు.ది.06-08-2018 గలది ది.11.08.2026 జిరాక్సు తీయించుకొనుటకు మునిపల్లె నుండి పొన్నూరుకు వచ్చే మార్గ మధ్యలో కనపడకుండా పోయినది. కావున దొరికిన వారు ఈ క్రింది చిరునామాదారుని సంప్రదించగలరు. మునిపల్లె పూజిత సెల్: 7673932427

**ఏఎన్‌యు అభివృద్ధికి దాతల ప్రోత్సాహం స్ఫూర్తిదాయకం**
- ఏపి ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు
- స్వర్ణోత్సవ వేడుకల్లో విశిష్టులకు ఘనసన్మానం
10










## స్వాతంత్ర్య 80వ వార్షికోత్సవం సందర్భంగా సైకిల్ ర్యాలీ

**అచ్చంపేట ఆగస్టు 12 (ప్రభాత వార్త):** భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆగస్టు 13న అన్ని మండల కేంద్రాల్లో సైకిల్ ర్యాలీలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అచ్చంపేట మండలంలో 13082026న ఉదయం 10 గంటలకు వెల్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.మండలం లోని ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అధికారులు, యువత, విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సైకిల్ ర్యాలీ నివిజయవంతంచేయాలనిఎంపీడీవోకోరారు.

## అచ్చంపేటలో జ్ఞానజ్యోతి శిక్షణ తరగతుల పరిశీలన



**అచ్చంపేట ఆగస్టు 12 (ప్రభాత వార్త):** అచ్చంపేట మండలంలోని జడ్పీహెచ్ హైస్కూల్లో అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను స్టేట్ లెవెల్ (కెపిఆరు) రిసోర్స్ పర్సన్ ఎం. గురుబ్రహ్మం సందర్శించారు. ఈ సందర్భంగా జ్ఞానజ్యోతి కార్యక్రమానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలు, విధివిధానాలపై అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు.ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఎన్. మాణిక్యమ్మ, కె. పద్మ, బి. నాగమల్లేశ్వరరావు, పి. బాబురావు, కె. నాగరాజు నిర్వహిస్తున్నారు. మండలంలోని పలువురు అంగన్వాడీ కార్యకర్తలు శిక్షణలో పాల్గొన్నారు.

## క్రోసూరు ఎస్సీ కాలనీలో అర్ధరాత్రి దారుణం



**క్రోసూరు( ఆగస్టు 12 ప్రభాతవార్త )**క్రోసూరు ఎస్సీ కాలనీలో మంగళవారం అర్ధరాత్రి తండ్రి కొడుకులపై కొందరు వ్యక్తులు కిరాతకంగా దాడికి పాల్పడ్డారు. చిలక భాస్కరరావు నాలికకు తీవ్ర గాయాలు అయ్యాయని, కుమారుడు రవికిరణ్పై కూడా దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు.బంధువులు ఇద్దరినీ క్రోసూరు ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. రవికిరణ్ పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు గుంటూరు జీజీహెచ్కు రిఫర్ చేశారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## బిజెపి మండల పార్టీ అధ్యక్షుడిగా సరిపూడి రామారావు



**పెదకూరపాడు ( ఆగస్టు 12 ప్రభాతవార్త )**మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులుగా జలాల్పురం గ్రామానికి చెందిన సరిపూడి రామారావు ని నియమిస్తున్నట్లు పల్నాడు జిల్లా బిజెపి అధ్యక్షులు ఏలూరు శశి కుమార్ తెలిపారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని రామారావుకి అందించారు. రామారావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పెదకూరపాడు మండలంలో బిజెపి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తా అన్నారు. ఈ కార్యక్రమంలో అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు మాజీ బిజెపి అధ్యక్షులు ఆలోకం సుధాకర్ తుళ్లూరు మండల బిజెపి అధ్యక్షులు సరిపూడి సాంబశివరావు పాల్గొన్నారు.

## ఘనంగా తిరంగా సైకిల్ ర్యాలీ



**అచ్చంపేట ఆగస్టు 12 (ప్రభాత వార్త):**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా అచ్చంపేట మండలంలో బుధవారం ఘనంగా తిరంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అచ్చంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పంచాయతీ కార్యాలయం వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యార్థులు, మండల అధికారులు, నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఆగస్టు 12 నుంచి 14వ తేదీ వరకు అచ్చంపేట, వేల్పూరు, పెద్దపాలెం గ్రామాల్లో స్వాతంత్ర్య దినోత్సవ ఔన్నత్యాన్ని చాటేలా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులతో దేశ రక్షణ,ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి ఎన్. సరోజ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి ఏ. ప్రసాద్రావు, మండల అధికారులు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ కన్నా లక్ష్మీనారాయణ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు

**రాజుపాలెం (ఆగస్టు 12, ప్రభాతవార్త):** తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, మాజీ మంత్రి వర్యులు, సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కన్నా లక్ష్మీనారాయణ గారి 73వ జన్మదినం సందర్భంగా రాజుపాలెం మండల తెలుగు యువత అధ్యక్షులు శనగపూల వెంకయ్య గారు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కన్నా లక్ష్మీనారాయణ గారు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజాసేవలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూ, సత్తెనపల్లి నియోజకవర్గ అభివృద్ధికి విశేషంగా సేవలందిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ గారికి భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు శనగపూల వెంకయ్య తెలిపారు.

## కన్నా లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలి

### కార్యక్రమ ఏర్పాట్లపై కమిటీలకు దరువూరి నాగేశ్వరరావు సూచనలు



**సత్తెనపల్లి (ఆగస్టు 12, ప్రభాతవార్త):** తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, మాజీ మంత్రి వర్యులు, సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కన్నా లక్ష్మీనారాయణ గారి 73వ జన్మదినం, 50 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని పురస్కరించుకుని గురువారం గుంటూరు జిల్లా పరిధిలోని శ్రీ కన్వెన్షన్లో జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు దరువూరి నాగేశ్వరరావు తెలిపారు.జన్మదిన వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే పలు కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కమిటీల సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని దరువూరి నాగేశ్వరరావు కోరారు.

## వర్షాభావ పరిస్థితులను తట్టుకునే పంటలను ఎంచుకోవాలి

### రైతులకు వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి సూచనలు



**సత్తెనపల్లి (ఆగస్టు 12, ప్రభాతవార్త):** సత్తెనపల్లి మండలం కట్టమూరు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వర్షాభావ పరిస్థితులు, బెట్టను తట్టుకునే ప్రత్యామ్నాయ పంటలను, తక్కువ కాల పరిమితి గల రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.రైతులు తాము సాగు చేస్తున్న పంటలను రైతు సేవా కేంద్రం సిబ్బంది ద్వారా ఈపంటలో నమోదు చేయించుకోవాలని సూచించారు. అలాగే ఏపీఏఐఎంఎస్ యాప్లో సాగు చేస్తున్న పంటలను నమోదు చేయించుకుని ఎరువులు పొందాలని తెలిపారు.ప్రత్తి పంటలో ప్రస్తుతం ఆశిస్తున్న రసం పీల్చే పురుగుల నివారణకు ఎసిఫేట్ 400 గ్రాములు లేదా ఫ్లోనికామిడ్ 60 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 40 మి.లీ. ఎకరానికి పిచికారీ చేసుకోవాలని సూచించారు. పురుగుమందులతో పాటు పైపాటుగా 191919 లేదా మల్టీకె పోషకాలను పిచికారీ చేసుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## వృద్ధురాలిపై దాడి చేసి బంగారు నగలు అపహరణ

**రాజుపాలెం, ఆగస్టు 12 (ప్రభాత వార్త):** రాజుపాలెం మండలం పెద్దనేమలిపురం గ్రామంలో ఒంటరిగా నివసిస్తున్న 80 ఏళ్ల వృద్ధురాలు దిగుమర్తి వెంకట్రావమ్మపై గుర్తుతెలియని వ్యక్తి దాడి చేసి బంగారు నగలు అపహరించిన ఘటన బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది.వెంకట్రావమ్మ మధ్యాహ్నం భోజనం అనంతరం ఇంట్లో నిద్రిస్తుండగా ఓ అగంతకుడు ఇంట్లోకి ప్రవేశించి ఆమె ముఖంపై దిండు పెట్టి అదిమిపట్టినట్లు బాధితురాలు తెలిపింది. అనంతరం ఆమె చేతులకు ఉన్న నాలుగు బంగారు గాజులు, ఒక ఉంగరం, చెవి మట్టెలను లాక్కెళ్లినట్లు పేర్కొంది.అనంతరం వెంకట్రావమ్మ పెద్దగా కేకలు వేయడంతో అగంతకుడు ఇంటి తలుపు వేసి అక్కడి నుంచి పరారైనట్లు తెలిపింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు, బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకుని ఘటనపై దర్యాప్తు చేపట్టారు. నిందితుడి ఆచూకీ కోసం పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# రాజుపాలెంలో 14వ వార్షిక బ్రహ్మోత్సవాలు

### 15 నుంచి 19 వరకు ప్రతిరోజూ పౌరాణిక నాటక ప్రదర్శనలు

### భక్తులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి పొత్తూరి వేంకట రమ సుబ్బారావు



**రాజుపాలెం (ఆగస్టు 12, ప్రభాతవార్త):** పల్నాడు జిల్లా రాజుపాలెం గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో 14వ వార్షిక మహోత్సవాలను ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు బాలాజీ టెంపుల్ ట్రస్ట్ ఫౌండర్ ట్రస్టీ పొత్తూరి వేంకట రమ సుబ్బారావు తెలిపారు. పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో నిర్వహించే ఈ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రతిరోజూ రాత్రి 7 గంటల నుంచి ప్రముఖ కళాకారులతో పౌరాణిక నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.మహోత్సవాల్లో భాగంగా ఆగస్టు 15న శ్రీ మాధవవర్మ, 16న నర్తనశాల, 17న కురుక్షేత్రం, 18న సత్య హరిశ్చంద్ర, 19న భక్త చింతామణి పౌరాణిక నాటకాలను ప్రదర్శించనున్నారు. ఆయా నాటకాల్లో ప్రముఖ రంగస్థల కళాకారులు వివిధ పాత్రలను పోషించనుండగా, దర్శకత్వం, సంగీతం, వేషధారణ, రంగాలంకరణ తదితర విభాగాల్లో అనుభవజ్ఞులు సేవలందించనున్నారు.

**భక్తి, కళల సమ్మేళనంగా ఉత్సవాలు**

ఐదు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలను భక్తి, ఆధ్యాత్మికతతో పాటు తెలుగు పౌరాణిక రంగస్థల కళలకు ప్రాధాన్యమిచ్చేలా రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. పురాణ, ఇతిహాస కథలను నాటకరూపంలో ప్రదర్శించడం ద్వారా నేటి తరానికి మన సంస్కృతి, సంప్రదాయాలు, ధర్మబద్ధమైన జీవన విలువలను పరిచయం చేయాలనే ఉద్దేశంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పొత్తూరి వేంకట రమ సుబ్బారావు మాట్లాడుతూ రాజుపాలెం శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో ప్రతి సంవత్సరం నిర్వహించే వార్షిక మహోత్సవాలకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఈసారి కూడా ఐదు రోజుల పాటు ప్రత్యేక ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

**ప్రతిరోజూ రాత్రి 7 గంటలకు నాటకాలు**

ఆగస్టు 15 నుంచి 19 వరకు ప్రతిరోజూ రాత్రి 7 గంటల నుంచి పౌరాణిక నాటక ప్రదర్శనలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై నాటకాలను వీక్షించి ఉత్సవాలను విజయవంతం చేయాలని బాలాజీ టెంపుల్ ట్రస్ట్ ఫౌండర్ ట్రస్టీ పొత్తూరి వేంకట రమ సుబ్బారావు కోరారు.ఉత్సవాల సందర్భంగా దేవస్థాన పరిసరాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తిశ్రద్ధలతో జరిగే ఈ ఐదు రోజుల ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

## 22వ వార్డులో ఎమ్మెల్యే డోర్ టు డోర్ క్యాంపెయిన్



**నరసరావుపేట, ఆగస్టు 12 ప్రభాతవార్త :** ఉమ్మడి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న రెండేళ్లనమ్మకం-అభివృద్ధి-సంక్షేమం డోర్ టు డోర్ కార్యక్రమం బుధవారం నరసరావుపేట పట్టణంలోని 22వ వార్డులో జరిగింది. సాయంత్రం 6 గంటలకు నారాయణ జూనియర్ కళాశాల సమీపం నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించారు.నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కార్యక్రమంలో పాల్గొని వార్డులోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలు,చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను స్థానికులకు వివరించారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలనిఎమ్మెల్యేకోరారు.ఎమ్మెల్యే అరవిందబాబు వార్డులో పర్యటించిన సందర్భంగా స్థానికులు ఘన స్వాగతం పలికారు. పలువురు పూలతో స్వాగతం పలకగా, కొందరు పూల వర్షం కురిపించారు. ఎమ్మెల్యేతో స్థానికులు తమ సమస్యలను కూడా ప్రస్తావించగా వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కపలవాయి విజయ్కుమార్, షేక్ మాబు, కనుమూరి లక్ష్మి తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ సత్తెనపల్లి విజయకిరీటంలో మరో కలికితురాయి



**సత్తెనపల్లి (ఆగస్టు 12, ప్రభాతవార్త):** విద్య, సృజనాత్మకత, ప్రతిభా రంగాల్లో విశిష్టతను చాటుకుంటున్న పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ సత్తెనపల్లి మరో ఘనతను సాధించింది. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న 14 ఏళ్ల విద్యార్థి శ్లోక్ గుప్తా జాతీయ స్థాయి యువజన పోటీలో తృతీయ స్థానాన్ని సాధించి పాఠశాల ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటాడు.ది ఆల్ ఇండియా గ్లాస్ మాన్యుఫ్యాక్చరర్స్ ఫెడరేషన్ (ఏఐజీఎంఎఫ్) నిర్వహించిన వార్షిక యువజన పోటీ ..సంస్థల్లో గాజు....లో శ్లోక్ గుప్తా అద్భుత ప్రతిభ కనబరిచాడు. ఈ విజయానికి గుర్తింపుగా రూ.10 వేల నగదు బహుమతిని అందుకోనున్నాడు.దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల నుంచి పాఠశాలలు, కళాశాలలకు చెందిన 2,000 మందికి పైగా విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. 7 నుంచి 24 ఏళ్ల వయస్సు గల విద్యార్థులు కవితలు, చిత్రలేఖనం, ఫొటోగ్రఫీ తదితర సృజనాత్మక ప్రక్రియల ద్వారా సంస్థల్లో గాజు వినియోగం, పర్యావరణ ప్రాధాన్యం, ఆధునిక జీవితంలో గాజు పాత్రను వివరించారు. వేలాది ప్రదర్శనల మధ్య శ్లోక్ గుప్తా తృతీయ బహుమతికి ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. పాఠశాలలోని సానుకూల విద్యా వాతావరణం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, విద్యార్థుల కృషి ఉత్తమ ఫలితాలను అందిస్తున్నాయిపోటీ విజేతలకు అందించే నగదు బహుమతులను షాట్ గ్లాస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రాయోజితం చేసింది. పోటీలో ఎంపికైన అత్యుత్తమ 200 ప్రదర్శనలకు ప్రత్యేకంగా రూపొందించిన గాజు జ్ఞాపికలను కూడా అందజేయనున్నారు.శ్లోక్ గుప్తా సాధించిన విజయంతో పాఠశాల కుటుంబంలో ఆనందం నెలకొంది. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు శ్లోక్ను అభినందిస్తూ అతని ఉజ్జ్వల భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. శ్లోక్ విజయం పాఠశాల విద్యా సంప్రదాయం, ఉపాధ్యాయుల అంకితభావం, విద్యార్థులను ప్రోత్సహించే పాఠశాల సంస్కృతికి నిదర్శనంగా నిలిచిందని పేర్కొన్నారు.

## రాజుపాలెం హత్య కేసులో నిందితుల అరెస్ట్

### ముగ్గురు నిందితుల అదుపులోకి.. జువైనల్ను జేజే బోర్డు ముందు హాజరు



**రాజుపాలెం (ఆగస్టు 12, ప్రభాతవార్త):** పల్నాడు జిల్లా రాజుపాలెం పోలీస్స్టేషన్ పరిధిలోని రాజుపాలెం ఆర్అండ్ఆర్ సెంటర్లో ఈ నెల 3న నూన్సావత్ పవన్కుమార్ నాయక్ మృతి చెందిన ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై రాజుపాలెం పోలీస్స్టేషన్లో క్రైం నంబర్ 77/2026, యూ/ఎస్ 194 బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేశారు.దర్యాప్తులో మృతుడు పవన్కుమార్ నాయక్ను అతని భార్య శ్రావణ సంధ్యా బాయి, మరో బాలుడు కలిసి పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేసినట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఈ నేరానికి దుడుకు రమేష్, మూడావత్ కిరణ్ నాయక్, చిట్యాల తండాకు చెందిన వ్యక్తులు సహకరించినట్లు దర్యాప్తులో తేలినట్లు పేర్కొన్నారు.ఈ కేసులో 12.08.2026న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. జువైనల్ను కూడా అదుపులోకి తీసుకుని గౌరవ జేజే బోర్డు ముందు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. ఘటనకు సంబంధించిన సీన్ రీకన్స్ట్రక్షన్ కూడా నిర్వహించినట్లు పోలీసులు వెల్లడించారు.డీఎస్పీ డాక్టర్ ఎం.వి. చైతన్య పర్యవేక్షణలో సత్తెనపల్లి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. కిరణ్, రాజుపాలెం పోలీస్స్టేషన్ ఎస్ఐ మూడీ కృష్ణ సహకారంతో కేసు దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.

## నూజెండ్లలో జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమం



**నూజెండ్ల,ఆగస్ట్12,ప్రభాతవార్త:** మండల కేంద్రం నూజెండ్లలో జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం బుధవారం రెండవ రోజు ఉత్సాహంగా కొనసాగింది. ఈ ప్రత్యేక శిక్షణా తరగతుల్లో నూజెండ్ల మండల పరిధిలోని అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్స్గా వ్యవహరిస్తున్న స్థానిక ఉపాధ్యాయులు ఘంటా నాగేశ్వరరావు,అజయ్ కుమార్,సుజాత అభ్యర్థులకు పలు కీలక విధివిధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు. వారితో పాటు అంగన్వాడీ సూపర్వైజర్లు ఇన్నాశమ్మ,శివ నాగలక్ష్మి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని అంగన్వాడీల నిర్వహణ,విద్యాబోధనలో నాణ్యతా ప్రమాణాల పెంపుపై పలు సూచనలు చేశారు. ఈ 120 రోజుల శిక్షణ కాలంలో భాగంగా జరుగుతున్న ఈ మూడు రోజుల క్లస్టర్ స్థాయి సదస్సు ద్వారా క్షేత్రస్థాయిలో అంగన్వాడీ సేవలు మరింత బలోపేతం అవుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## నూజెండ్లలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**నూజెండ్ల,ఆగస్ట్12,ప్రభాతవార్త:** మండల కేంద్రం నూజెండ్లలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ బుధవారం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుండి బస్టాండ్ సెంటర్ వరకు సాగిన ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రమేష్ కుమార్,మండల విద్యాశాఖ అధికారులు కాకర్ల సత్యనారాయణ,నలబోలు రవిచంద్ర,మండల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శ్రీనివాసరావు,ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి,ఉపాధ్యాయులు సైకిల్ తొక్కుతూ చేతిలో మువ్వన్నెల జెండా పట్టుకు అంగనవాడీ కార్యకర్తలతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ కుల,మత,ప్రాంత రాజకీయాలకు అతీతంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా చేయాలని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు,పంచాయతీ కార్యదర్శులు నాగూర్ లాలు,రామకృష్ణ,వెంకటేశ్వర్లు,శినిగి నిడమానూరి రత్నం,కార్యాలయ సిబ్బంది,వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నరసరావుపేటలో తాగునీటి సరఫరాకు అంతరాయం

**నరసరావుపేట టౌన్, ఆగస్టు 12 ప్రభాతవార్త :** పట్టణ మంచినీటి సరఫరా విభాగానికి సంబంధించిన ప్రధాన పైపులైన్లకు మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. పట్టణ మంచినీటి సరఫరా వ్యవస్థకు సంబంధించి పైప్ లైన్ లీకు ఏర్పడింది. ఎస్.ఎస్. ఎన్. కాలేజీ గేటు నుంచి కొత్తగా ఏర్పడుతున్న పైపులైన్ పనులు చేపట్టన ున్నట్లు అధికారులు తెలిపారు . ఇందుకోసం 13082026 గురువారం సాయంత్రం నుంచి తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు.అదేవిధంగా 14082026 శుక్రవారం ఉదయం వాటర్ సప్లై నిలుపుదల చేసి లీకేజీల మరమ్మతులు చేపట్టనున్నట్లు అధికారులు తెలియజేశారు. ఈ నేపథ్యంలో పట్టణ ప్రజలు ముందుగానే తాగునీటిని నిల్వ చేసుకుని, అధికారులకుసహకరించాలని పురపాలక సంఘం అధికారులు కోరారు.

## ఎడ్లపాడులో ఘనంగా తిరంగా ర్యాలీ



**యడ్లపాడు, అగస్టు 12, ప్రభాతవార్త :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా ప్రచారంలో భాగంగా యడ్లపాడు గ్రామంలో తిరంగా ర్యాలీని బుధవారం ఘనంగా నిర్వహించారు. యడ్లపాడు స్వర్ణ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన రహదారి వరకు కొనసాగింది. ర్యాలీలో పౌరులు, పాఠశాల విద్యార్థులు, నాయకులు, అధికారులు జాతీయ జెండాలను చేతబూని ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశభక్తిని చాటుతూ నినాదాలు చేస్తూ ర్యాలీగా ముందుకు సాగారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, జాతీయ ఐక్యత, సమగ్రతను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి భావాన్ని పెంపొందించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ర్యాలీతో ఎడ్లపాడు గ్రామంలో దేశభక్తి వాతావరణం నెలకొంది. అనంతరం ప్రధాన కూడలిలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ జె విజయశ్రీ, ఎంపీడివో వి హేమలతాదేవి, ఇవోపిఆర్డి జాకీర్, పంచాయితీ సెక్రటరీ నందూరి బాపిరాజు పాఠశాల విద్యార్దులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఎస్ఐఆర్ గ్రామసభలు



**యడ్లపాడు, ఆగస్టు 12, ప్రభాతవార్త :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా యడ్లపాడు మండలంలో నేటి నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్, మండల స్థాయి ఎన్నికల అధికారి విజయశ్రీ బుధవారం తెలిపారు. మండలంలోని మొత్తం 58 పోలింగ్ బూత్ల పరిధిలో 7,672 మంది ఓటర్లకు సంబంధించి సమస్యలు, అభ్యంతరాలు ఉంటే గ్రామసభల్లో తెలియజేయాలని అధికారులు సూచించారు. ఇందుకు సంబంధించి సంబంధిత ఓటర్లందరికీ నోటీసులు అందజేసినట్లు తెలిపారు. ఈ నెల 13వ తేదీ నుంచి గ్రామసభలు ప్రారంభమై సెప్టెంబర్ 2వ తేదీ వరకు కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు. ఓటర్లు తమకు సంబంధించిన వివరాలను పరిశీలించుకుని ఏవైనా తప్పులు, అభ్యంతరాలు ఉంటే గ్రామసభలలో అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## రహదారి అడ్డంకులను వెంటనే తొలగించండి : అర్డివో



**యడ్లపాడు, అగస్టు 12, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బోయపాలెం గ్రామ సమీపంలో ఉన్న టెక్స్టైల్ పార్కులో అనుసంధానం కాని 19 ఎకరాల భూమిని పరిశీలించినట్లు డివిజనల్ ఆర్డీఓ వి బాలకృష్ణ తెలిపారు. ప్రస్తుతం ఈ భూమి న్యాయస్థానం పరిధిలో ఉన్నందున, దాని భౌగోళిక స్వరూపం, పరిస్థితులను పరిశీలించేందుకు అక్కడికి వచ్చినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా గురుకుల పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారిపై కల్పించిన అడ్డంకులను పరిశీలించిన ఆర్డీఓ.. విద్యార్థులు, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా అడ్డంకులను వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారి వినియోగానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విజయశ్రీ, అర్ఐ సుబ్బారావు, సర్వేయర్ సురేంద్రనాథ్, పంచాయితీ సెక్రటరీ నందూరి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు డ్రగ్స్కు దూరంగా ఉండాలి

### సీనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్



**గురజాల, ఆగస్టు 12 ప్రభాతవార్త :** విద్యార్థులు డ్రగ్స్కు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని సీనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ అన్నారు. బుధవారం పట్టణంలోని వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత తమ హక్కులు, చట్టపరమైన రక్షణపై అవగాహన కలిగి ఉండా లన్నారు. ర్యాగింగ్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉం డా లన్నారు. అనుకోని ప్రమాదాలు, ఇతర న్యాయపరమైన సమస్యలు ఎదరైనప్పుడు పారా లీగల్ వాలంటీరులను సంప్రదించాలన్నారు. పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కలినపంచారు. అనంతరం సబ్జైల్ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కట్ట కాళిదాసు, కత్తి చలమరాజు, ప్రభుదాసు, లాలా అహ్మద్, ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, ఉల్లి సుబ్బారావు, ఎస్ఐ వినోద్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**గురజాల, ఆగస్టు 12 ప్రభాతవార్త :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని పట్టణ ంలో బుధవారం హర్ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. గురజాల నగర పంచాయతీ కార్యాలయం నుంచి బ్రహ్మనాయుడు కూడలి సెంటర్ వరకు పంచాయతీ సిబ్బంది ర్యాలీ జరిపారు. నాగార్జున సాగర్ కుడి కాలువ చైర్మన్ పులుకూరి కాంతారావు, నగర పంచాయతీ చైర్మన్ బడే జానిలు పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన వీరులను యువత స్మరించుకుంటూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. జాతీయ గీతాన్ని ప్రతి ఒక్కరూ నేర్చుకొని గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ శివన్నారాయణ, ఎస్ఐ వినోద్కుమార్, ఎంఈవో సత్యనారాయణ, టీడీపీ కౌన్సిలర్ నేలవెల్లి బొల్లయ్య, మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనా రాయణ, శరమాల హనుమంతురావు, అడపా శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అఖిల భారత విద్యార్థి సమైక్య ఆవిర్భావ దినోత్సవం




**గురజాల, ఆగస్టు 12 ప్రభాతవార్త :** పట్టణంలో బుధవారం అఖిల భారత విద్యార్థి సమైక్య 91వ ఆవిర్భావ దినోత్స వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి దుర్గా ప్రసాద్, నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్ ఆధ్వర్యాన విద్యార్థులతో ర్యాలీ జరిపారు. ఈ కార్యక్రమంలో షేక్ హుస్సేన్, మందపాటి నాగిరెడ్డి, యేచూరి మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా పంటల స్థితిగతుల పరిశీలన




**నరసరావుపేట టౌన్, ఆగస్టు 12 ప్రభాతవార్త :** మండలంలోని ఉప్పపాడు గ్రామంలో ఏపీఏఐ ఎంఎస్ యాప్ ద్వారా సర్వే నంబర్ వారీగా సాగు చేసిన పంటల స్థితిగతులను గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు గుర్తించే ప్రక్రియను జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ ఎం. జగ్గారావు పరిశీలిం చారు. పంటల వివరాలను క్షేత్రస్థాయిలో సక్రమంగా నమోదు చేసి, రైతులకు అందుతున్న వ్యవ సాయ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు..కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్, ఏపీ సీఎన్ఎఫ్ శ్రీమతి కె. అమల కుమారి, నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీ కె.వి. శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి ఐ. శాంతి, గ్రామ ఉద్యాన సహాయకులు శ్రీ ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు

# పల్నాడు జిల్లా వార్త



## ఘనంగా శ్రీ చౌడేశ్వరి అమ్మవారి పుట్టినరోజు వేడుకలు



**రెంటచింతల ప్రభాతవార్త ఆగస్టు 12:**మండల కేంద్రమైన రెంటచింతలలోని శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయాలలో బుధవారం అమ మ్మవారిప పుట్టినరోజు సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు.శ్రీ చౌడేశ్వరీ దేవి అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యే కపూజలు,అమ్మవారికి రంగురంగుల పూలవ నాలలతో అలంకరించడం జరిగింది. శ్రీ చౌడేశ్వరీ దేవి అమ్మవారు కొలిచేవారికి కొంగు బంగారం. ఆషాడమాసం చివరి రోజైన అమావాస్యను పురస్కరించుకుని అమ్మవారికి ఉదయాన్నే అభిషేకం నిర వ్వహించి ప్రత్యేకంగా వ...లతో, పూలమాలలతో, నిమ్మకాయలతో అలంకరించి ప్రత్యేక పూజ లు,కుంకుమార్చన చేశాం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు,భక్తులు,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో ప్రతి రైతు మోములో చిరునవ్వులు

### ఎమ్మెల్యే యరపతినేని



**పిడుగురాళ్ల, ఆగస్టు 12 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వంలో ప్రతి రైతు మోములో చిరునవ్వులు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని బ్రాహ్మణపల్లి, కామేపల్లిన రైతులకు ఆయన పట్టాదారు పాసుపుస్తకాలను అందించి మాట్లాడారు. వైసీపీ హయాంలో రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. రీసర్వే పేరుతో పట్టాదారు పాసుపుస్తకాలపై, హద్దు రాళ్లపై జగన్‌రెడ్డి ఫోటోలను ముద్రించి రాక్షస ఆనందం పొందారన్నారు. రైతుల పూర్వీకుల ఆసఉ్తులను తమ భూములుగా జగన్‌రెడ్డి ఫోటోలు వేయించుకున్నారన్నారు. అందుకే ప్రజలు ఆపార్టీని 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు బుద్ధి తెచ్చుకొని ప్రవర్తించాలన్నారు. జగన్‌రెడ్డి అనుచరులు రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తూ డీఎస్సీ నిర్వహించి ఎంతో మంది ఉపాధ్యాయులకు ఉద్యోగం కల్పించారన్నారు. దీన్ని కూడా రాజకీయం చేస్తూ ధర్నాలంటూ విషప్రచారం చేయడం గంజాయి బ్యాచ్‌తో ఆగడాలు సృష్టించాలనుకోవడం వారి విష సంస్కృతికి నిదర్శనమన్నారు. వీరికి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో రీసర్వే నిర్వహించి ఎవరు భూమిని వారికి అందిస్తూ పట్టాదారు పాస్ పుస్తకాలు మీద ప్రభుత్వ రాజముద్ర ఉంచి ప్రతి ఒక్కరికి అందిస్తున్నట్లు చెప్పారు. గతంలో పల్నాడు ప్రాంతంలో ఎంతో ఫ్యాక్షన్ రాజకీయాలు ఉండేవని, టీడీపీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వాటన్నింటిని రూపుమాపి అభివృద్ధి పథంలో నడుపుతున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో పోలవరం ప్రాజెక్ట్, రాజధాని రూపకల్పన వంటి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బ్రాహ్మణపల్లిలో ఏర్పాటైన మెడికల్ కళాశాల వైద్యశాల నిర్మాణంతో పల్నాడు ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. వైద్య సౌకర్యాల కోసం హైదరాబాద్, గుంటూరు వెళ్లనవసరం లేకుండా ఎంతో మంచి వైద్య సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ మధుబాబు, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, టీడీపీ మండల అధ్యక్షుడు గండికోట వెంకటేశ్వర్లు, ముప్పాళ్ల సాంబయ్య, దాసరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**ప్రతి ఇంటికి సంక్షేమం కూటమి ప్రభుత్వ ధ్యేయం**


ఎమ్మెల్యే యరపతినేని ప్రతి ఇ ఫోటోరైటప్ 12ఎంసిఎల్ 1, 2 జేపీజీంటికి సంక్షేమం, ప్రతి గ్రామం అభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని కామేపల్లిలో నిర్వహించిన రెండేళ్ల నమ్మకం, సంక్షత్రుం, అభివృద్ధి ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజలు కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గండికోట వెంకటేశ్వర్లు, వీరాపురం సొసైటీ బ్యాంకు చైర్మన్ యడ్లపల్లి శివన్నారాయణ, కూటమి నేతలు పాల్గొన్నారు.

## వినుకొండలో ఘనంగా హార్ ఘర్ తిరంగా ర్యాలీ



**వినుకొండ,ఆగస్ట్12,ప్రభాతవార్త:** ఆగస్టు 15 స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా హార్ ఘర్ తిరంగా ర్యాలీ కార్యక్రమం విను కొండ పట్టణంలో బుధవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు కార్యాలయం నుంచి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. పట్టణంలోని ఆర్టిసి బస్టాండ్ సెంటర్ నుంచి శివయ్యస్థూపం ,ఎన్నార్టీ రోడ్డు మీదుగా ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో చీఫ్‌విప్ జీవి విద్యార్థులతో జాతీయ జెండాలు చేతపూని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ ఉత్సాహంగా సైకిల్ తొక్కుతూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ప్ జీవి మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం అనేది కుల,మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా జరుపుకునే జాతీయ పండుగ అని స్పష్టం చేశారు. హార్ ఘర్ తిరంగా కార్యక్రమం దేశభక్తికి,ఐక్యతకు ప్రతీక అన్నారు. అజాధికా అమృత్ మహోత్సవ్ లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2020 నుండి హార్ ఘర్ తిరంగా కార్యక్రమం చేపట్టిందన్నారు. దేశ స్వాతంత్రం కోసం త్యాగాలు చేసిన స్వాతంత్ర సమరయోధులను ప్రతి ఒక్కరు గౌరవించుకోవాలని కోరారు. కుల మత ప్రాంతాలకు అతీతంగా ప్రజలందరూ ఒకే జెండా కిందకు రావడం అనే సందేశాన్ని ప్రతి ఒక్కరిలో పెంపొందించాలన్నారు. జాతీయ జెండా ప్రాముఖ్యతను, గౌరవించే విధానాన్ని ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించాలని అన్నారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు,నాయకులు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వెలుగులు నింపే జిగేల్ లైట్ మాయం..!



**కారంపూడిఆగస్ట్12,ప్రభాతవార్త:** కారంపూడిపట్టణంలోని వీధులు విద్యుత్ కాంతులతో ఉండాలని 2016....2017 సంవత్సరంలో తెలుగుదేశం ప్రభుత్వం సోలార్ లైట్లు ఏర్పాటు చేసింది. నెట్ క్యాప్ కంపె నీకి చెందిన సాంప్రదాయ ఇంధన శాఖ ప్రతి గ్రామంలో సోలార్ వీధిలై ట్లు ఏర్పాటు చేసింది. లైట్లు ఏర్పాటు చేయడం వల్ల పట్టణాలు విద్యుత్ కాంతులతో సర్వాంగ సుం దరంగా మారాయి. సోలార్ లైట్లు ఏర్పాటు చేసిన తర్వాత నెట్ క్యాప్ గ్రామ పంచా యతీ లకు అప్పగించింది. సోలార్ లైట్లు కావడంతో వాటి అంతట అవే రాత్రుల సమయంలో వెలుగు టం జరుగుతుంది. 20 అడుగ ంల ఎత్తుగల సోలార్ లైట్లు కాంతివంతంగా కనిపిస్తు న్నాయి. గత రెండు రోజుల క్రితం గంగ దారి మడుగు వెళ్లే రహదారిలో తిరుణాలకు వచ్చే భకు_ల సౌకర్యార్థం సోలార్ లైట్ ని ఏర్పాటు చేశారు. కొందరు వ్యక్తులు సోలార్ లైట్ అడ్డం అడ్డుగా ఉం దని దాన్ని తొలగించారు. ఆ సోలార్ లైటును ఎక్కడ ఉంచారు కూడా అర్థం కాని పరిస్థితి. గ్రామపంచాయతీ అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో కొందరు వ్యక్తులు తీసుకు వెళ్లినట్టు తెలుస్తుంది.

## ఎ. పి.అర్. డిగ్రీ కాలేజీలో ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం



**విజయపురిసౌత్ ఆగస్ట్ 12, ప్రభాత వార్త::**ఆంధ్ర ప్రదేశ్ రెసిడెన్షియల్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. భారతదేశ గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డా. ఎస్.ఆర్. రంగనాథన్ జయంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని నిర్వహిం చారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. శ్రీనివాసరావ ుమాట్లాడుతూ విద్యార్థులలో పఠనాసక్తిని పెంపొందించడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు విజ్ఞానం, జ్ఞానం మరియు సామాజిక అవగాహనను పెంపొందించుకోవచ్చని పేర్కొ న్నారు.అనంతరం కళాశాల లైబ్రేరియన్ బి.గోపాల కృష్ణ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ విద్యార్థులకు ముద్రిత పుస్తకాలతో పాటు ఈ బుక్స్, ఈజర్నల్స్ మరియు వివిధ డిజిటల్ వనరులను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకొని తమ విద్యా ప్రగతిని మెరుగుపరుచుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తక పఠనం యొక్క ప్రాముఖ్యత, గ్రంథాలయ వినియోగం మరియు డిజిటల్ గ్రంథాలయ వనరులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డిప్యూటీ వార్డెన్ డాక్టర్ కే.యల్.కృష్ణ రావు,అధ్యాపకులు, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మాచర్లకు రైతుబజార్ మంజూరుకు కసరత్తు

### ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన జేసీ సంజనా సిన్హా

**మాచర్ల టౌన్ ఆగష్టు 12 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణంలో రైతు బజార్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించిన స్థలాన్ని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సంజనా సిన్హా,గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ బుధవారం పరిశీలించారు. రైతులు తమ పంట ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించేందుకు వీలుగా రైతు బజార్ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ప్రతిపాదిత స్థలాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మాచర్ల పట్టణంలో రైతు బజార్ ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలానికి జాయింట్ కలెక్టర్ సంజనా సిన్హా చేరుకుని అక్కడి పరిస్థితులను పరిశీలించారు. స్థల విస్తీర్ణం, రైతు బజార్ ఏర్పాటుకు అనుకూలత, ప్రజలకు అందుబాటులో ఉండే విధానం, రహదారి సౌకర్యం, వాహనాల రాకపోకలు,అవసరమైన మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ,తహశీల్దార్ కిరణ్ కుమార్ తదితర అధికారులు ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన వివరాలను జాయింట్ కలెక్టర్‌కు వివరించారు.రైతు బజార్ ఏర్పాటుతో మాచర్ల పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల రైతులకు తమ పంటలను నేరుగా విక్రయించుకునే అవకాశం లభిస్తుందని అధికారులు తెలిపారు.రైతు బజార్ అందుబాటులోకి వస్తే రైతులకు మధ్యవర్తులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గడంతో పాటు, వినియో గదారులకు కూడా తాజా కూరగాయలు,వ్యవసాయ ఉత్పత్తు_లు సరసమైన ధరలకు లభించే అవకాశం ఉంటుంది.ఈ నేపథ్యంలో రైతు బజార్ ఏర్పాటుకు అవసరమైన స్థల ఎంపిక, మౌలిక సదుపాయాలు, మార్కెట్ నిర్వహణకు సంబంధించిన అంశాలను అధికారులు పరిశీలించారు.ప్రతిపాదిత స్థలాన్ని పరి శీలించిన అనంతరం రైతు బజార్ ఏర్పాటుకు సంబంధించిన తదు పరి చర్యలపై అధికారులతో జాయింట్ కలెక్టర్ చర్చి ంచారు.రైతులు,ప్రజలకు ఉపయోగకరంగా ఉండే విధంగా రైతు బజార్ ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు,సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## దుర్గిలో ఘనంగా జాతీయ జెండా ర్యాలీ:

### ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా ఎగరాలి



**దుర్గి,ఆగస్టు12, ప్రభాతవా** మ్తండల కేంద్రమైన దుర్గిలో జాతీయ జెండా విశిష్టతను చాటుతూ అధికారులు, విద్యార్థులు కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. కస్తూర్బా మరియు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ఎంపీడీవో ప్రసాద్, తాసిల్దార్ వర కుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మం డల పరిషత్ కార్యాలయం నుండి బ్యాంకు సెంటర్ వరకు సాగిన ఈ ర్యాలీలో విద్యార్థులు, అధికారులు చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని ఉత్సాహంగా పాల్గొన్నారు.అనంతరం బస్టాండ్ కూడలి వద్ద విద్యార్థులు, అధికారులు భారీ మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ జాతీయ జెండా ప్రాముఖ్యతను తెలుసుకోవాలని, దేశభక్తిని చాటుకునేలా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అందరితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్, ఎమ్మార్వో కార్యాలయాల సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## మాచర్లలో ఘనంగా తిరంగా ర్యాలీ



**మాచర్ల టౌన్ ఆగష్టు 12 ప్రభాతవార్త:**మాచర్ల పట్టణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని బుధవారం ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీలో విద్యార్థులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబూని"వందేమాతరం","భారత్ మాతాకీ జై" అంటూ దేశభక్తి నినాదాలతో పట్టణంలో ఉత్సాహభరిత వాతావరణాన్ని నెలకొల్పారు.మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ రింగురోడ్డు కూడలి, అంబేద్కర్ సెంటర్, బస్టాండ్ మీదుగా కోడెల వరకు కొనసాగింది. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ సమైక్యత, సమగ్రతను చాటేలా ర్యాలీ సాగింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు, అర్బన్ సీఐ షేక్ నజీర్ బేగ్, మున్సిపల్ డీఈ రామ్ నాయక్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు క్రాంతి కుమార్,సీనియర్ నాయకులు పోకూరి కాశీపతి,పట్టణ ప్రధాన కార్యదర్శి ఏచూరి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి


### మాచర్ల రోటరీ క్లబ్ అధ్యక్షులు నాగూర్ వలి



**వెల్దుర్తి:ఆగస్ట్12,ప్రభాతవార్త:** పల్నాడుజిల్లా వెల్దుర్తి మండలం లోని కండ్లకుంట గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల ఆధ్వర్యంలో, వి.సారా స్వరూప సహకారంతో రూ. 10,000 విలువైన వాటర్ కూలర్‌ను పాఠశాలకు అందజేశారు.ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల అధ్యక్షులు పఠాన్ నాగూర్ వలి మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం తరగతి గది పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు సమాజానికి దిశానిర్దేశకులని, బోధనతో పాటు విద్యార్థులలో నైతిక విలువలను పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు.అనంతరం సీనియర్ రొటేరియన్ డాక్టర్ కొండవీటి రామకోటయ్య మాట్లాడుతూ, పరిశుభ్రమైన తాగునీటిని తీసుకోవడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలు, శారీరక రుగ్మతల నుండి దూరంగా ఉండవచ్చని తెలిపారు. పాఠశాలలో పరిశుభ్రత పట్ల ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల, మరియు పి. సారా స్వరూప అందించిన సహకారం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా తమ పాఠశాలకు రోటరీ క్లబ్ ఇలాంటి సేవా కార్యక్రమాలు అందించాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో రోటరీ ట్రెజరర్ ఆవుల వెంకట వీరాంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటర్ల సవరణకు స్వయంగా రావాలి

### దుర్గిలో గురువారం నుంచి ప్రక్రియ 2 గుర్తింపు కార్డులు తప్పనిసరి



**దుర్గి, ఆగస్టు 12 ప్రభాతవార్త:**దుర్గి మండలంలో ఈ నెల 13వ తేదీ గురువారం నుంచి ఓటర్ల ప్రత్యేక ముమ్మర సవరణ శీఃళి ప్రక్రియ ప్రారంభం కానున్నదని మండల తహసిల్దార్ వరకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ప్రక్రియకు సంబంధించి ఇప్పటికే నోటీసులు అందుకున్న ఓటర్లందరూ నోటీసులో పేర్కొన్న తేదీ, సమయం ప్రకారం ఏవైనా రెండు ఒరిజినల్ గుర్తింపు కార్డులతో సంబంధిత అధికారి వద్దకు విచారణకు హాజరుకావాలని ఆదేశించారు.కుటుంబ సభ్యులకు అనుమతి లేదుఎవరి పేరు మీదైతే నోటీసు జారీ చేయబడిందో ఆ వ్యక్తి మాత్రమే స్వయంగా రావాల్సి ఉంటుందని తహసిల్దార్ వర కుమార్ స్పష్టం చేశారు. ఓటరుకు బదులుగా కుటుంబ సభ్యులను గానీ, ఇతరులను గానీ విచారణకు అనుమతించబోమని పేర్కొన్నారు.ఈ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు మండల ఓటర్లందరూ సహకరించాలని ఆయన కోరారు.

## హెచ్ఐవీపై యువతలో విస్తృత అవగాహన కల్పించాలి



**నరసరావుపేట టౌన్, ఆగస్టు 12 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లాలో ఇంటెన్సిఫైడ్ ఐఈసీ (ౖనిది) ప్రచార కార్యక్రమాన్ని స్థానిక కళాశాలలో ప్రారంభించారు. కార్యక్రమానికి జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి అధికారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖవ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఇంటెన్సిఫైడ్ ఐఈసీ ప్రచారాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమం జనవరి 12 నుంచి అక్టోబర్ 12 వరకు కొనసాగుతుందని, ఐసీటీసీ, పీపీటీసీ కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పి స్తారని చెప్పారు.జిల్లాలోని 336 గ్రామాలు, 48 కళాశాలలు, 144 పాఠశాలల్లో హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమాలతో పాటు ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే కళాజాతర బృ ందాల ద్వారా 22 కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో హెచ్ఐవీపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. హ్యా ండ్స్ ఆఫ్ కంపాషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆనంద్ బెంజిమన్ మాట్లాడుతూ హెచ్ఐవీపై సరైన అవగాహన లేకపోవడం వల్ల ప్రజల్లో అనేక అపోహలు, భయాలు ఉన్నాయని అన్నారు. హె చ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించడంలో యువత ముందుకు రావాలని కోరారు .కార్యక్రమంలో దిశ ప్రోగ్రామ్ మేనేజర్ జానీ భాష, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆనంద్ బెం జివ ఎన్, కళాశాల యాజమాన్య ప్రతినిధులు, ఐసీటీసీ కౌన్సిలర్లు, ఏఆర్టీ సిబ్బంది, లింక్ వర్కర్ సి బ్బంది, జిల్లాలోని వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సీఎస్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నా రు.

## శాస్త్రోక్తంగా అహోరాత్రి రుద్రపారాయణం



**నరసరావుపేట, ఆగస్టు 12 ప్రభాతవార్త : :** స్థానిక పాతూరు శివాలయంలో బుధవారం అహోరాత్రి రుద్ర పారాయణం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన రుద్ర పారాయణం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శారదా స్మార్త పురోహిత సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 25 మంది పేద బ్రాహ్మణ కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అలాగే ఐదుగురు పేద విద్యార్థులకు విద్యాభ్యాసానికి తోడ్పాటుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు పేదలు, విద్యార్థులకు అండగా నిలవడం సామాజిక బాధ్యతలో భాగమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ బులియన్ మర్చంట్ అధ్యక్షుడు కపలవాయి విజయ్ కుమార్, టిడిపి నరసరావుపేట పట్టణ అధ్యక్షులు గట్టుపల్లి సత్యనారాయణ, కూటమి నాయకులు, నాయకులు గూడూరు శేఖర్, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## బీసీల సంక్షేమానికి అభివృద్ధికి వైఎస్సార్సీపీ కట్టుబడి ఉంది



**నరసరావుపేట టౌన్, ఆగస్టు 12 ప్రభాతవార్త :** బీసీల సంక్షేమ ానికి, అభివృద్ధికి వైఎస్సార్సీపీ కట్టుబడి ఉందని పలనాడు జిల్లా వైఎస్ఆర్సిపి వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.బీసీ సంక్షేమ సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన బిళ్లకంటి శ్రీనివాసరావు బుధ వారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని గుంట నారు రోడ్డులోని వైఎస్సార్సీపీ పార్టీ కార్యాలయంలో మర్యా పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని బిళ్లకంటి శ్రీనివాసరావు ఘనంగా సన్మాని ంచారు.ఈ సంర్భంగా బీసీల సమస్యలను డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లి, బీసీల అభివృద్ధికి మద్దతు ఇవ్వాలని కోరారు. దీనిపై డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ బీసీల అభివృద్ధి, సంక్షేమానికి తమ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో, ఆయన పాలనలో బీసీలకు జరిగిన మేలును ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.కార్యక్రమంలో ముదిరాజా సంఘం నాయకులు శివ, అంజిబాబు, కొండలు, లక్ష్మయ్యతో పాటు వైఎస్సార్సీపీ రాష్ట్ర మేధావుల ఫోరం కార్యదర్శి ఈ.ఎం. స్వామి తదితరులు పాల్గొన్నారు.

## 300 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ




**నరసరావుపేట,ఆగస్టు 12 ప్రభాతవార్త ::** పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో హార్ ఘర్ తిరంగా ర్యాలీని కలెక్టర్ కృతిక శుక్లా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట శాసన సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు. 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో నరసరావుపేటలో బుధవారం "హార్ ఘర్ తిరంగ్గా ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అద్దయ్య, ఆర్డీవో బాలకృష్ణ, మున్సిపాలిటీ కమిషనర్ రమ్య కీర్తన, వాగ్దేవి కళాశాల డైరెక్టర్ లు రాయల శ్రీనివాసరావు, ఒగూరి నాగేశ్వరరావు, కపలవాయి రాజేంద్ర ప్రసాద్, ఏపీ బులియన్ మర్చంట్ అధ్యక్షులు కపలవాయి విజయ్ కుమార్, విద్యార్థులు, కళాశాల సిబ్బంది, మున్సిపాలిటీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, ఉమ్మడి కూటమి నాయకులు పాల్గొన్నారు.

## సుబాబుల్ తోట ధ్వంసం..

### ప్రాణహాని బెదిరింపులపై పోలీసులకు ఫిర్యాదు

నరసరావుపేట క్రైమ్, ఆగస్టు 12 ప్రభాతవార్త : :రావిపాడు గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 379/బి2లో తమకు చెందిన 2.10 ఎకరాల భూమిలో ఉన్న సుబాబుల్ తోటను కొందరు వ్యక్తులు అనుమతి లేకుండా జేసీబీతో ధ్వంసం చేసి సుమారు రూ.3 లక్షల మేర నష్టం కలిగించారని వెన్న మాధవి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు.తన ఫిర్యాదులో పేర్కొన్న వివరాలను విలేకరులకు బాధితులు వెన్న మాధవి శ్రీనివాసరెడ్డి ధ్వంసం అయిన సుబాబుల్ తోటలో తెలిపారు. ఆగస్టు 7న కొటపాటి సాయి కృష్ణ, గాడిపర్తి శ్రీనివాస్, గాడిపర్తి వంశీకృష్ణ, నడిగడ్డ శ్రీనివాస్ తదితరులు తమ భూమిలోకి ప్రవేశించి తోటను ధ్వంసం చేశారని ఆరోపించారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన తమ కుటుంబ సభ్యులను బెదిరించడంతో పాటు దాడి చేశారని, ప్రాణహాని ఉందని పేర్కొన్నారు. దీంతో డయల్ 100కు ఫోన్ చేసి పోలీసుల సహాయం కోరినట్లు తెలిపారు.భూమి, ఉమ్మడి ఆస్తుకు సంబంధించి గత కొంతకాలంగా కోర్టులో సివిల్ వివాదాలు కొనసాగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో నమోదైన కేసులు, ప్రస్తుత ఘటనకు సంబంధించిన అంశాలను పోలీసు రికార్డుల ద్వారా పరిశీలించి సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు. తమ కుటుంబానికి రక్షణ కల్పించడంతో పాటు తోటకు జరిగిన నష్టాన్ని నమోదు చేసి, బాధ్యులపై చట్టపమైన చర్యలు తీసుకోవాలని వెన్న మాధవి పోలీసులను కోరారు.

## ఎన్. ఈ.సి కళాశాలలో ర్యాగింగ్ పై అవగాహన

**నకరికల్లు,ఆగస్టు 12 ప్రభాతవార్త ::**ఎన్ సీసీ స్పెషల్ యాంటీ ర్యాగింగ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ర్యాగింగ్ వల్ల కలిగే నష్టాలు, చట్టపరమైన పరిణామాలపై నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన కల్పించారు. బుధవారం కళాశాలలో ర్యాగింగ్‌కు తావులేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని నిర్వాహకులు సూచించారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు కార్యదర్శి మిట్టపల్లి రమేష్ లో మాట్లాడుతూ ర్యాగింగ్ వల్ల జరిగే ప్రమాదాలను వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాగింగ్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో"ర్యాగింగ్ ఫ్రీ క్యాంపస్" కోసం అవగాహన కార్యక్రమాన్నినిర్వహించారు. విద్యార్థులు స్నేహభావంతో మెలగాలని, తోటివిద్యార్థును ఇబ్బందులకు గురిచేకుండాపరస్పరంసహకరించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, వివిధ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, విద్యార్థులు ఎలాంటి సమస్య ఎదురైనా కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకురావాలని సూచించారు.

# బాపట్ల జిల్లా వార్త



## జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతులు

**నగరం, ఆగష్టు 12, ప్రభాతవార్త:** అంగన్వాడీ కార్యకర్తలు ఈ శిక్షణ కార్యక్రమాలను ఉపయోగించుకుని మరింత బోధన పద్ధతులు నేర్చుకోవాలని నగరం సీడీపీవో ఎం .సుచిత్ర అన్నారు. బుధవారం ఉల్లిపాలెం హైస్కూల్లో 97 మంది అంగన్వాడీ కార్యకర్తలకు సమగ్ర శిక్ష జ్ఞాన జ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్స్ లో భాగంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం, ఆటల ఆధారిత బోధన, పాఠశాల సంసిద్ధత, తరగతి గది ప్రక్రియలు, మూల్యాంకనం పద్ధతులు, వయసుకు అనుకూలమైన బోధన, అభ్యాసన వంటి విధానాలను అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో చి న్నారులకు ఎలా బోధనా పద్ధతులు నేర్పించాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు , సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## రిమాండ్ ఖైదీ ఆత్మహత్యాయత్నం

**రేపల్లె, ఆగస్టు 12, ప్రభాతవార్త:** బాపట్ల జిల్లా రేపల్లె సబ్ జైలులో బుధవారం రిమాండ్ ఖైదీ ఉయ్యూరు శ్రీనివాసరావు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.వృద్ధురాలి హత్య కేసులో శ్రీనివాసరావు రిమాండ్ ఖైదీగా ఉన్నాడు.సబ్ జైలు వంట గదిలో కూరగాయలు కోసే కత్తి తీసుకున్న శ్రీనివాసరావు కంఠం కింద కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.గమనించిన సబ్ జైలు సిబ్బంది పోలీసులకు సమాచారం అందించి రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.వైద్యులు అత్యవసర చికిత్స చేశారు.పోలీసుల కారణంగా తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడలేదని శ్రీనివాసరావు వెల్లడించాడు.రిమాండ్ ఖైదీ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.శ్రీనివాసరావు వ్యవహారంపై పూర్వాపరాలను పరిశీలించేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## ఈ నెల 14 న ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటాలి

బాపట్ల,ఆగస్టు12,ప్రభాతవార్త.ప్రతినిధి:

ఈ నెల 14 ప్రతి ఇంటి ముందు ఒక్క మొక్కను నాటి సమరక్షించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు.బుధవారం రాత్రి జిల్లా కలెక్టర్ లోని న్యూ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు ఈ నెల15 ననిర్వహించే పోలీసు పెరేడ్ మైదానం నందు నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ పై సంబంధిత అధికారులు ఆర్డీఓ లు,మున్సిపల్ కమిషనర్లు,



యం పిడిఓలు,ఏపిఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూఈ నెల 14న పట్టణాలలో ను మరియు గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి ఇంటి ముందు స్థలంలో ను, లేదా వీధుల్లో రోడ్డు ప్రక్కన,ప్రభుత్వ కార్యాలయాలలో ప్రతి ఒక్కరు మొక్కను నాటి నాటిన మొక్క వద్ద మొక్కను సమరక్షి స్థాని ప్రతిజ్ఞ చేసిన ఫొటో ను సోషియల్ మీడియాలో అప్ లోడ్ చేయాలని ఆదేశించారు.గురువారం సాయంత్రం 4 గంటలకు రేపల్లె మున్సిపాలిటీ నందు రాష్ట్ర ప్రభుత్వము ఆదేశాల మేరకు 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహణలో బాగంగా దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం చేసే లక్ష యంతో మన రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనే నేను కార్యక్రమంలో రాష్ట్రంలోని ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలన్న అంశము పై సైకిల్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు.ర్యాలీ లో ఆర్డీఓ,మున్సిపల్ కమిషనర్, తహాశీల్దార్, యం పి డి ఓ.వార్డు సచివాలయ సిబ్బంది. స్కూల్,కళశాల విద్యార్థులు,తో పాటుగా జిల్లా కలెక్టర్ కూడా సైకిల్ ర్యాలీలో పాల్గొని సైకిల్ తొక్కడం జరుగుతుందని తెలిపారు.అగ్నిమాపక,డిఆర్డీఏ,మెప్మా, గృహనిర్మాణం,సి పిడిఎస్ యల్,డియంహెచ్ ఓ,వ్యవసాయ, ఉద్యాన, పంచాయతీ,స్త్రీ శిశు మహిళ సంక్షేమ,విద్యా,మున్సిపాలిటీ శాఖలు ద్వారా శకటాలు,మరియు స్టాల్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారుల ను ఆదేశించారు.జిల్లా కలెక్టరేట్ నుండి ఇంచార్జి డి ఆర్ ఓ మరియు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న,ఆర్డీఓ బాపట్ల,ఏ.హరి కుమార్,డిఆర్డీఏ, మెప్మా,డ్వామా, ఐసిడి ఎస్,గృహ నిర్మాణ సంస్థ, బి.సింగయ్య,ఆనంద సత్య పాల్,విజయలక్ష్మి,రాధ మాధవి, సిపిఓ.ఏ.ఎస్.రాజు,గ్రామీణ నీటి సరఫరా ఎస్ ఈ.ఆనంతరాజు,పంచాయతీ రాజ్ ఈ ఈ సత్యనారాయణ, జె డి పశు సంవర్ధ శాఖ,వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ అధికారిణి ఏ.లక్ష్మి, డియంహెచ్ ఓ.డాక్టర్ ఎస్.విజయమ్మ,డి ఈ ఓ.శ్రీనివాస్ సింగ్,డి పి ఓ.యల్.ప్రభాకర్ రావు,డి ఐసిజి యం.రామకృష్ణ,ఎస్ ఎస్ పి ఓ.శ్రీనివాసరావు,జలవనరుల శాఖ, ఎస్ ఈ వేణుగోపాల్,డి ఐ ఓ.కోదండరామ్,మున్సిపల్ కమిషనర్ హాసిని, వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్డీఓ లు,మున్సిపల్ కమిషనర్లు,యం పి డి ఓ లు, గ్రామ,వార్డు సచివాలయ సిబ్బంది,ఏపిఓలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్

బాపట్ల,ఆగస్టు12,ప్రభాతవార్త.ప్రతినిధి:

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపట్లలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి., విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. పురపాలక ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ పెదనందిపాడు ఫ్లైఓవర్ సమీపంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. పురపాలక కమిషనర్ ఎం. హాసిని పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.అంబేద్కర్ విగ్రహం వద్ద కలెక్టర్ విద్యార్థులతో స్వాతంత్ర్య దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత సార్వభౌమత్వం, సమగ్రతను కాపాడుతూ వికసిత్ భారత్-2047, స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యాల సాధనలో భాగస్వాములుగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను పెంపొందించేందుకు జిల్లాలోని అన్ని మండలాల్లో సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 13న రేపల్లెలో, ఆగస్టు 14న చీరాలలో కూడా ఇలాంటి ర్యాలీలు నిర్వహింస్తున్నామన్నారు.కార్యక్రమంలో ఆర్డీఓ హరికుమార్, డీఈఓ శ్రీనివాస్ సింగ్, తహసీల్దార్ సలీమా, ఇతర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారిన ధ్వని కాలుష్యం

రేపల్లె-ప్రభాతవార్త


పట్టణ,గ్రామీణ ప్రాంతాలలో మితిమీరిన ధ్వనికాలుష్య సమస్య కారణంగా ప్రజలు తీవ్రమైన అనారోగ్యానికి గురవుతున్నారు.వినికిడి సమస్యతో ఇబ్బందివడుతున్నారు.రక్తపోటు,మానసిక రుగ్మత,అలసట,ఉదర సంబంధమైన వ్యాధులను ఎదుర్కొంటున్నారు.గర్భిణీలు 6వ నెల సమయంలో గర్భస్రావ సమస్యను ఎదుర్కొనే పరిస్థితులు ఏర్పడుతున్నాయని వైద్య నిపుణులు గుర్తించారు.ప్రజల హక్కులకు భంగం కలిగే పరిస్థితులు ఏర్పడినా సంబంధిత శాఖల అధికారులు ధ్వని కాలుష్యాన్ని నియంత్రించడం లేదనే విమర్శలను ఎదుర్కొంటున్నారు.ఇరుగు పొరుగు వారి మధ్య ధ్వని కాలుష్యం సమస్యగా నిలిచింది.ధ్వనికాలుష్య సమస్య ఏర్పడకూడదనే సుప్రీం కోర్టు తీర్పును సైతం లౌడ్ స్పీకర్ నిర్వాహకులు ఉల్లంఘిస్తున్నారు.మైకుల మోతలు, వాహనాల ఎయిర్ హారన్,లోడు వాహనాల పరుగులు రొదపుట్టిస్తున్నాయి.ప్రజల మధ్య సంబంధాలను ఏర్పరచే శ్రవణ మార్గంలో లోపాలు సంభవిస్తే న్యూనతాభావం ఏర్పడుతోంది.చెవికున్న ప్రత్యేక విలువ వినికిడి లోపించినప్పుడు తెలుస్తుంది."చెవికోసిన మేకలా అరుస్తావే,చెవిటివాని ముందు శంఖం ఊదినట్లు,చెవుడూ చెవుడూ అంటే తవుడా తవుడా అన్నట్లు,చెవిదగ్గర కందిరీగలా" అనే లోకోక్తులను ప్రజలు పలు సందర్భాలలో వాడుతున్నారు. మానవునికి చూపునిచ్చే కళ్ళు తరువాత ప్రధానమైన ఇంద్రియం చెవి.కపాలంలో చెవి భాగాలు ఇమిడి ఉన్నాయి.చెవిని వెలుపలి చెవి,మధ్య చెవి,లోపలి చెవి అని మూడు భాగాలుగా విభజించారు.డొప్ప మాదిరి కనిపించే వెలుపలి చెవి భాగాన్ని 'పిన్నా' అంటారు.ఆవు,పిల్లి,కుక్క తదితర జంతువులవలే శబ్దం వచ్చే దిశ వైపుకు చెవి డొప్పలను తిప్పుకునే శక్తి మానవులకు లేదు.దీనికి చర్మ కణజాలంలో నిర్మితమవడమే కారణం.వెలుపలి చెవి ధ్వని తరంగాలను కర్ణాంతర నాళం ద్వారా లోపలకి పంపిస్తుంది.చెవిలో వంకర టింకర సొరంగం(అంగుళం పొడవు) వల్ల సున్నితమైన లోపలి భాగాలకు రక్షణ ఏర్పడుతోంది.లోపల టింపానిక్ మెంబ్రేను పొర మూసివేస్తుంది.చెవి సొరంగంలో నూగు వెంట్రుకలు,నాలుగువేల మైనపు గ్రంధులు ఉన్నాయి.ధూళి, క్రిముల బారి నుంచి రక్షణ ఏర్పడుతోంది.సీబమ్ ద్రవం క్రిమిదోషాలను నివారిస్తుంది.యూస్టేకియన్ నాళం ద్వారా మధ్య చెవి భాగం గొంతు భాగంలోని సప్తపథతో కలిసివుంటుంది.కర్ణభేరికి రెండు వైపులా ఉండే గాలి వత్తిడిని యూస్టేకియన్ నాళం అదుపులో ఉంచుతుంది.మాలియస్,ఇన్‌కస్ స్టేపిస్ ఎముకలతో అతకబడిన చెవిడోలు గొలుసులా ఏర్పడింది.అతి సున్నితమైన లోపలి చెవి పైభాగాన్ని యుట్రిక్యులస్,క్రింది భాగాన్ని సాక్యులస్ అంటారు.శరీర భంగిమలకు సంబంధించి మూడు అర్ధ చంద్రాకారపు నాళములకు యుట్రిక్యులస్ కలుపబడివుంది. సాక్యులస్ నుంచి నత్తగుల్ల మాదిరి ఉండే గొట్టపు భాగం ఏర్పడుతుంది.డొల్ల ఎముకలా వుండే భాగాన్ని కాక్లియా అంటారు.కాక్లియాలోనే శ్రవణ యంత్రాంగం వుంది.జీవకణాలు ఉంటాయి.వరుసగా శ్రవణ నాడుల అంత్యాలు వున్నాయి. కాక్లియాలో బేసిలార్ మెంబ్రేను,రీస్‌నర్స్ మెంబ్రేను అనే పొరలున్నాయి. బేసిలార్ పొరపైన ఆర్గన్ ఆఫ్ కార్టై ఉంది.శబ్దగ్రహణలో ప్రముఖ పాత్రవహించే దీనిపైన 1550 సూక్ష్మ హెయిర్ సెల్స్ వంటివి వున్నాయి.గాలిలో ప్రయాణించే తరంగాలను గ్రహించి శబ్ద స్వభావాలను మెదడుకు చేర్చడానికి వీలుగా చెవి నిర్మితమైంది.వినికిడి మూలంగా పరిసరాలను గుర్తించడం జరుగుతోంది. కాక్లియా నాడిలో 25-30 వేల వెంట్రుక కణాలు, నాడీ కణపు ప్రోగులు వుంటాయి.స్త్రీలు తక్కువ శబ్దానికే ఇష్టపడతుంటారు.శారీరకంగా పురుషుల కంటే స్త్రీలలో శ్రవణేంద్రియాలు బలహీనంగా వుంటాయి.శబ్ద ప్రమాణంలో యూనిట్‌ని డెసిబెల్‌తో పోల్చుతారు.డెసిబెల్ పేరు టెలిఫోన్ కనుగొన్న బెల్ శాస్త్రవేత్త నుంచి వచ్చింది.చిన్నగా వినిపించే శబ్దాన్ని '0' డెసిబెల్‌గా పరిగణిస్తారు.4 అడుగుల దూరం వినిపించే మాటల శబ్దం 20 డెసిబెల్స్‌తో సమానం.70 డెసిబెల్ శబ్దం వలన మానసిక అస్థిరత్వం,వినికిడి దోషం ఏర్పడుతుంది.గ్రైండర్ శబ్దం 70 డెసిబెల్,విద్యుత్ షేవర్ 90 డెసిబెల్,ఎయిర్ డ్రయర్ 108 డెసిబెల్ శబ్దానికి కారణమవుతున్నాయి.వాస్తవంగా 20-25 వేల ప్రకంపనాలను మాత్రమే శబ్దంగా చెవి గుర్తించగలదు.పిల్లల్లో వినికిడి శక్తి సెకండుకు 30 వేల సైకిల్స్ వుంటుంది.యువకులకు 20 వేల సైకిల్స్,వృద్ధులకు 4 వేల సైకిల్స్ శక్తి మాత్రమే వుంటుంది.చెవుల్లో ఆముదం నూనె వేస్తే కురుపులు,ఫంగస్ వ్యాధులు రావడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు పేర్కొంటున్నారు. సీబమ్ ద్రవం వలన చెవి లోపల భాగం తడిగానే వుంటుందంటే ప్రకృతి కల్పించిన సహజ రక్షణ అందుకు కారణం.చింతపండు తింటే గులిమి వస్తుందనేది అపోహ మాత్రమే. చెవిలో పుల్లలు,పిన్నీసులు తిప్పుతుంటే రక్షక గ్రంధులు ఉనికి కోల్పోయే రోగకారక సూక్ష్మ క్రిములు ప్రవేశిస్తాయి.టాన్సిల్స్, జలుబు,సైనసులు,క్రిమి దోషానికి గురైన ఎడినాయిడ్లు వలన మధ్య చెవి అనారోగ్యానికి గురవుతుంది.టింపానిక్ పొరలో రంధ్రం ఏర్పడితే ప్రసార సంబంధమైన లోపం ఏర్పడుతుంది. నరానికి సంబంధించిన మందులను అధికంగా వాడుతుంటే సెరిబెల్లమ్ ప్రాంతంలో కణుతులు ఏర్పడతాయి. మెనింజైటిస్ వ్యాధి వలన వినికిడి లోపం వస్తుంది.ముక్కు,గొంతులలో జలుబు,గాలి,వెలుతురు లేని గృహాలలో నివశించడం,ఆహార లోపం,రోగ నిరోధక శక్తి తగ్గినప్పుడు,ఇన్‌ఫ్లూయెంజా,మీజెల్స్ వంటి వ్యాధి లక్షణాల కారణంగా చెవి నుంచి చీము కారుతుంది.తల క్రిందుల దిశలో పిల్లలకు పాలుపడితే యూస్టేషియన్ నాళం ద్వారా మధ్య చెవిలోకి పాలు ప్రవేశించి చీము కారే ప్రమాదం ఉంది.చెవుల్లో మోత,శబ్దం సరిగ్గా వినిపించకపోవడం, జ్వరం,చెవిపోటు వంటి లక్షణాలు వుంటే క్రిమి దోషం ఉన్నట్లు గ్రహించాలి.చెవిలో గురగురలు ఎక్కువైతే వికారం వలన వాంతులవుతుంటాయి.శ్రవణ శక్తి తగ్గుతుంది.వాహకత లోపం వలన చెముడు వస్తుంది.ధ్వని తరంగాల ఎముకల గొలుసు సవ్యంగా వ్యాపించక పోయినా కాక్లియా లోపల వున్న శ్రవణ నాడి,మెదడులోని శ్రవణ కేంద్రం వ్యాధిగ్రస్తమైతే చెముడు సమస్య ప్రారంభమవుతుంది.కాక్లియా పని చేయకుంటే బ్రహ్మ చెముడుతో సమానం.వినికిడి దోషం వుంటే హియరింగ్ ఎయిడ్ ఉపయోగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది .బ్రహ్మచెముడు కలిగివుంటే ప్రత్యేకమైన ఎలక్ట్రానిక్ పరికరాన్ని వాడుకోవాలి.మినీ కంప్యూటర్,రిసీవర్లను కూడా చెవిటి వారు వినియోగించాల్సి వస్తోంది.ఏదేమైనప్పటికీ చెవుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోకుంటే వినికిడి ప్రసార సంబంధాలకు విఘాతమేర్పడే ప్రమాదం వుంది.

## కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటా సంక్షేమం,అభివృద్ధి

### బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు

బాపట్ల,ఆగస్టు12,ప్రభాతవార్త.ప్రతినిధి:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటూ, అర్హులైన ప్రతి ఇంటికీ సంక్షేమం, ప్రగతి ఫలాలను



అందిస్తోంది" అని బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు తెలిపారు.బాపట్ల పట్టణంలోని 17వ వార్డులో కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "రెండేళ్ల నమ్మకం సంక్షేమం అభివృద్ధికార్యక్రమంలో భాగంగా బుధవారం నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశ్ఠం ప్రచారంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వార్డులోని ప్రతి గడపకూ తిరుగుతూ, స్థానిక ప్రజలతో నేరుగా ముఖాముఖి సంభాషించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలు, నియోజకవర్గ స్థాయిలో చేపట్టిన సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ప్రజలకు అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు.ప్రజాసంక్షేమే ధ్యేయంగా సుపరిపాలన

ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి సమర్థ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అహరహం శ్రమిస్తోందన్నారు.గత రెండేళ్ల పాలనలో ఎలాంటి రాజకీయ తారతమ్యాలు లేకుండా,అత్యంత పారదర్శకమైన విధానంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను చేరవేశామని చెప్పారు.

**ముందంజలో బాపట్ల నియోజకవర్గం:**

"ఒకవైపు పేదరిక నిర్మూలనకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే, మరొకవైపు నియోజకవర్గంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను పరుగులు తీయిస్తున్నామన్నారు. ప్రజల కష్టసుఖాల్లో నిరంతరం తోడుగా ఉంటూ,బాపట్ల నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అన్నిరంగాల్లో ప్రథమ స్థానంలో నిలపడమే నా ఏకైక లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక సుపరిపాలనకు ప్రజల నుంచి ఊహించని రీతిలో విశేష ఆదరణ లభిస్తోంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ ప్రచార కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మందపాటి అంద్రేయ,జిల్లా పార్టీ కార్యదర్శి అల్లంగోపికృష్ణ,వార్డు పార్టీ ఇన్‌చార్జ్ దాసరి వినోద్‌కుమార్,పాశం శివరామ్,శ్రీనివాసరావు,గిరిజారాణి,తెలుగుదేశం,జనసేన, భారతీయ జనతా పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు, నియోజకవర్గ స్థాయి ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి శ్రేణులు, మహిళలు మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

## ప్రతి పథకం క్షేత్రస్థాయికి చేరాలి

### - మంతెనవారిపాలెంలో ఏరియా ఆస్పత్రి పరిధి సిబ్బంది పనితీరుపై సమీక్ష - జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ బి. వేణుగోపాల్

**పిట్టలవానిపాలెం,ఆగస్టు12,ప్రభాతవార్త,:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధి చేకూర్చే కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ఉన్న చివరి పాడి రైతుకు కూడా అందేలా పశుసంవర్ధక శాఖ సిబ్బంది కష్టపడి పనిచేయాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ బి. వేణుగోపాల్ పిలుపునిచ్చారు. బాపట్ల ఏరియా పశు వైద్యశాల పరిధిలోని ఫీల్డ్ సిబ్బంది పనితీరుపై బుధవారం మంతెనవారిపాలెం పశు వైద్యశాల ఆవరణలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏవీహెచ్ సహాయ సంచాలకులు డాక్టర్ వి. శ్రీనివాసరావు నిర్వహణలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ బి. వేణుగోపాల్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ పథకాల లక్ష్యాలను నిర్ణీత సమయంలోగా సాధించేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది పాటించాల్సిన మెలకువలు, తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దిశానిర్దేశం చేశారు.ముఖ్యంగా స్కీమ్ ఫర్ స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ కింద నిర్దేశించిన లక్ష్యాలను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు.బాపట్ల డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూరానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావం వల్ల పశుగ్రాస కొరత ఏర్పడే అవకాశమున్నందున, ముందస్తుగా ఇంటింటి సర్వేనిర్వహించి లభ్యతను అంచనా వేయాలన్నారు.అలాగే ప్రతిష్టాత్మక ఖిగోపాలరత్నఅవార్డుల దరఖాస్తు



ప్రక్రియపై అవగాహన కల్పించారు.చేబ్రోలు పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ జనార్దన్‌రావు మాట్లాడుతూయానిమల్ సెంట్రిక్ అప్రోచ్ (పశువుల కేంద్రీకృత విధానం)తో పాడి పరిశ్రమను మరింత లాభసాటిగా ఎలా మార్చవచ్చో వివరించారు.

అనంతరం పశు వైద్యశాల ఆవరణలో అధికారులతో కలసి మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డివిజన్ సహాయ సంచాలకులు డాక్టర్ నాగిరెడ్డి, డీఎల్‌డీఏ పశువైద్యాధికారి డాక్టర్ చలపతిరావు, వైద్యులు డాక్టర్ శివకుమారి,డాక్టర్ వనజాలక్ష్మి, డాక్టర్ తిరుమలతేజ, డాక్టర్ కిరణ్, డాక్టర్ సాహిత్య, డాక్టర్ అన్సారి, డాక్టర్ నాగార్జున, డాక్టర్ రేచల్ దివ్యలతో పాటు పేరా సిబ్బంది, ఏహెచ్‌ఏలు, గోపాలమిత్రాలు పాల్గొన్నారు.

## వెల్లటూరులో కూటమి రెండేళ్ళ సుపరిపాలన ప్రచారం

**భట్టి ప్రోలు(రేపల్లె), ఆగస్టు 12, ప్రభాతవార్త:** భట్టి ప్రోలు మండలంలోని వెల్లటూరులో బుధవారం వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కూటమి రెండేళ్ళ సుపరిపాలన ప్రచారం నిర్వహించారు.అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.రూ.9 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ఎమ్మెల్యే ఆనందబాబు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి.నాగరాజు,ఎంపిడివో వెంకట రమణ,వేమూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ జిజెవి పూర్ణకుమారి,కాట్రగడ్డ నాగమల్లేశ్వరరావు,వి.శేషుబాబు, పి.సాంబశివరావు, జి.కృష్ణారావు ,కె.రవికుమార్,రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.పి.శ్రీనివాసకుమార్ పాల్గొన్నారు.



## అభివృద్ధి,సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్ళు

### -రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు

**ములుకుదురు(పొన్నూరు), ఆగస్టు 12,ప్రభాతవార్త:** అభివృద్ధి-సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్ళు అని జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి



బొర్రు రామారావు అన్నారు. మండల పరిధిలోని ములుకుదురు గ్రామంలో బుధవారం రెండేళ్ళ నమ్మకం-అభివృద్ధి- సంక్షేమం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమం గణనీయంగా పెరిగిందన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి సూపర్ హిట్ సాధించడం జరిగిందన్నారు. విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వల్లే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్ళలో కొనసాగుతుందన్నారు. అన్ని వర్గాలకు కూటమి ప్రభుత్వంలోనే మేలు జరుగుతుందన్నారు. ఇక నియోజకవర్గంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అభివృద్ధిని పరుగులు తీయిస్తున్నారన్నారు. ప్రతి ఇంటికిఅభివృద్ధి ఫలాలు అందించేవిధంగా నరేంద్రకుమార్ ప్రత్యేక ప్రణాళికలతో దూసుకెళ్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## టిడ్కో గృహాలు అద్దెకు ఇస్తే సహించం

### -ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, ఆగస్టు 12,ప్రభాతవార్త:** టిడ్కో గృహాలు పేద కుటుంబాల నివాస అవసరాల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, అలాంటి గృహాలను




అద్దెకు ఇచ్చినా, ఇతర అవసరాలకు ఉపయోగించినా సహించబోమని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ హెచ్చరించారు. నిడుబ్రోలు టిడ్కో ఇళ్ళ సముదాయలంలో ఆటో స్టాండ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే నరేంద్రకుమార్ అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. అక్రమంగా ఇళ్ళను అద్దెకు ఇచ్చిన వారికి ఇప్పటికే మునిసిపల్ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. గడువు పూర్తయిన తర్వాత నిబంధనలు ఉల్లంఘించిన ఇళ్ళను తిరిగి స్వాధీనం చేసుకుని అర్హులకు కేటాయిస్తామన్నారు.కాలనీలో సుమారు 60ఇళ్ళు అక్రమంగా ఇతరుల ఆధీనంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే విద్యుత్, తాగునీటి సరఫరా నిలిపివేస్తామని, అక్రమ ఆక్రమణలను తొలగిస్తామన్నారు. టిడ్కో కాలనీని ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.తాగునీరు, వీధి దీపాలు, అంతర్గత రహదారులు తదితర మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామన్నారు. మునిసిపల్ ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్సు ఏర్పాటు చేసే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు చెప్పారు.ప్రభుత్వం సుమారు రూ.185కోట్ల వ్యయంతో టిడ్కో గృహాలను నిర్మించి పేదలకు అందించిందన్నారు. ఈ గృహాలను కేవలం నివాస అవసరాల కోసమే వినియోగించాలని, కాలనీలో ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, బండ్లమూడి బాబూరావు, షేక్ బాజిసాహెబ్, జాగర్లమూడి సుధీర్, బొర్రు రామారావు, మాదాల వెంకటేశ్వరరావు, తదితరులున్నారు.

## బ్యాంక్ ఉద్యోగుల డిమాండ్ల సాధనలో యుఎఫ్‌బియు నిరసన

**గుంటూరు కల్చరల్,ఆగష్టు 12,ప్రభాతవార్త :** దేశంలో 7 బ్యాంకు ఉద్యోగుల సంఘాల డిమాండ్లకై యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్(యుఎఫ్‌బియు) తరపున దేశవ్యాప్తంగా అన్ని కేంద్రాలు,జిల్లా హెడ్ క్వార్టర్స్‌ల్లో బ్యాంకు ఉద్యోగులు పెద్దసంఖ్యలో ప్రదర్శనలో పాల్గొని తమ నిరసన వ్యక్తంచేశారు.వారానికి 5రోజుల పనిదినాలను డిమాండ్ చేశారు.ఐబిఏ కూడా 12వ బైపార్‌టైట్ సెటిల్‌మెంట్ లో వారి డిమాండ్లను అంగీకరించినప్పటికీ,ప్రభుత్వం వద్ద చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది.గుంటూరు ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ వద్ద జరిగిన ప్రదర్శనలో గుంటూరు మాడ్యూల్ ఎస్‌బిఐ ఆఫీసర్స్ అసోసియేషన్ చీఫ్ రీజనల్ సెక్రటరీ కె.ఆర్.వి.జయకుమార్,ఎస్‌బిఐ స్టాఫ్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.కోటిరెడ్డి,ఎ.జి.ఎస్ పి.ఎస్.రంగసాయి,యూనైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ నాయకులు కిషోర్,రవిచంద్రారెడ్డి,పి.వి.కళ్యాణ్,రామకృష్ణ,పావనిలు పాల్గొన్నారు.బెఫి స్టేట్ ప్రెసిడెంట్ ఎమ్.సాంబశివరావు మిగిలిన నాయకులతో పాటు వివిధ శాఖల లోకల్ సెక్రటరీలు,బ్యాంక్ సిబ్బంది పాల్గొని పెద్దఎత్తున తమ నిరసనను తెలియచేశారు.

## ఇసి మెంబర్ స్వరూపరాణికి సన్మానం

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్12, ప్రభాతవార్త:** ఏఎన్‌యు ఇసి మెంబర్ ఆచార్య టి.స్వరూపరాణికి వర్సిటీలోని విద్యా విభాగం ఘనంగా సన్మానించింది. సెయింట్ జోసఫ్ బియిడి కళాశాల ప్రిన్సిపాల్‌గా, విద్యా విభాగం డీన్‌గా స్వరూపరాణి పలు విధాలుగా సేవలు అందిస్తున్నారు. విద్యా విభాగం హెచ్‌ఓడి ఆచార్య పి.బ్రహ్మాజీరావు ఇసి మెంబర్ స్వరూపరాణిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇసి మెంబర్‌గా విద్యా విభాగం డీన్ నియమితులవడం విభాగానికి గర్వకారణంగా పేర్కొన్నారు. ఈ సందర్భంలో విభాగం అధ్యాపకులు డాక్టర్ యం.వసంతరావు, డాక్టర్ శివరామిరెడ్డి, కుప్పం వర్సిటీ ప్రొఫెసర్ ఆచార్య విజయవర్ధిని, డాక్టర్ శివలక్ష్మి, విభాగం సిబ్బంది అనిత, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

13-8Pg8_13-8Pg8.qxd 12/Aug/26 11:55 PM Page 1



# సభలో సుదీర్ఘ చర్చకు సిద్ధమే




## స్పీకర్ ఓంబిర్లాకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా లేఖ

## విపక్షాలకు తగిన సమాధానమిస్తామని వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** నీట్ పరీక్ష వ్యవహారం పార్లమెంట్ ఉభయ సభలను కుదిపేస్తోంది. పేపర్ లీక్‌పై చర్చ చేపట్టాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా లేఖ రాశారు. నీట్ పేపర్ లీక్‌పై చర్చకు సిద్ధమని చర్చకు ఎంత సమయం కావాలంటే అంత సమయం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో జరిగే చర్చలో తాను స్వయంగా పాల్గొని ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తే ప్రశ్నలకు సమాధానం ఇస్తానని తెలిపారు. చర్చకు ఎన్ని గంటలు లేదా ఎన్ని రోజులు సమయం కేటాయించాలనే విషయాన్ని ప్రతిపక్షంతో సంప్రదించి పరస్పర అంగీకారంతో నిర్ణయించాలని స్పీకర్‌ను కోరారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రభుత్వ తరఫున నీట్ అంశంపై చర్చకు అంగీకరించిన విషయాన్ని బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ప్రస్తావించినట్లు అమిత్ షా తన లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోపబ్లిక్ ఎగ్జామినేషన్స్ ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్‌మీన్స్ 2026ను ఇప్పటికే చర్చకు తీసుకున్నామని గుర్తుచేశారు. ఆ బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు ఎవరూ నీట్ పరీక్ష అంశాన్ని లేవనెత్తలేదని తెలిపారు. అయినప్పటికీ ఈ అంశంపై మరోసారి చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. పార్లమెంట్ వెలుపల బుధవారం మీడియాతో మాట్లాడిన అమిత్ షా ఏ అంశంపైనైనా చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. అయితే ప్రతిపక్షం సభ కార్యకలాపాలను అడ్డుకుంటోందని ఆరోపించారు. ప్రభుత్వం దాచాల్సిందేమీ లేదని, పార్లమెంట్‌లో ప్రతి ప్రశ్నకు సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. పార్లమెంట్‌లో చర్చకు కొన్ని నిబంధనలు ఉంటాయని, కేవలం ప్రకటన చేసి వెళ్లిపోవడం ద్వారా చర్చ జరగదని స్పష్టం చేశారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి అర్ధరాత్రి వరకు, అవసరమైతే గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా నీట్ అంశంపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని అమిత్ షా తెలిపారు. దేశ ప్రజల ముందు అన్ని విషయాలు స్పష్టమయ్యేలా ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇస్తానని చెప్పారు. పార్లమెంట్‌కు తాను దూరంగా ఉంటున్నానన్న ఆరోపణలను కూడా ఖండించారు. సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి తాను క్రమం తప్పకుండా సభకు హాజరవుతున్నానని, సభలో గందరగోళం కారణంగా చర్చల్లో పాల్గొనే అవకాశం రాలేదని తెలిపారు. నీట్ విద్యార్థుల ఆందోళనలపై సమగ్ర చర్చకు ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని, ఇప్పుడు చర్చకు సమయాన్ని నిర్ణయించడమే మిగిలిందని పేర్కొన్నారు.

**రాహుల్ గాంధీ కౌంటర్**

మరోవైపు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అమిత్ షా వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించారు. అమిత్ షా నుంచి ఎలాంటి ఉపన్యాసం వినేందుకు తాము ఆసక్తిగా లేమని అన్నారు. విద్యార్థుల నిరసనల సమయంలో పెల్లెట్ గన్స్ వినియోగించిన అంశాన్ని ప్రస్తావించారు.

వాటిని ప్రయోగించేందుకు అనుమతి ఎవరు ఇచ్చారో అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పెల్లెట్ గన్స్ వినియోగానికి ఆదేశాలు స్వయంగా అమిత్ షా ఇచ్చి ఉంటే ఆయన రాజీనామా చేయాలని, ఒకవేళ తాను ఆదేశించలేదంటే హోంమంత్రిగా అసమర్థతకు బాధ్యత వహించి పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో అమిత్ షా తన హాజరు గురించి మాట్లాడటంపైనా రాహుల్ స్పందించారు. బుధవారం ఆయన సభకు వచ్చారా లేదా అన్నది తమకు ప్రధాన అంశం కాదని, గత 20 రోజులుగా ఆయన సభకు ఎందుకు దూరంగా ఉన్నారన్నదే తమ ప్రశ్న అని అన్నారు.




# మోడీజీ! మీరు కొంచెం మారారు..

## మోడీ, ఖర్గేలమధ్య సరదా సంభాషణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకురాలు సుప్రియా సూలే కుమార్తె వివాహ విందుకు పలువురు రాజకీయ నాయకులు హాజరయ్యారు. న్యూఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే వంటి వారు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నేతలు తమ రాజకీయ విభేదాలను పక్కన పెట్టి సరదాగా కాసేపు మాట్లాడుకున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోడీ, ప్రియాంకాగాంధీ, ఖర్గేల మధ్య సరదా సంభాషణ జరిగింది. ప్రధాని మోడీ ప్రియాంకా గాంధీ గారు మీరు ఎలా ఉన్నారు.? అని ప్రశ్నించారు. దీనికి బదులుగా ప్రియాంకాగాంధీ నేను బాగున్నాను సార్, మీరు ఎలా ఉన్నారు? అని అడిగారు. దీనికి మోడీ స్పందిస్తూ నేను అంతే అంటూ బదులిచ్చారు. ఇదే సమయంలో ఖర్గే చర్చలోకి చేరి ప్రధాని మోడీతో సోదరా మీరు కొంచెం మారారుఅని అన్నారు. దీనికి ప్రధాని మోడీ స్పందిస్తూ అచ్చా అని అన్నారు. దీంతో అక్కడ ఉన్న నేతల మధ్య నవ్వులు విరబూశాయి. దీని తర్వాత ప్రధాని మోడీ అందరికి చేతులు జోడించి అభివాదం చేసి అక్కడి నుంచి వెళ్లారు. ఈ సమయంలో రాహుల్ గాంధీ కూడా అక్కడే ఉన్నారు. మోడీ, ఖర్గే మధ్య జరిగిన సంభాషణను విని రాహుల్ కూడా చిరునవ్వుతో కనిపించారు. ఖర్గే చేసిన మీరు మారిపోయారు అనే వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్రంగా డీకోడ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఏ సందర్భానుసారం ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారా అని ఆలోచిస్తున్నారు. ఇటీవల ఢిల్లీలో విద్యార్థుల నిరసన నేపథ్యంలో జెన్‌జీ యువతను ఆకట్టుకోవడానికి మోడీ సెల్ఫీ తరహా ఇన్‌స్టాగ్రామ్ వీడియోలుచేశారు. ఈధోరణిపై ఖర్గే అన్నారని భావిస్తున్నారు. మరోవైపు, ఈ కార్యక్రమంలో ఎన్సీసీ ఎస్పీ నేత శరద్ పవార్‌తో మోడీ మాట్లాడుతూ కనిపించారు. ఎన్సీపీ ఎస్పీకి చెందిన ఎంపీలు ఎన్డీయే కూటమిలో చేరుతారనే వార్తలు వినిపించిన నేపథ్యంలో ఈ కలయిక ఆసక్తికరంగా మారింది.



# ఒమన్ తీరంలో నౌకపై హౌతీల దాడి

## యుద్ధంలోకి హౌతీల ఎంట్రీ

**సనా, ఆగస్టు 12:** ఇరాన్‌అమెరికా యుద్ధం మరింత ఉద్రిక్తంగా మారుతోంది. ఇప్పుడీ యుద్ధంలోకి హౌతీలు కూడా చొరబడ్డారు. తాజాగా గల్ఫ్ ఆఫ్ ఒమన్ తీరంలో ఒక నౌకపై హౌతీలు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆరుగురు మరణించినట్లు యెమెన్ వెల్లడించింది. యెమెన్‌లోని ఉగ్రవాద సంస్థ హౌతీస్. ఈ సంస్థకు ఇరాన్ అండగా ఉంటుంది. అందుకే తాజా యుద్ధంలో ఇరాన్ తరఫున ఈ ఉగ్రవాదులుకూడా పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా తాము మూడు మిస్సైల్స్ ప్రయోగించినట్లు యెమెన్ ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. ఈ వివరాల ప్రకారం గల్ఫ్ ఆఫ్ ఒమన్ తీరంలో, ఎర్ర సముద్రం వద్ద ఈజిప్టుకు చెందిన తిహామా అనే నౌకపై హౌతీలు మిస్సైల్ దాడి చేశారు. ఈ ఘటనలో నౌకలోని నలుగురు మరణించారు. వీరిలో ముగ్గురు పాకిస్తానీలు, ఒక ఇండోనేసియన్ ఉన్నారు. ఆ తర్వాత ఈ నౌకలోని వారిని రక్షించేందుకు మరో రెస్క్యూ నౌక వచ్చింది. ఆ నౌకపై కూడా హౌతీలు దాడి చేశారు. ఈ ఘటనలో మరో రెస్క్యూవరు మరణించారు. హౌతీస్ జరిపిన దాడిలో ఇలా ఆరుగురు మరణించారు. ఆయుధాలతో వెళ్తున్న సౌదీ మిలిటరీ నౌకపై కూడా బాబ్ ఎల్‌మాండెబ్ వద్ద దాడి చేశామని హౌతీస్ సంస్థ ప్రకటించింది. ఈ దాడిపై సౌదీ అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు. మరోవైపు అమెరికా కూడా ఒక కార్గో నౌకపై దాడి చేసింది. పనామాకు చెందిన ఒక కార్గో నౌకకు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ స్పందించలేదని, దీంతో అమెరికన్ నేవీకి చెందిన ఎంహెచ్60 హెలికాప్టర్ నుంచి రెండు మిస్సైల్స్ ప్రయోగించామని అమెరికా తెలిపింది. ఈ నౌక ఇరాన్ వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఈ దాడి చేశామని పేర్కొంది. ఇరాన్ పోర్టులకు ఎలాంటి నౌకలు వెళ్లకుండా జలసంధిని అమెరికా దిగ్బంధించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ ప్రాంతంలో రాకపోకలపై నిషేధం ఉన్నప్పటికీ పనామా నౌక వెళ్లేందుకు ప్రయత్నించడంతో దాడి చేశామని తెలిపింది.



# షార్ట్‌కట్‌లు నేర్చుకుంటే జీవితం షార్ట్ అవుతుంది

## మాజీ రాష్ట్రపతి కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణలో ప్రధానిమోడీ

**న్యూఢిల్లీ,ఆగస్టు 12:** ఆత్మకథ పుస్తకాలను యువత చదవాలని, ఇతరుల కష్టాలనుంచి వారు నేర్చుకోవాలని ప్రధాని మోడీ అన్నారు. ఇది రీల్స్ యుగం అని, కానీ కేవలం షార్ట్‌కట్‌లునేర్చుకుంటే, జీవితం షార్ట్ అవుతుందని కూడా ఆయన హెచ్చరించారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆటో బయోగ్రఫీ 'ట్రింఫ్ ఆఫ్ ద ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' అనే బుక్‌ను ఇవాళ ప్రధాని మోడీ ఆవిష్కరించారు. ఆ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కోవింద్ జీవితం పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. కోవింద్ పట్టుదలతో చదివి, రాజ్యాంగ హోదాలో అత్యున్నత స్థాయికి చేరుకున్నట్లు చెప్పారు. రాష్ట్రపతి పదవి నుంచి వైదొలిగిన తర్వాతకూడా కోవింద్ ప్రజా జీవితంలో చురుకుగా ఉంటున్నారని, ఆఫీసు నుంచి తప్పుకున్న తర్వాత ఆయనేమీ రెస్టు తీసుకోలేదని, వన్ నేషన్ వన్ ఎలక్షన్ స్కీమ్‌పై ఆయన వర్క్ చేస్తున్నట్లు ప్రధాని చెప్పారు. భారత ప్రజాస్వామ్యంలో ఆయన చేస్తున్న కృషి కొత్త అధ్యాయాన్ని లిఖించనున్నదని ప్రధాని తెలిపారు.

# ప్రైవేటు ఆసుపత్రుల గదుల అద్దెలకు పరిమితి ఉండాలి



## పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫారసులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** దేశంలోని మెట్రో నగరాల లో ప్రైవేటు ఆసుపత్రులు వసూలు చేస్తున్న గది అద్దెలకు పరిమితి విధించాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫార్సు చేసింది. ఆయా ఆసుపత్రుల సమీపంలోని 3స్టార్ హోటళ్ల సగటు అద్దె కంటే ఈ ఛార్జీలు అధికంగా ఉండకూడదని స్పష్టంచేసింది. పెరుగుతున్న వైద్య ఖర్చులను అదుపులోకి తీసుకువచ్చి రోగులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా కమిటీ ఈ కీలక సూచనలు చేసింది. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖకు సంబంధించిన పార్లమెంటరీ స్థాయీ సంఘం తన 176వ నివేదికలో ఈ సిఫార్సులను పొందుపరిచింది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల అందుబాటు, స్తోమత పేరిట రూపొందించిన ఈ నివేదికను ఈనెల 7న పార్లమెంటు ఉభయసభల్లో ప్రవేశపె ట్టారు. ఆసుపత్రుల్లోని మౌలిక సదుపాయాలు, సేవలను బట్టి గది అద్దెల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నాయని, తక్షణమే వీటిని హేతుబద్ధీకరించాలని కమిటీ సూచించింది. ఈనిబంధన కేవలం ప్రాథమిక గదిఅద్దెకేవర్తిస్తుందని, రెసిడెంట్‌డాక్టర్, నర్సింగ్, భోజనం ఖర్చులను ఆసుపత్రులు అదనంగా వసూలు చేసుకోవచ్చని స్పష్టంచేసింది. జాతీయ నమూనా సర్వే (2025) గణాంకాలను కమిటీ ఈ సందర్భంగా ఉటంకించింది. ప్రభుత్వ ఆసుపత్రిలో సగటు చికిత్స వ్యయం రూ.6,631 గా ఉండగా ప్రైవేటుఆసుపత్రుల్లో అది రూ.50,508గా ఉందని పేర్కొంది. ఉదాహరణకు ముంబైలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో సింగిల్ రూమ్ అద్దె రోజుకు రూ.6,000నుంచి రూ.12,000వరకుఉండగా సమీపంలోని 3స్టార్ హోటళ్లలో అది రూ.2,500 నుంచి రూ.4,500 మధ్యే ఉందని నివేదికలో వివరించింది. గది అద్దెలతోపాటు ప్రైవేటు ఆసుపత్రులలోని కీలక చికిత్సలు, వ్యాధినిర్ధారణ పరీక్షల ధరలను కూడా నియంత్రించేలా ఒక చట్టబద్ధ మైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కమిటీ సిఫార్సు చేసింది. చికిత్స ప్రారంభించడానికిముందే అంచనావ్యయాన్ని రోగులకువివరించాలని సూచించింది.

# రష్యా మధ్యవర్తిగా మాజీ సిజెఐ చంద్రచూడ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** రష్యా ఆక్రమించిన దేశంలోని కొన్ని ప్రాంతాలలో తాము ఆస్తులు, కార్యకలాపాలను కోల్పోయామని ఉక్రెయిన్ ప్రభుత్వ రంగ సంస్థ ఓషాడ్‌బ్యాంక్ దాఖలు చేసిన కొత్త పెట్టుబడి ఒప్పంద మధ్యవర్తిత్వంలో, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్‌ను రష్యా తన మధ్యవర్తిగా నియమించింది. గ్లోబల్ ఆర్బిట్రేషన్ రివ్యూ (జిఏఆర్) ప్రకారం, 1998 ఉక్రెయిన్ – రష్యా ద్వైపాక్షి క పెట్టుబడి ఒప్పందం కింద ఓషాడ్‌బ్యాంక్ వాదనను విచా రించే ముగ్గురు సభ్యుల మధ్యవర్తిత్వ ట్రిబ్యునల్‌లో చంద్రచూడ్ ఉంటారు. కోస్టారికాకు చెందిన మధ్యవర్తి డయాలా జిమెనెజ్‌ను ఇరుపక్షాలు సంయుక్తంగా నియమించగా, ఆయన ట్రిబ్యునల్ అధ్యక్షురాలిగా ఉన్నారు. గ్రీకు మధ్యవర్తి, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ ప్రొఫెసర్ అయిన స్టావ్రోస్ బ్రెకౌలాకిస్‌ను ఓషాడ్‌బ్యాంక్ నియమించింది. ఈ నియామకం ముఖ్యమైనది, ఎందుకంటే, ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించిన మరో రెండు పెట్టుబడి ఒప్పంద కేసులలో తమ మధ్యవర్తిగా వ్యవహరించమని రష్యా గత సంవత్సరం చంద్రచూడ్‌ను సంప్రదించిందని జిఏఆర్‌నివేదించింది. ఆకేసులను జర్మన్ ఇంధన సంస్థ వింటర్‌షాల్ డియా, ఉక్రేనియన్ ఇంధన సంస్థ ఉక్రెనెర్గో దాఖలు చేశాయి. చంద్రచూడ్ ఆ రెండు కేసులలోనూ వ్యవహరించడానికి నిరాకరించారు. శాశ్వత మధ్యవర్తిత్వ న్యాయస్థానం వింటర్‌షాల్ మధ్యవర్తిత్వంలో ఆయనను నియామక అధికారిగా నియమించినరోజే రష్యా చంద్రచూడ్‌ను సంప్రదించిందని జిఏఆర్ నివేదించింది.

# టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ రాజీనామా



**ముంబయి,ఆగస్టు 12:** టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ తన పదవికి రాజీనామా చేశారు. ఆగస్టు 18న జరగనున్న కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశానికి ముందు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.టాటా గ్రూప్‌లో తన 40 ఏళ్ల వృత్తి జీవితాన్ని పూర్తి చేసుకున్నానని చంద్రశేఖరన్ తెలిపారు. టాటా సన్స్‌ను గత దశాబ్ద కాలంగా నడిపించే అవకాశం దక్కడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని, ఇది తనకు గొప్ప బాధ్యత అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన పదవీకాలం ఫిబ్రవరి 2027 వరకు ఉంది. ఆ తర్వాత మరోసారి చైర్మన్‌గా కొనసాగేందుకు తాను ప్రయత్నించబోనని స్పష్టం చేశారు. వారసుడి ఎంపికను త్వరగా పూర్తి చేసి సజావుగా బాధ్యతల బదలాయింపు జరిగేలా చూడాలని బోర్డును కోరినట్లు వెల్లడించారు.చంద్రశేఖరన్ రాజీనామా వార్తల నేపథ్యంలో టాటా గ్రూప్‌కు చెందిన పలు కంపెనీల షేర్లు భారీగా నష్టపోయాయి. టాటా పవర్ 1.26 శాతం, టిసిఎస్ 3.9 శాతం, టాటా స్టీల్ 1.83 శాతం చొప్పున పడిపోయాయి. చంద్రశేఖరన్ పదవి కొనసాగింపుపై వాటాదారుల మధ్య నెలకొన్న విభేదాలు, టాటా ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటాతో ఆయనకు ఉన్న అభిప్రాయ భేదాలు రాజీనామాకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. ఫిబ్రవరి 20, 2027 తర్వాత మరో ఐదేళ్లపాటు తన పదవీకాలాన్ని పొడిగించాలని సర్ దోరాబ్జీ టాటా ట్రస్ట్, సర్ రతన్ టాటా ట్రస్ట్‌లు ఏకగ్రీవంగా నిర్ణయించి సిఫారసు చేశాయని చంద్రశేఖరన్ తెలిపారు. ఈ ప్రతిపాదనను టాటా సన్స్ నామినేషన్ అండ్ రెమ్యునరేషన్ కమిటీ, బోర్డు కూడా నమోదుచేసి సిఫారసుచేశాయని చెప్పారు. అయితే 2026 ఫిబ్రవరి 24న జరిగిన టాటా సన్స్ బోర్డు సమావేశంలో ఈ ప్రతి పాదనకు ఒక బోర్డు సభ్యుడు మద్దతు ఇవ్వకపోవడంతో అది ఆమోదం పొందలేదని చంద్రశేఖరన్ వెల్లడించారు. ఏకగ్రీవ మద్దతు లేని పరిస్థితిలో తాను నిర్ణయాన్ని వాయిదా వేసుకోవాలని ఎంచుకున్నట్లు తెలిపారు. టాటా సన్స్, టాటా ట్రస్ట్స్ మధ్య బోర్డులో ప్రాతినిధ్యం, గ్రూప్‌వ్యూహం, మైనారిటీ వాటాదారు షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ వైదొలగడం వంటి అంశాలపై విభేదాలు ఉన్నట్లు తెలుస్తోంది.

# జస్టిస్ వర్మపై అభియోగాలు అన్నీ నిజమే

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** ఇంట్లో భారీగా నోట్ల కట్టలు లభించిన కేసులో ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి యశ్వంత్ వర్మ దోషిగా తేలాడు. అతడిపై మోపిన అభియోగాలు అన్నీ నిజమే అని లోక్‌సభ ప్యానెల్ నిర్ధరించింది. అయితే, ఈ విషయంలో అతడిపై ఏ చర్యలు తీసుకుంటారు అనే విషయంలో ఇంకా స్పష్టత లేదు. ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి, రిటైర్డ్ జస్టిస్ యశ్వంత్ వర్మ ఢిల్లీలోని 30 తుగ్లక్ రోడ్డులోని ప్రభుత్వ భవనాల్లో నివాసం ఉంటున్నాడు. గత యేడాది మార్చి 1415 తేదీల మధ్య అతడి ఇంట్లో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలను ఆర్పేశారు. ఈ ఘటనకు సంబంధించి అప్పట్లో కొన్ని ఫొటోలు బయటపడ్డాయి. సంచలన విషయాలు వెలుగు చూశాయి. అగ్నిప్రమాదం జరిగిన యశ్వంత్ వర్మ ఇంట్లో భారీగా నోట్ల కట్టలున్నాయి. ఇంటి స్టోర్ రూమ్‌లో ఈనోట్లకట్టలు చాలావరకు కాలిపోయాయి. కొన్ని ధ్వంసమయ్యాయి. అవన్నీ రూ.500 నోట్లకట్టలే. ఈ అంశం వివాదాస్పదం కావడంతో పోలీసులు, ఇతర అధికారులు ఆ ఇంటికి వెళ్లి ఆ ప్రదేశాన్ని సీజ్ చేశారు. అప్పటికే ఇంట్లోని సాక్షాలు తారుమారు అయ్యాయి. ఫొటోల్లో కనిపించిన కరెన్సీ నోట్లు ఆ సమయానికి అక్కడ లేవు. మొదట ఈ నోట్ల కట్టలకు, తనకు సంబంధం లేదని యశ్వంత్ వర్మ చెప్పాడు. అసలు, ఈ నోట్లు తన ఇంటికి సంబంధం లేదని చెప్పాడు. అయితే, ఒక రిటైర్డ్ జడ్జి ఇంట్లో భారీగా నోట్ల కట్టలు కనిపించడం సంచలనంగా మారింది. జడ్జిల అవినీతి అంశం తెరమీదకు వచ్చింది. ఈ అంశంపై విచారణ జరిపేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఒక ప్యానెల్ ఏర్పాటు చేశారు. ఈ ప్యానెల్.. ఈ అంశంపై విచారణ జరిపింది. పలుమార్లు యశ్వంత్ వర్మను ప్రశ్నించింది. ఈ విచారణ తర్వాత అతడిని ప్యానెల్ దోషిగా గుర్తించింది. ఇందుకు ప్రధాన కారణాలు ఇవి. ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది అది ఎవరిది ఆ డబ్బు ఎంత ఉంటుంది వంటి వివరాలపై యశ్వంత్ వర్మ సరైన సమాధానం చెప్పలేకపోయారు. ఆ డబ్బు ఎక్కడినుంచి వచ్చిందో తనకు తెలియదన్నాడు. ఇతరులు తన ఇంటిని అక్రమంగా వాడుకునే అవకాశం ఉందని, ఎవరో తనకు తెలియకుండా డబ్బు తన ఇంట్లో పెట్టారని వర్మ చెప్పాడు. తనపై కుట్ర చేసి ఎవరో ఆ నోట్లు తన ఇంట్లో పెట్టారని చెప్పాడు.

# 20వేల పేజీలతో నీట్ పేపర్‌లీక్ కేసు సిబిఐ ఛార్జిషీటు

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:** నీట్ పేపర్ లీక్ కేసులో సిబిఐ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను ఢిల్లీకోర్టు బుధవారం పరిగణనలోకి తీసుకుంది. ఈ కేసులో నిందితులపై అభియోగాలు నమోదు చేయాలా వద్దా అనే అంశంపై గురువారం, ఆగస్టు 13 నుంచి వాదనలు ప్రారంభించే అవకాశం ఉంది. పేపర్ లీకేజీలు, ప్రభుత్వ పరీక్షల్లో ఇతర అక్రమ మార్గాల వినియోగానికి సంబంధించిన క్రిమినల్ కేసులను విచారించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ముందు సిబిఐ ఇటీవల తుది నివేదికను సమర్పించింది.మొత్తం 20వేల పేజీల అభియోగ పత్రాన్ని సిబిఐ అధికారులు కోర్టుకు సమర్పించారు. ప్రత్యేక న్యాయమూర్తి అజయ్ గుప్తా 13 మంది నిందితులపై దాఖలైన సిబిఐ తుది నివేదికను పరిగణనలోకి తీసుకున్నారు. గురువారం నుంచి అభియోగాలపై వాదనలు ప్రారంభించే అవకాశం ఉన్నట్లు కోర్టు వర్గాలు తెలిపాయి.విచారణ సందర్భంగా సిబిఐ అధికారులు కీలక విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మీడియాలో పేర్లు ప్రచురితమవుతున్న కొంతమంది సాక్షులు మైనర్లుకూడా అయి ఉండవచ్చని తెలిపారు. ఛార్జిషీట్‌లోని కొన్నిభాగాలు నిరంతరం పత్రికల్లో ప్రచురితమవుతున్నాయని కోర్టుకు వివరించారు.దీనిపై కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కేసులోని సాక్షుల పేర్లను మీడియా ప్రచురించడంపై అభ్యంతరం తెలిపింది. ఇది చాలా దిగ్భ్రాంతికరం. కోర్టులో ఇంకా ప్రస్తావించని, ప్రస్తుతం ఛార్జిషీట్‌లో భాగంగా ఉన్న విషయాలన్నీ మీడియా ద్వారా బహిరంగం కావడం అత్యంత ఆందోళనకరమని వ్యాఖ్యానించింది. బాధ్యతాయుతమైన మీడియా ఇలాంటి విషయాలకు దూరంగా ఉండాలని సూచించింది.

# జలశక్తి కార్యదర్శిగా సీనియర్ ఐఎఎస్ అర్చనావర్మ



**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ పరిధిలోని జల వనరులు, నదుల అభివృద్ధి, గంగా పునరుజ్జీవన శాఖ కార్యదర్శిగా ఐఏఎస్ అధికారి అర్చనా వర్మ నియామకానికి కేబినెట్ నియామకాల కమిటీ (ఎసిసి) ఆమోదం తెలిపింది. 1995 బ్యాచ్‌కు చెందిన ఆగ్‌మట్ కేడర్ అధికారి అయిన అర్చనా వర్మ ప్రస్తుతం ఇదే శాఖలో అదనపు కార్యదర్శిగా, జాతీయ జల మిషన్ మిషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నీటి నిర్వహణ, ప్రజా పరిపాలన, విధానాల అమలులో ఆమెకు ఉన్న విస్తృత అనుభవం కేంద్ర ప్రభుత్వంలోని కీలకమైన జల వనరుల శాఖకు మరింత ఉపయోగ పడనుంది. విస్తృత పరిపాలనా అనుభవంఅర్చనా వర్మ తన పరిపాలనా ప్రస్థానాన్ని అసోంలోని కర్బీ ఆంగ్‌లాంగ్‌లో సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్‌గా ప్రారంభించారు. అనంతరం గోల్‌పారా జిల్లా మేజిస్ట్రేట్‌గా పనిచేశారు.

ఈ సమయంలో తరచూ సంభవించే వరదలు, శాంతిభద్రతల సమస్యలను సమర్థంగా ఎదుర్కోవడంతో పాటు మహిళల స్వయం సహాయక సంఘాల ప్రోత్సాహం, అక్షరాస్యత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించారు.అసోంలో గ్రామీణాభివృద్ధి కమిషనర్, కార్యదర్శిగా, గువాహటి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, గోల్‌పారా జిల్లా మేజిస్ట్రేట్‌గా ఆమె వివిధ కీలక బాధ్యతలు నిర్వహించారు. పట్టణ పరిపాలన, గ్రామీణాభివృద్ధి రంగాల్లో ఆమెకు ఉన్న అనుభవం క్షేత్రస్థాయిలో పాలన, ప్రజలకు ప్రభుత్వ సేవల అందుబాటుపై మంచి అవగాహనను కల్పించింది.

# సంక్షిప్త వార్తలు

## అరుణాచల్‌లో భారత్ చైనా సైనికుల సరిహద్దుఘర్షణ



**ఇటానగర్, ఆగస్టు 12:** ఇండియా-చైనాల మధ్య మరోసారి ఉద్రిక్త వాతావరణంఏర్పడింది. ఇరుదేశాల సైనికులు సరిహ ద్దులో పరస్పరం ఘర్షణకు దిగినట్లుతెలుస్తోంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని భారత సరిహద్దు ప్రాంతం లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ (ఎల్‌ఎసి)వద్ద గత నెలలో ఈ ఘటన జరిగినట్లు తెలు స్తోంది. దీనికి సంబంధించిన ఒక ఫొటో ప్రస్తుతం వైరల్‌గా మారింది. దీనిపై భారత సైన్యం, ప్రభుత్వం మాత్రం అధికారికంగా స్పందించలేదు. గతనెల 26న ఈ ఘటన జరిగింది.

## చార్‌ధామ్ యాత్రకు పోటెత్తిన భక్తులు

**డెహ్రాడూన్, ఆగస్టు 12:** ఉత్తరాఖండ్‌లో చార్‌ధామ్ యాత్రకు భక్తులు పోటెత్తుతున్నారు. వర్షాకాలం కారణంగా సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ యాత్రికుల సంఖ్య రికార్డు స్థాయిలో నమోదవుతోంది. ఈ యాత్రా సీజన్ ప్రారంభమైన 114 రోజుల్లోనే మొత్తం 47,02,703 మంది భక్తులు పవిత్ర పుణ్యక్షేత్రాలను దర్శించుకున్నారు. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది 4,68,556 అధికం కావడం విశేషం. ఈ ఏడాది యాత్ర సరికొత్త రికార్డును నెలకొల్పే దిశగా సాగుతోంది. భక్తుల భద్రతే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని ఉత్తరాఖండ్ సిఎం పుష్కర్ సింగ్ ధామి స్పష్టంచేశారు.

## బాలి సమిపంలో సముద్రంలో పడవలో మంటలు

**బాలి, ఆగస్టు 12:** ఇండోనేషియాలోని బాలి సమీపంలో ఓ ఓడలో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. దాంతో ఆ ఓడలోని 172 మంది అందులో చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న రెస్క్యూ బృందాలు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. ఇప్పటివరకు 131 మందిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. ఒకరు మరణించారు. మిగతా వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సముద్రంలో పెద్ద ఎత్తున అలలు ఎగసిపడుతుండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు పేర్కొన్నారు.

## 250 దాటిన కొలంబియా భూకంప మృతులు

**పెరిరా, ఆగస్టు 12:** కొలంబియాలో భూకంప మృతుల సంఖ్య 250 దాటింది. సోమవారం 7.4 తీవ్రతతో ఆ దేశాన్ని భూకంపం షేక్ చేసిన విషయం తెలిసిందే. పెరిరా, కాలి ప్రాంతాల్లో భారీ సంఖ్యలో భవంతులు నేలమట్టం అయ్యాయి. ఆ శిథిలాల కింద ఇంకా వందల సంఖ్యలో జనం చిక్కుకుని ఉంటారని భావిస్తున్నారు. పర్వత ప్రాంతమైన పశ్చిమ కొలంబియాలో ప్రస్తుతం ఆర్తనాదాలు మిన్నంటుతున్నాయి. ఆ ప్రాంతంలో ఉన్న అపార్ట్‌మెంట్లు, ఇండ్లు, స్కూళ్లు, హెల్త్ సెంటర్ల భవనాలన్నీ పగుళ్లు వచ్చాయి. వేర్వేరు నగరాల్లో నమోదు అయిన డేటా ప్రకారం ఇప్పటి వరకు 254 మంది మృతిచెందినట్లు తెలుస్తోంది.

## కావేరీ నీటి వివాదం: విచారణ 17కి వాయిదా

**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** కావేరీ నీటి విడుదలపై 'కావేరీ వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ' (సిడబ్ల్యుడబ్ల్యుఎ) తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేసేలా కర్ణాటకను ఆదేశించాలని కోరుతూ తమిళనాడు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ఆగస్టు 17కి వాయిదా వేసింది. ఆగస్టు 13న ఈ అంశాన్ని విచారించాల్సి ఉన్న జస్టిస్ విక్రమ్ నాథ్ అనారోగ్యానికి గురయ్యారని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ తెలిపారు.

## జపాన్‌పై ఉత్తరకొరియా బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం

**టోక్యో,ఆగస్టు 12:** ఉత్తర కొరియా సైనిక చర్యలు అనూహ్యంగా ఉంటాయి. తాజాగా జపాన్‌పైకి ఉత్తర కొరియా ఒక బాలిస్టిక్ మిస్సైల్ ప్రయోగించింది. భారత కాలమానం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో ఉత్తర కొరియా తన తీర ప్రాంతం నంచి జపాన్‌పైకి ఒక మిస్సైల్‌ను పరీక్షించింది. వోన్సన్ ప్రాంతంలోని ఉత్తర తీరం నుంచి ప్రయోగించిన ఈ మిస్సైల్ జపాన్ స్పెషల్ ఎకనామిక్ జోన్ సమీపంలో పడ్డట్లు జపాన్ ప్రభుత్వం తెలిపింది.

MN 10 final:MN 10 final 01/01/2001 10:13 Page 1



# ఏఎన్‌యు అభివృద్ధికి దాతల ప్రోత్సాహం స్ఫూర్తిదాయకం

### - ఏపి ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు - స్వర్ణోత్సవ వేడుకల్లో విశిష్టులకు ఘనసన్మానం

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్12, ప్రభాతవార్త: అన్ని దానాల్లో విద్యాదానం గొప్పదనే నానుడికి ఏఎన్‌యు వేదికగా నిలిచింది. ఏఎన్‌య 50ఏళ్ళ స్వర్ణోత్సవాల్లో భాగంగా బుధవారం వర్సిటీకి దాతృతం అందించిన పలువురు విశిష్టులకు ఘన సన్మానం జరిగింది. ఇందులోభాగంగా



ప్రముఖ భూరి విరాళదాత సిరీస్ రాజు మనుమడు ప్రస్తుత ఏపి శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజును వర్సిటీ సన్మానించింది. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ ఏఎన్‌యు అభివృద్ధికి మా తాత గారు అందించిన సహకారం గుర్తుంచుకుని మమ్ములను ఆహ్వానించి సన్మానం చేయడం మరువలేని జ్ఞాపకం అన్నారు. పెద్దలు చేసిన సహాయం పిల్లలకు వరాలుగా వస్తాయని అంటుంటారు. మాకు అది జరిగిందని పేర్కొన్నారు. విద్యాసంస్థలకు దాతృత్వం చేయడం ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. దాతల చేయూత విద్యా సంస్థల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. దాతలను గుర్తించి గౌరవించడం గొప్ప సంప్రదాయమన్నారు. దేశ, రాష్ట్ర ప్రగతికి విద్యాసంస్థల అభివృద్ధితో ముడిపడిఉంటుందన్నారు. ఇదే స్ఫూర్తిని తన నియోజకవర్గంలో అమలు చేస్తానన్నారు. అవనిగడ్డ ఎంఎల్ఏ మండలి బుద్ద ప్రసాద్ మాట్లాడుతూ స్వర్ణోత్సవ వేళ వర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములైన దాతలను గుర్తించి సత్కరించడం ఎంతో అభినందనీయం అన్నారు. వీసి ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ 50ఏళ్ళ ప్రస్థానంలోవిద్య, పరిశోధన, క్రీడా, సాంస్కృతిక, మౌలిక వసతుల రంగాలల్లో ఏఎన్‌యు గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. ఈ ప్రస్థానంలో దాతలు, విద్యావేత్తలు, పూర్వ విద్యార్థులు, అధికారులు, వివిధ సంస్థలు అందించిన సహకారం వెలకట్టలేనిదని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఏపి ఉన్నతవిద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి, ఏఎంజి ఇండియా ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మొహంతి, బొమ్మిడాల కృష్ణమూర్తి, జాగర్లమూడి మురళీమోహన్, విశ్రాంత ఐఎఎస్ ఎల్వి.సుబ్రహ్మణ్యం, తులసీరామ చంద్రప్రభు, జిఎస్.జి. అయ్యంగార్, పాలడుగు లక్ష్మణరావు, రాయపాటి శ్రీనివాస్, ముప్పలనేని శ్రీనివాస్, వైవి. ఆంజనేయులు, జి.శివరామకృష్ణ ప్రసాద్, ఎం.కమలాకర్‌బాబు, కె.వీరబ్రహ్మాం, హనుమంతరెడ్డి, ఎస్.భరణి, ఎస్.కె.సమీంభాను, కె.ఎఫ్.పరదేశీబాబు, నూతన పాలకమండలి సభ్యులను ఈ సందర్భంగా సన్మానించారు. కాగా, మాజీ ఎంపి, ప్రముఖ రచయిత ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు సరైన ఆహ్వానం లేకపోవడంతో కార్యక్రమం మధ్యలోనే వెళ్ళిపోయారు. ఈ వేడుకల్లో రెక్టార్ ఆచార్య రామినేని శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ జి.సింహాచలం, ప్రిన్సిపాల్స్, డైరెక్టర్‌లు, కోఆర్డినేటర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

## ఇప్పటం లో ఘనంగా హార్ ఘర్ తిరంగా కార్యక్రమం...

### కెఎల్ యు ఎన్ సిసి విభాగం అధ్వర్యంలో ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం.

**తాడేపల్లి, ఆగస్టు 12, ప్రభాతవార్త. :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని దేశభక్తి, జాతీయ ఐక్యత, జాతీయ పతాకం పట్ల గౌరవాన్ని ప్రజల్లో పెంపొందించే ఉద్దేశంతో కెఎల్ యులోని 22 ఆంధ్రా ఎన్ సిసి బెటాలియన్, ఎన్ ఎస్ఎస్ కంప్యూటర్ సైన్స్ 4 విభాగం సహకారంతో



ఇప్పటం గ్రామంలో "హార్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని బుదవారం నాడు కెఎల్ యు ఎన్ సిసి క్యాడెట్లు ఘనంగా నిర్వహించారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు చేపట్టిన "హార్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా, ఇప్పటం గ్రామంలోని ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసే కార్యక్రమాన్ని ఎన్ సిసి క్యాడెట్లు, ఎన్ ఎస్ఎస్ వాలంటీర్లు చేపట్టారు. గ్రామంలోని ప్రతి కుటుంబాన్ని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగస్వామ్యం చేయడం, జాతీయ పతాకం పట్ల గౌరవాన్ని పెంపొందించడంతో పాటు ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావాన్ని బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని 22 ఆంధ్రా ఎన్ సిసి బెటాలియన్ లెఫ్టినెంట్ డాక్టర్ వి.మోనిక తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్ సిసి క్యాడెట్లు తమ సమయాన్ని వెచ్చించి ప్రతి ఇంటికి చేరుకుని జాతీయ పతాకం ప్రాముఖ్యతను వివరించడం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా 22 ఆంధ్రా ఎన్ సిసి కేర్ టేకర్ ఆఫీసర్ డాక్టర్ దారా విక్రమ్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత మరియు సేవాభావాన్ని పెంపొందించడంతో పాటు, సమాజంలోని ప్రతి ఒక్కరినీ జాతీయ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెఎల్ యూనివర్శిటీ 22 ఆంధ్రా ఎన్ సిసి బెటాలియన్‌కు చెందిన ఎన్ సిసి క్యాడెట్లు, ఎన్ ఎస్ఎస్ కంప్యూటర్ సైన్స్ 4 విభాగం ఎన్ ఎస్ఎస్ వాలంటీర్లు చురుకుగా పాల్గొని గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి జాతీయ పతాకాన్ని అందజేశారు. చిన్నారులు, యువత, మహిళలు, వృద్ధులు సహా అన్ని వర్గాల గ్రామస్థులు స్వచ్ఛందంగా పాల్గొని తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్ తరాల్లో దేశభక్తి మరియు సామాజిక బాధ్యతను పెంపొందించడానికి ఎంతో ఉపయోగపడతాయని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 22 ఆంధ్రా ఎన్ సిసి కేర్ టేకర్ ఆఫీసర్ డాక్టర్. దారా విక్రమ్, ఎన్ సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ వి.మోనిక, ప్రొఫెసర్ ఇంచార్జి డాక్టర్. శుభాకర్ రాజు పాల్గొని ఎన్ సిసి క్యాడెట్లు, ఎన్ ఎస్ఎస్ వాలంటీర్లను ప్రోత్సహించారు. సిఎస్ఇ 4 విభాగాధిపతి డాక్టర్ టి. పవన్ కుమార్, ఎన్ ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి. మోహన రావులు కార్యక్రమంలో పాల్గొని తమ సహకారం అందించారు. అనంతరం యూనివర్శిటీ వైస్ ఛాన్సులర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కెఐ.పవన్ కుమార్ లు కార్యక్రమం నిర్వహించినందుకు 22 ఆంధ్రా ఎన్ సిసి బెటాలియన్ క్యాడెట్లను, ఎన్ ఎస్ఎస్ వాలంటీర్లను అభినందించారు.

## చేనేత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు

**మంగళగిరి, ఆగష్టు 12, ప్రభాతవార్త :** టీడీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతినెల రెండవ బుధవారం నిర్వహించే పార్టీ సమావేశంలో భాగంగా బుధవారం మంగళగిరి పట్టణ పార్టీ సమావేశాన్ని పట్టణ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు.టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు మాట్లాడుతూ తల్లికి వందనం, నేతన్న సేవలో వంటి సంక్షేమ పథకాలపై ప్రజల్లో ఎంతో ఉత్సాహం కనిపిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నేతన్న సేవలో పథకం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. చేనేత రంగ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న మంత్రి నారా లోకేష్ లకు, కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో మంగళగిరి నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతోందన్నారు.గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో మంగళగిరి నియోజకవర్గం దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటింటికి తెలుగుదేశం" డోర్ టు డోర్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న నాయకులు,



కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ప్రతి చిన్న సమస్య కు సైతం పరిష్కారం అయ్యేలా చేస్తామని, నియోజకవర్గ అభివృద్ధి లో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో గుంటూరు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు దామర్ల రాజు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు వాస పద్మావతి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎండి ఇబ్రహీం, విన్నకోట శ్రీనివాసరావు, పట్టణ కమిటీ సభ్యులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, వార్డు అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరిసాగుచేసిన రైతులు విధిగా ప్రీమియం చెల్లించాలి : ఎడిఎ వి.రామకోటేశ్వరి

**పొన్నూరు, ఆగస్టు 12,ప్రభాతవార్త:** వరిసాగు చేసిన రైతులు తప్పనిసరిగా ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకానికి సంబంధించిన ప్రీమియాన్ని తప్పనిసరిగా చెల్లించాలని, తద్వారా బీమా సొమ్ము పొందేందుకు అవకాశం ఉంటుందని ఎడిఎ వి.రామకోటేశ్వరి పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని ఇలాంటి పరిస్థితుల్లో ప్రీమియం చెల్లించడం మంచిదన్నారు. మనం వేసిన పంటకు ఏదైనా నష్టం వాటిల్లితే నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. ఎకరాకు రూ.800చెల్లించడం ద్వారా రూ.40వేల బీమా సౌకర్యాన్ని పొందవచ్చన్నారు. ఈ నెల 15వ తేదీలోపు చెల్లించాలని సూచించారు. కౌలు రైతులు సీసీఆర్సీ కార్డులు తీసుకొని తమ సమీప మీ సేవ కేంద్రం,సీఎస్‌సి



సెంటర్ నందు బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పరిపైరు సాగుచేసిన ప్రతి రైతు విధిగా ఈ పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఎరువులు అవసరమైన రైతులు ఎపి ఎయిమ్స్ యాప్ ద్వారా తమ విస్తీర్ణములను సరిచూసుకొని ఎరువులను పొందాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, గ్రామ సహాయకులు డి.షకీన, ఎస్.ప్రవల్లిక, ఎంపిఈఓ సింహాద్రి సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

# విద్యుత్ చౌర్యం చట్ట రీత్యా నేరం

### -పట్టణంలో 2,757 సర్వీసులు తనిఖీ చేసిన అధికారులు

పొన్నూరు, ఆగస్టు 12,ప్రభాతవార్త: విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని విద్యుత్‌శాఖ విజిలెన్స్ విభాగం గుంటూరు జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ సిహెచ్ రమేష్ అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఆకస్మికంగా ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో 2,757 సర్వీసులను పరిశీలించారు. వివిధ రకాలుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారి నుంచి సుమారుగా రూ.5.34లక్షల అపరాధ రుసుము విధించినట్లు చెప్పారు. ఇందులో మీటరు ఉన్నప్పటికీ అక్రమముగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరికి రూ.0.50లక్షలు, అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుకొంటున్న ఒక్కరికి రూ.0.30లక్షలు, అనుమతించిన లోడు కంటే



అదనముగా విద్యుత్ వాడుతున్న 145మందికి రూ.4.54లక్షలు, అసలైన వాడకం కంటే బిల్లు తక్కువగా ఇవ్వబడిన ఒకరికి రూ.0.05లక్షలు అపరాధ రుసుము విధించినట్లు చెప్పారు. విద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత విద్యుత్ చట్టంకు లోబడి ఉంటాయన్నారు. వినియోగదారు లందరూ వారి ప్రిమిసెస్‌లో ఉండే విద్యుత్ మీటర్లకు తప్పనిసరిగా సీలు ఉండేటట్లు నిర్ధారించుకోవాలన్నారు. ఒక వేళ సీలు లేకపోయినా, తుప్పు పట్టి ఊడిపోయినా, వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి వ్రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. ఏ ప్రాంతంలోనైనా విద్యుత్ అధికారుల తనిఖీలలో సీలు లేకపోవుట, ఉద్దేశపూర్వకంగా వాటిని తొలగించుట, గాట్లు పెట్టుట వంటివి గమనిస్తే విద్యుత్ చౌర్యంగా నిర్ధారించి కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. విద్యుత్‌చౌర్యంపై ఫిర్యాదులను పూర్తి వివరాలతో 9440812263, 9440812361 నెంబర్లకు నేరుగా లేదా వాట్సాప్ ద్వారా సంప్రదించవచ్చన్నారు. సమాచారం ఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.ఈ ఆపరేషన్‌లో డిఇఇ బి.అశోక్‌కుమార్, డిపిఇలు ఎస్.మల్లికార్జున ప్రసాద్, కె.రవికుమార్, ఎఈ ఆర్‌వి శంకర్, ఎఈఈలు యు.శివశంకర్, ఎం.సతీష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

### శ్రీ వీరాంజనేయుని దర్శించుకున్న మాజీ చీఫ్ జస్టిస్ దుప్పాల

**పొన్నూరు, ఆగస్టు 12,ప్రభాతవార్త:** దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన స్వర్ణపురి పట్టణంలో వేంచేసియున్న శ్రీ సహస్రలింగేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ వీరాంజనేయస్వామివారిని బుధవారం మధ్యప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ దుప్పాల వెంకటరమణ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుప్పాలకు దేవాలయం ధర్మకర్తల మండలి, అధికారులు ఘన స్వాగతం పలికారు. దేవాలయంలో పూజల అనంతరం అర్చకస్వాములు వేదాశీర్వచనం చేశారు. కార్యనిర్వహణాధికారి ఆరికాటి శ్రీనివాసరావు స్వామివారి ప్రతిమను చీఫ్ జస్టిస్ దుప్పాల వెంకటరమణకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రిన్సిపల్ సివిల్ జడ్జి రుక్మిణి, ధర్మకర్తల మండల చైర్మన్ గుప్తా, సభ్యులు పాల్గొన్నారు.



# గుంటూరు నగరంలో తాగునీటి కష్టాలు

గుక్కెడు నీటి కోసం అల్లాడిపోతున్న నగర ప్రజలు

మూడు రోజులుగా తాగేందుకు నీరు ఇవ్వటం లేదంటూ ప్రజల గగ్గోలు

కనీసం ట్యాంకర్ల ద్వారా మీరు సరఫరా చేయని దుస్థితిలో కార్పోరేషన్ యంత్రాంగం

ఇంజనీరింగ్ అధికారుల బాధ్యతారాహిత్యంతో నగర ప్రజలకు తాగునీటి కష్టాలు

కమిషనర్ గారు అసలు ఉన్నారా...? అంటూ ప్రశ్నిస్తున్న వైనం

లీకుల మరమత్తులతో కాలయాపన.. ప్రజలకు శాపంగా మారిన దుస్థితి.

**గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 12 ( ప్రభాతవార్త ) :**

గుంటూరు నగరంలో తాగునీరు కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. గత మూడు రోజులుగా తాగేందుకు గుక్కెడు నీటి కోసం అష్ట కష్టాలు పడుతున్న కార్పొరేషన్ అధికార యంత్రాంగం మొద్దు నిద్ర వీడటం లేదని ప్రజలు ఆగ్రహవేశాలు వ్యక్తం చేస్తున్నారు. కనీసం మూడు రోజుల నుంచి, గురువారం నాటికి నాలుగు రోజులు అవుతున్న తాగేందుకు చుక్క నీరు



అందించలేని దౌర్భాగ్య పరిస్థితిలో అధికారులు ఉన్నారని విమర్శలు గుపిస్తున్నారు. నాలుగు రోజులపాటు తాగునీరు అందించలేకపోతున్నామనే ముందస్తు సమాచారం ఇవ్వకుండా కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఉన్నారంటే వారి పనితీరును ప్రశ్నించే పరిస్థితి దాపురించిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కార్పొరేషన్ కమిషనర్ గా ఏ అధికారి ఉన్నా పైప్ లైన్ లీకుల మరమ్మత్తుల పనులు చేపట్టే సమయంలో ఆయా ప్రాంతాల పరిధిలో ప్రజలకు తాగునీటి కష్టాలు లేకుండా ఉండేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం గత మూడేళ్లుగా ఒక ట్యాంకర్ ద్వారా కూడా తాగునీరు పంపిణీ చేయకుండా నిరక్ష్యం వహిస్తూ అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కమిషనర్ ఉన్నాడా లేడా..? అసలు అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకొని వచ్చారా లేదా అనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గుంటూరు నగరంలోని 90 శాతం పైగా అన్ని డివిజనులకు తక్కెళ్ళపాడు హెడ్ వాటర్ రిజర్వాయర్ నుంచి తాగునీరు సరఫరా అవుతుంది. ఇది ఇలా ఉంటే శారదా కాలనీ రిజర్వాయర్ సమీపంలో వాటర్ పంపింగ్ లైన్ కు లికులు ఏర్పడటంతో హడావుడిగా ప్రజలకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే లీకుల మరమ్మతుల పనులు చేపట్టారు. ఆ పనులు ప్రారంభించి బుధవారం వరకు మూడో రోజులు అవుతున్నప్పటికీ ఇంకా పనులు పూర్తి చేయని దుస్థితిలో కార్పొరేషన్ అధికార యంత్రాంగం ఉండటం హాస్యాస్పదంగా ఉందని ప్రజలు ఆగ్రహిస్తున్నారు. ఈ మూడు రోజులపాటు ఆదివారం నుంచి బుధవారం వరకు గుక్కెడు నీళ్ల రాక నెహ్రు నగర్ రిజర్వాయర్ పరిధిలోని ప్రాంతాలు, వసంత రాయపురం రిజర్వాయర్ పరిధిలోని ప్రాంతాలు, శారదా కాలనీ రిజర్వాయర్ పరిధిలోని ప్రాంతాల ప్రజలు తాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. తాగునీరు ఇవ్వండి మహాప్రభో అని కార్పొరేషన్ అధికారులను వేడుకున్న నిరక్ష్యంగా వ్యవహరిస్తూ సరైన సమాధానం కూడా చెప్పటం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజులుగా కుళాయిల ద్వారా తాగునీరు అందించకపోవడంతో కనీసం ట్యాంకర్ల ద్వారా తాగునీరు పంపించాలని వేడుకున్న పట్టించుకోకపోవం కార్పొరేషన్ అధికారులు పనితీరుపై మరింత ఆగ్రహానికి స్థానిక ప్రజలు గురికావాల్సి వస్తుంది. ఫిర్యాదుల విభాగానికి సమాచారం ఇచ్చిన పట్టించుకోవటం లేదని వెల్లడిస్తున్నారు. గతంలో మున్సిపాలిటీ స్థాయి నుంచి తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డ వెంటనే కమిషనర్ బాధ్యత తీసుకొని ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసేవారని, ప్రస్తుత కమిషనర్ ఎందుకు పట్టించుకోకుండా నిరక్ష్యం చేస్తున్నారని విమర్శిస్తున్నారు. అధికారులు 24 గంటల నీటి సరఫరా అందిస్తామని గొప్పలు చెప్పుకోవడం తప్ప క్షేత్రస్థాయిలో సక్రమంగా నగర ప్రజలకు తాగునీరు అందించలేని దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్ గారు ఇప్పటికైనా స్పందించి తాగునీరు అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

**లీకుల మరమ్మత్తుల పేరుతో ఘరానా దోపిడి..!**

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని



ప్రాంతాల ప్రజలకు తాగునీటి సరఫరా పంపింగ్ వ్యవస్థ అధికారుల జేబులు నింపుకునేందుకు, కార్పొరేషన్ ఖజానా లూటీ చేసేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. లీకుల మరమ్మత్తుల పనుల కోసం రూ. 7 లక్షల రూపాయల వరకు ఖర్చులు చేస్తున్నారంటే అర్థమయిపోతుందని వారు వెల్లడిస్తున్నారు. నగర ప్రజలకు కార్పొరేషన్ పరంగా అత్యవసరంగా చేపట్టే పనులు లో ఎటువంటి టెండర్ ప్రక్రియ లేకుండానే పనులు చేసేందుకు తాగునీటి సరఫరా వ్యవస్థ ఒకటిగా చెప్పవచ్చు. దీన్ని ఆసరాగా తీసుకొని పైప్ లైన్ లీకుల మరమ్మత్తు పనులు, ఇంటర్ కనెక్షన్ లింకు పనులు, రిజర్వాయర్ క్లీనింగ్ పనులు అంటూ అనేక రకాలుగా బూచిగా పనులు చూపెట్టి పర్సంటేజీల రూపేనా అడ్డగోలుగా దోచేస్తున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కార్పొరేషన్ కు కమిషనర్ గా కొత్తగా వచ్చిన అధికారి బాధ్యతలు తీసుకున్న వెంటనే పైపులై లీకుల మరమ్మత్తు పనులు తెరపైకి తేవటం అధికారులు పరిపాటిగా చేస్తూ ఉంటారు. ఈ రకంగా అనేక పర్యాయాలు పైప్ లైన్ లీకులకు చేసిన చోటే మళ్లీ మళ్లీ మరమత్తు పనులు చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయని ప్రజలు వెల్లడిస్తున్నారు. అధికారులు కేవలం తమ జేబులు నింపుకునేందుకే ఈ పనులు చేస్తున్నారని ఆరోపిస్తూనే తమను ఒక్కడు తాగునీటి కోసం అభ్యర్థించేలా అష్ట కష్టాల పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ బాధ్యతను గుర్తించి ప్రజలకు సక్రమంగా తాగునీరు అందించేందుకు కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

**గత అధికారి బాటలో పయనిస్తున్న అధికారులు...?**

కార్పొరేషన్ కమిషనర్ గా పని చేసిన ఒక అధికారి మెప్పుకోసం పనిచేసిన కార్పొరేషన్ అధికారులు.. ఆ అధికారి చెప్పిన విధంగా పనులు కొనసాగించిన విషయం విధితమే. దీని పర్యవ స్థానం కార్పొరేషన్ ఖజానా అంతా లూటీ అయిన సందర్భం కూడా బహిర్గతమైన విషయం కార్పొరేషన్ అధికార యంత్రాంగం మధ్య చర్చనీయాంశం అయ్యింది. కొత్త కమిషనర్ వచ్చాక పాలనా తీర్పులో మార్పు వస్తుందని అందరూ భావించినప్పటికీ అధికారులు తమ పని తీరు మార్చుకోకుండానే తమ పర్సంటేజీల కోసం, అందినంత దోచుకునేందుకు వ్యూహాలు రూపొందిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుత కమిషనర్ ని అధికారులు అధికారులు బురిడీ కొట్టిస్తున్నారని, కమిషనర్ పరిస్థితి, వ్యవహార శైలి, ఆయన తీసుకునే నిర్ణయాలపై కొంతమంది వేగుల నుంచి ముందుగానే సమాచారం తెలుసుకొని తమ



కార్యకలాపాలు యదేచ్ఛగా కొనసాగిస్తున్నారని కార్పొరేషన్ అధికారులు బహిరంగంగా చర్చించుకోవడం పరిపాటిగా మారింది. ఇందులో భాగంగానే పైప్ లైన్ లీకుల మరమ్మత్తు పనులు, నాణ్యత లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్న గుట్టు చప్పుడు కాకుండా ఎం బుక్కుల పై సంతకాలు పెట్టేయడం, బిల్లులు ఇచ్చేలా ముందుగానే కాంట్రాక్టర్లతో ఒప్పందం కుదుర్చుకొని, వారి స్థాయిలో పర్సంటేజీలు కొట్టేయడం యదేచ్ఛగా జరిగిపోతున్నాయని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా కమిషనర్ తమ పందా మార్చుకుంటారో... అధికారుల పనితీరుకు తల ఒగ్గి పట్టీ పట్టనట్టు ఉంటారా..! అని అటు కార్పొరేషన్ లోని కొంతమంది అధికారులతో పాటు ప్రజల సైతం పరిశీలించాల్సిన పరిస్థితిగా మారింది.

**నగరంలో స్వచ్ఛమైన తాగునీరు సరఫరా పేరుకే పరిమితమా...?**

గుంటూరు నగరంలో ప్రపంచ బ్యాంకు నిధులతో 24 గంటల పాటు తాగునీరు సరఫరా అందిస్తామని ఒక ప్రముఖ ప్రైవేట్ ఇంజనీరింగ్ సంస్థకు సుమారు 20 ఏళ్ల క్రితం పనులు అప్పగించేశారు. అయితే 20 ఏళ్లు గడుస్తున్న ఆ ప్రైవేట్ ఇంజనీరింగ్ సంస్థ తమ కోట్ల రూపాయల బిల్లులు డ్రా చేసుకొని నగర ప్రజలను దగా చేసి చుక్కనీరు ఆ ప్రాజెక్టు ద్వారా ఇవ్వకుండానే పత్తా లేకుండా వెళ్ళిపోయింది. ఆ తర్వాత గుంటూరు నగరపాలక సంస్థకు వచ్చిన కమిషనర్లంతా స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామంటూ గొప్పలు చెప్పినవారు. గుంటూరు కార్పొరేషన్ లో స్వచ్ఛమైన తాగునీరు వచ్చే పరిస్థితి ఉంటే అనేక ప్రాంతాలలో కలుషిత నీరు ఎందుకు సరఫరా అవుతుంది, అతిసార వ్యాధితో బాధపడుతూ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎందుకు కేసులు నమోదయ్యాయి, కొంతమంది ప్రాణాలు కోల్పోవడం కూడా జరిగిందని, కలరా వ్యాధితో చనిపోయిన సందర్భాలు ఉన్నాయని అనేకమంది ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుత కమిషనర్ స్వచ్ఛమైన తాగునీరు అందియాలని ఎంత హడావుడి చేసిన ఈ మధ్యకాలంలోనే గత నాలుగు రోజుల క్రితం మంచినీటి కుళాయిల్లో కలుషిత నీరు సరఫరా అయిందని అనేకమంది ప్రజలు వెల్లడిస్తున్నారు. అలానే పైప్ లైన్ లీక్ పనులు కూడా రోజుల తరబడి చేస్తూ ప్రజలు గొంతిండి పోయే పరిస్థితి తీసుకొని రావటం పై అధికార యంత్రాంగం పనితీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు సక్రమంగా తాగునీరు అందాల కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## దాతల సహకారంతో గ్రామాల అభివృద్ధి : ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, ఆగస్టు 12,ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వంతోపాటు దాతలు కూడా ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని నందూరు గ్రామంలోని హిందూ స్మశాన వాటికలో దాతల సహకారంతో దహన వాటికను ఏర్పాటు చేశారు. ఈ దహన వాటికను ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ మాట్లాడుతూ జొన్నలగడ్డ ప్రసాద్, కనకదుర్గ, ఆదిలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఈ దహన వాటికను నిర్మించడం వారికి గ్రామంపై ఉన్న మమకారానికి నిదర్శనమన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి దహనవాటికను నిర్మించిన దాత శ్రీమన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో ఇటువంటి కార్యక్రమాలకు ముందుకు రావడం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అదేవిధంగా నందూరు గ్రామ రైతుల సౌకర్యార్థం ఐదు డొంకల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ప్రాధాన్యతా ఆధారంగా వాటిని



త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్‌కు అవసరమైన మోటార్‌ను రైతుల కోసం అందిస్తానని దాత శ్రీమన్ ప్రకటించడం ఆనందదాయకమన్నారు. దాత జొన్నలగడ్డ శ్రీమన్ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు.తాము అమెరికాలో స్థిరపడినప్పటికీ తమ స్వగ్రామం నందూరు అభివృద్ధికి ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బొర్రు రామారావు, బుడ్డా బీరయ్య, మాజీ ఎంపిటిసీ వేణు తదితరులున్నారు.

## అన్నదానంతో సేవా స్ఫూర్తి చాటుతున్న శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి ట్రస్ట్

**మంగళగిరి, ఆగస్టు 12, ప్రభాతవార్త :** అన్నదానం అన్ని దానాల్లోకెల్లా అత్యంత గొప్పదని, ప్రతి అమావాస్య రోజున వేలాది మంది భక్తులు, ప్రజలకు అన్నదానం చేయడం అభినందనీయమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆకుల జయసత్య, మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ అన్నారు.బుధవారం మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి మెట్ల మార్గం వద్ద శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని, ట్రస్ట్ చైర్మన్ పొందేటి సాంబశివరావుతో కలిసి భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల సుమారు 4,000 మందికి అన్నదానం చేయడం ద్వారా ట్రస్ట్ సభ్యులు సేవా స్ఫూర్తిని చాటుతున్నారని కొనియాడారు. పందేటి సాంభశివరావు అధ్యక్షతన 40 మంది సభ్యులు సమష్టిగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించడం అభినందనీయమన్నారు. మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, పరిసర ప్రాంతాల అభివృద్ధికి మంత్రి నారా లోకేష్ ప్రణాళికలు సిద్ధం చేయడం సంతోషకరమని, ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావాలని వారు ఆకాంక్షించారు.ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ప్రతి అమావాస్య రోజున నిర్విరామంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. దాతల సహకారం, భక్తుల సహకారంతోనే ఈ సేవా కార్యక్రమం విజయవంతంగా



కొనసాగుతోందన్నారు. అన్నప్రసాదాన్ని స్వీకరించిన భక్తులు నిర్వాహకుల సేవాభావాన్ని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన ఆకుల జయసత్య, జవ్వాది కిరణ్ చంద్, ఆకుల ఉమామహేశ్వరరావు, జొన్నాదుల వెంకట రామాంజనేయులు శాలువాతో సత్కరించి పూలమాలలు వేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో పుప్పాల కోటేశ్వరరావు, కర్నాటి శివ సత్యనారాయణ, పంచల శివ, రాచకొండ వెంకటేశ్వరరావు, వడ్డంటి మురహరి రామకృష్ణారెడ్డి, శివప్రసాద్, కగ్గ శ్రీనివాసరావు, పండేటి శ్రీనివాసరావు, ముద్రబోయిన శ్రీనివాసరావు, రెడ్డి వీర రాఘవులు, నంద్యాల గోపాలకృష్ణరెడ్డి, ఆంజనేయులు, కేసన శంకర్రావు, గండికోట అచ్చయ్య, కోదాడ శ్రీనివాసరావు, నూతలపాటి వెంకటేశ్వరరావు, చిరుమామిళ్ల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

MN 11PAGE-GNTv:MN 11PAGE-GNTv 01/01/2001 10:46 Page 1



# మలినేనిలో 36 గంటల హ్యాకథాన్

**ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), ఆగస్టు12, ప్రభాతవార్త:** మండలంలోని పుల్లడిగుంట గ్రామం వద్దనున్న మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సిఎస్ఈ ఏఐ డీఎస్ మూడవ సంవత్సరం విద్యార్థినీలకు టెక్నో ఫీచర్ ఇండియా ఆధ్వర్యంలో జనరేటివ్ ఏఐపై 36 గంటల హ్యాకథాన్



కార్యక్రమం ఈనెల10, 11 తేదీలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిటిఓ కోఫౌండర్, హెయిర్ ఐడి, సౌత్ ప్లెయిన్ ఫీల్డ్, న్యూ జెర్సీ, యునైటెడ్ స్టేట్స్ కు చెందిన అక్షయ్ కుమార్ జ్యూరీ సభ్యుడిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కార్యక్రమంలో విద్యార్థినీలు ఉత్సాహంగా పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలను సాంకేతిక విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలన్నారు. భవిష్యత్తు అవసరాలకు ఇలాంటి హ్యాకథాన్లు ఎంతో అవసరం అన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థినిలకు మలినేని ఇంజనీరింగ్ కళాశాల ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి ఉపాధి అవకాశాలకు మార్గాలు చూపిస్తున్నందుకు కళాశాల యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థినిల ప్రాజెక్టులను పరిశీలించి వారి సృజనాత్మకత సాంకేతిక నైపుణ్యం సమస్య పరిష్కార విధానం ఆఫీస్ కారణాత్మక ఆలోచన మరియు ప్రాజెక్టుల సామాజిక ప్రయోజనాన్ని ఆధారంగా చేసుకుని మూల్యాంకనం చేశారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళు మాట్లాడుతూ..ఇలాంటి హ్యాకథాన్లు విద్యార్థుల సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు, టీం వర్క్ పెంపొందించడంలో కీలకంగా ఉంటాయని తెలిపారు. ఆధునిక ఏఐ రంగంలో ప్రాక్టికల్ అనుభవం కోసం ఇది గొప్ప అవకాశని పేర్కొన్నారు. ఇలాంటి హ్యాకథాన్ లు విద్యార్థినీల భవిష్యత్తుని మరింత ఉజ్వలంగా ఉండేటట్లు చేస్తాయని వెల్లడించారు. సాంకేతిక ఆవిష్కరణల ప్రాముఖ్యతను అందులో విద్యార్థుల యొక్క పాత్రను వివరించారు. కార్యక్రమానికి సిఎస్సి విభాగాధిపతి అధ్యక్షత వహించారు. అనంతరం మొత్తం ఐదు బృందాలను విజేతలుగా ప్రకటించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. అప్పారావు, డైరెక్టర్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, డీన్లు, ఏఐ డీఎస్ హెచ్ఓడి డాక్టర్ ఎన్. చార్లెస్ జయరావు, ప్లేస్మెంట్ అధికారి, టెక్నో ఫీచర్ ఇండియా సహ వ్యవస్థాపకులు శివ బోయపాటి, అధ్యాపకులు, మరియు అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినిలు, పాల్గొన్నారు.

# అవయవదానం పై విస్తృత అవగాహన కల్పించాలి

## అవయవదానంతో మరొకరికి పునర్జన్మ ప్రసాదించడం మహోన్నత సేవ..
## వైద్య ఆరోగ్యమంత్రి సత్యకుమార్ యాదవ్..

**గుంటూరు మెడికల్,ఆగస్టు 12:(ప్రభాత వార్త )**
అవయవదానంతో మరొకరి జీవితానికి పునర్జన్మ ప్రసాదించడం మహోన్నతమైన సేవ అని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్




యాదవ్ అన్నారు. అవయవదానంపై రాష్ట్రవ్యాప్తంగా మరింత అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అంతర్జాతీయ అవయవదాతల దినోత్సవం సందర్భంగా బుధవారం భారతీయ విద్యా భవన్‌లో భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి రాష్ట్రంలో 41 మంది మెదడు మృతులకు సంబంధించిన కుటుంబాలు అవయవదానానికి అంగీకరించగా, వారి ద్వారా 166 మందికి అవయవ మార్పిడి జరిగినట్లు తెలిపారు. 2025లో 93 మంది అవయవదానం చేయడం ద్వారా 363 మందికి పునర్జీవనం లభించిందని వివరించారు.అవయవదానం చేసిన వారి అంత్యక్రియలకు జిల్లా ఉన్నతాధికారులు హాజరై నివాళులర్పిస్తున్నారని చెప్పారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన సైనికులు ఎంత గొప్పవారో, అవయవదానం చేసినవారు కూడా అంతే గొప్పవారని మంత్రి పేర్కొన్నారు. రక్తదానం, నేత్రదానం, అవయవదానంపై ప్రజల్లో మరింత చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు.అవయవ మార్పిడి కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 51 వేల మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని మంత్రి తెలిపారు. మెదడు మృతి చెందిన వారి కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ చైర్మన్ వై.డి. రామారావు మాట్లాడుతూ కిడ్నీ, కాలేయం, గుండె తదితర అవయవాల మార్పిడి కోసం వేలాది మంది ఎదురుచూస్తున్నారని తెలిపారు. అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఎల్వీ ప్రసాద్ కంటి వైద్య సంస్థతో కలిసి అన్ని జిల్లాల్లో కార్నియా కేంద్రాల ఏర్పాటుకు అవగాహన ఒప్పందం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు.కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. రామచంద్రరాజు, ప్రముఖ గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్, ఎల్వీ ప్రసాద్ కంటి వైద్య సంస్థ ప్రతినిధి డాక్టర్ సునీత చౌరాసియా, రెడ్‌క్రాస్ రాష్ట్ర కోశాధికారి డాక్టర్ శ్రీహరిరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

## -ఎమ్మెల్యే రామాంజనేయులు.

**ప్రత్తిపాడు, ఆగస్టు 12, ప్రభాతవార్త:** ప్రజల అవసరాలు, గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు.



మండలంలోని గార్లపాడు, పెద్దివారిపాలెం, బోడిపాలెం గ్రామాలలో బుధవారం తెలుగుదేశం పార్టీ నిర్వహించే రెండేళ్ల నమ్మకం-సంక్షేమం, అభివృద్ధిపై ఇంటింటి ప్రచారాన్ని కూటమి శ్రేణులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామాంజనేయులు పాల్గొన్నారు. గార్లపాడు గ్రామంలో రూ.37 లక్షల సిసి రోడ్డు ప్రారంభోత్సవం మరియు డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అనంతరం గార్లపాడు గ్రామంలో రూ.27 లక్షల జడ్పీ నిధుల టైడ్ గ్రాంట్ నిధులతో నిర్మించనున్న అంతర్గత డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన,రూ.10 లక్షల ఎన్ఆర్జీఎస్ నిధులతో నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. పెద్దివారిపాలెంలో ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామ ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బోడిపాలెంలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో పాల్గొని ఇటీవల ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ చేసిన ఆరోపణలను తీవ్రస్థాయిలో ఖండించారు. గత ఐదేళ్లలో రోడ్లు అధ్వానంగా, గుంతల మయంగా ఉంటే ఒక్క సిబ్బి మట్టి కూడా వేయని ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమని విమర్శించారు. వైసీపీ పాలనలో ఏడుసార్లు ఆర్టీసీ చార్జీలు పెంచిన ఘనత మీదని, మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించింది కూటమి ప్రభుత్వమేనని తెలియజేశారు. రూ.500ల గ్యాస్ సిలిండర్లను రూ 1200లు చేసిన ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంమని, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని పేర్కొన్నారు. నియోజకవర్గంలో గుంటూరు ఛానల్ పనులు జరుగుతుంటే అది మీకు కనబడటం లేదా? నల్లమడ వాగు అభివృద్ధికి నిధులు మంజూరు చేయించి దాన్ని కూడా పూర్తిచేసి చూపిస్తామని తెలియజేశారు. నియోజకవర్గంలో ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరిగితే కళ్ళుండి కబోధి పక్షుల వ్యవహరించి మాట్లాడటం ఆశాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్వయంగా తమ కళ్ళతో చూడాలని ఈతకు పలికారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల టిడిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్.వి.ఆర్.జె.సి. ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా ముగిసిన

# టెక్నిజెన్-2కే 26 జాతీయ స్థాయి సాంకేతిక పోటీలు

**గుంటూరు విద్య ఆగస్టు 12 ప్రభాతవార్త**
నైపుణ్య ప్రదర్శనకు భారీ సంఖ్యలో పాల్గొన్న 1,193 మంది విద్యార్థుల జట్లు ఆర్.వి.ఆర్. జె.సి. ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా ముగిసిన టెక్నిజెన్ - 2కే 26 జాతీయ స్థాయి సాంకేతిక పోటీలు నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు సాంకేతిక విద్యతో పాటు సమస్యలను విశ్లేషించే సామర్థం, సృజనాత్మక ఆలోచనలు, వినూత్న పరిష్కారాలను రూపొందించే నైపుణ్యాలను పెంపొందించుకోవడం అత్యంత అవసరమని ఆర్.వి.ఆర్. జె.సి. ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక చౌడవరం సమీపంలోని ఆర్.వి.ఆర్. జె.సి. ఇంజినీరింగ్ కళాశాలలో తిదిలీ స్టూడెంట్ చాప్టర్ సహకారంతో రెండు రోజుల పాటు నిర్వహించిన"టెక్నిజెన్-2కే26" జాతీయ స్థాయి సాంకేతిక పోటీలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా వంటి ఆరు సాంకేతిక విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో దేశ వ్యాప్తంగా వివిధ కళాశాలల నుండి భారీ సంఖ్యలో 1,193 జట్ల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఇందులో డేటాబేస్ మేనేజ్‌మెంట్, డేటా స్ట్రక్చర్స్ అల్గోరిథమ్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ), సాఫ్ట్‌వేర్ డిజైన్, ఆవిష్కరణాత్మక ఆలోచనలు, సాంకేతిక ప్రజెంటేషన్లు ప్రదర్శించారు.

ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రధమ, ద్వితీయ,




తృతీయ స్థానాల్లో విజేతలుగా ప్రకటించిన వారికి ప్రశంసాపత్రాలు, మెమెంటోలను, ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేసి అభినందించారు. ఇలాంటి పోటీలు విద్యార్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంతో పాటు ఉద్యోగావకాశాల్లో ముందంజలో నిలిపేందుకు దోహదపడతాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాల కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. కొల్లా శ్రీనివాస్, అకడమిక్ ఆర్అండ్‌డీ డైరెక్టర్ డా. కె. రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా. ఎన్.వి. శ్రీనివాసరావు, ఏ సీ ఎం స్టూడెంట్ లోకల్ చాప్టర్ సభ్యులు, వివిధ శాఖల విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నా

# జ్ఞానజ్యోతి శిక్షణతో బాలలకు మెరుగైన విద్య అందించవచ్చు

**ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), ఆగస్టు12, ప్రభాతవార్త :** జ్ఞాన జ్యోతి శిక్షణ ద్వారా అంగన్వాడీ కేంద్రాల లోని బాలలకు మెరుగైన విద్య అందించేందుకు



అవకాశం ఉందని డిఆర్పీలు మల్లేశ్వరి, సిహెచ్.నాగిరెడ్డి టి.శివప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని వింజనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీలకు రెండవ రోజు జ్ఞానజ్యోతి పై శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణలో అంగనవాడి కార్యకర్తలకు డిఆర్పీలు జ్ఞానజ్యోతి పేరిట ప్రత్యేక శిక్షణను అందించారు. నూతన విద్యా విధానం అమలులో భాగంగా బోధనా తీరుపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు దశలవారీగా 120 రోజుల పాటు వివిధ అంశాలపై తర్ఫీదు ఇచ్చేలా కార్యక్రమాలను రూపొందించారు. మొదటి విడత శిక్షణ ఈ నెల 11న ప్రారంభమైంది. ప్రస్తుతం నిర్వహిస్తున్న మొదటి విడత శిక్షణలో చిన్నారుల మేథో అభివృద్ధిపై అవగాహన, రెండో దశలో శారీరక అభివృద్ధి, మూడో దశలో భాషాభివృద్ధి, నాలుగైదు దశలో సాంస్కృతిక, సృజనాత్మక పెంపు అంశాలపై తర్ఫీదు ఇవ్వనున్నట్లు చెప్పారు.నూతన మార్పులకు అనుగుణంగా అంగన్‌వాడీ కార్యకర్తలను ఉపాధ్యాయుల మాదిరిగా సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. తరగతి గదుల్లో బోధన ఉపకరణాల (టీఎల్ఎం) ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు చెబుతారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ అదే విధానం పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు వారికి టీఎల్ఎం తయారీ నేర్పిస్తున్నారు. పిల్లలు ఆట పాటలతో సులువుగా నేర్చుకుంటారనే ఉద్దేశంతో బొమ్మలు, సంజ్ఞల ద్వారా చిన్నారులకు ఎలా వివరించాలో తెలియజేశారు. సరదాగా ఆడుకుంటూనే కొత్త ఎలా బోధించాలో చెప్పారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు కె.చిన్నమ్మాయి, పి.మాధవి, ఎంవి రత్నం, మట్టి చెరుకూరు గుంటూరు రూరల్ మండలాల అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# జీజీహెచ్‌లో మోకీళ్ల మార్పిడికి రూ.కోటి సహకారం-

**గుంటూరు మెడికల్, ఆగస్టు 12:(ప్రభాత వార్త )**
గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో నిరుపేదలకు ఉచితంగా మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు ఉన్నతి ఫౌండేషన్ రూ.కోటి విలువైన ఇంప్లాంట్లు, పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు ముందుకొచ్చింది. సుమారు 100 శస్త్రచికిత్సలకు అవసరమైన సహకారం అందించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్, సీనియర్ కీళ్ల మార్పిడి శస్త్రవైద్య నిపుణుడు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

**ఒక్క ఇన్ఫెక్షన్ కూడా లేకుండా 125 శస్త్రచికిత్సలు : డాక్టర్ సుందరాచారి...**




తెలిపారు. ఈ మేరకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి. దుర్గాప్రసాద్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు.

దశాబ్దం క్రితం జీజీహెచ్‌లో ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకున్న 125 మందితో బుధవారం ఎంసీహెచ్ భవనంలోని సమావేశ మందిరంలో ఆత్మీయ ముఖాముఖి నిర్వహించారు. శస్త్రచికిత్సలు చేయించుకున్న వారు వైద్యులతో కలిసి నృత్యాలు, కోలాటాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేంద్రరెడ్డి

**-100 శస్త్రచికిత్సలకు ఇంప్లాంట్లు, సాంకేతిక పరిజ్ఞానం అందించనున్న ఉన్నతి ఫౌండేషన్**
**- నరేంద్రరెడ్డి సేవలు అభినందనీయం: డాక్టర్ దుర్గాప్రసాద్**
**-దశాబ్దం క్రితం జిజిహెచ్ లో మోకిలి మార్పిడి శాస్త్ర చికిత్సలు చేయించుకున్న వారితో వైద్యుల ఆత్మీయ సమావేశం...**

మాట్లాడుతూ అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ స్ఫూర్తితో 125 మందికి ఉచితంగా మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి. సుందరాచారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి. దుర్గాప్రసాద్ విజ్ఞప్తి మేరకు మరో రూ.కోటి విలువైన ఇంప్లాంట్లు, పరికరాలు, సాంకేతిక సహకారం అందించనున్నట్లు చెప్పారు. తానే స్వయంగా జీజీహెచ్‌కు వచ్చి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తానన్నారు.

డాక్టర్ ఎన్.వి. సుందరాచారి మాట్లాడుతూ 125 మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సల్లో ఒక్కరికి కూడా ఇన్ఫెక్షన్ రాకపోవడం డాక్టర్ నరేంద్రరెడ్డి అంకితభావానికి నిదర్శనమన్నారు. డాక్టర్ జి. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నిరుపేదలకు ఉచితంగా శస్త్రచికిత్సలు అందించేందుకు నరేంద్రరెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. భవిష్యత్తులోనూ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.కార్యక్రమంలో జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ పి. అనిల్‌బాబు, ప్రొఫెసర్లు డాక్టర్ ఎ. అజయ్, డాక్టర్ కె. శ్రీనివాసరావు, బీఎంఆర్ గ్రూప్స్ చైర్మన్ బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి, డాక్టర్ బూసిరెడ్డి ఉన్నతి, సహాయ ఆచార్యులు, పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటర్లో 75 పైగా మార్కులు పొందిన విద్యార్థులకు

# హెచ్‌సిఎల్ టెక్ అసోసియేట్ ఉద్యోగ అవకాశాలకు నేడు ఇంటర్వ్యూలు

**గుంటూరు విద్య ఆగస్టు 12 ప్రభాతవార్త :** ఇంటర్మీడియట్ 202526లో ఉత్తీర్ణులైన 75 మార్కులు వచ్చిన నాన్ మ్యాథ్స్ గ్రూప్ విద్యార్థులకు అంతర్జాతీయ కంపెనీ అయిన హెచ్ సి ఎల్ టెక్నో లో అసోసియేట్ హోదాలో అవకాశం ఉందని, గుంటూరు ఆర్జెడి పద్మ, గుంటూరు జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ ఐ ఓ జి. సునీత లు తెలిపారు.గుంటూరు జిల్లా లో ఉన్న జూనియర్ కళాశాలల్లోని, నాన్ మాథ్స్ గ్రూపుల్లోని సి ఈ సి , హెచ్ ఈ సి , బైపిసి మరియు ఒకేషనల్ విద్యార్థులు 202526 సంవత్సరంలో 75 మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 13 వ తేదీ ఉదయం 10 గంటలకు, గీతం జూనియర్ కళాశాల , విజ్ఞాన్ జూనియర్ కళాశాల సమీపంలో రాఘవేంద్ర నగర్,పెద పలకలూరు రోడ్డు గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ 522009 , హెచ్ సి ఎల్ టెక్నో వారు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలనీ కోరారు. ఆసక్తి గల విద్యార్థులందరూ **https://registrations.hcltech-bee.com/** ఈ లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోగలరనీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఇంటర్మీడియట్ బోర్డు , హెచ్ సి ఎల్ టెక్నో సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడుతుంది. కావున, ఆసక్తి కలిగిన నాన్ మ్యాథ్స్ గ్రూపుల్లో 75 మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులు, 80 మార్కులతో ఉత్తీర్ణులైన ఎంపీసీ ఎంఈసి , విద్యార్థులందరూ పైన ఉన్న రిజిస్ట్రేషన్ లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఇంటర్మీడియట్ విద్యా ప్రాంతీయ సంయుక్త సంచాలకులు , డి వి ఈ ఓ జె .పద్మ , గుంటూరు జిల్లా ఇంటర్మీడియట్ విద్యా ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి జి. సునీత లు తెలియజేశారు. మరిన్ని వివరాల కొరకుహెచ్ సి ఎల్ ప్రతినిధి , నిర్వాహకులు మారుపిల్ల శ్రీరామ హర్ష వర్ధన్ (శ్రీ: 8639129251) సంప్రదించాలని కోరారు.

# ఎల్‌నినోతో పంటలకు నష్టం

## లాం ఫామ్ శాస్త్రవేత్త వెంకట్రావు

**కొల్లిపర, ఆగస్టు 12, ప్రభాతవార్త:**ఎల్‌నినో ప్రభావంతో పంటలు దెబ్బతినే ప్రమాదం పొంచి వుందని లాం ఫామ్ ప్రధాన శా స్త్రవేత్త వెంకట్రావు అన్నారు.బుధవారం మండలంలోని చెముడుబాడు ,చక్రాయపాలెం గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర వ్హించారు.ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ వాతవరణం మార్పులను దృష్టిలో వుంచుకుని రైతులు పంటలను సాగు చేయాలని చెప్పారు.మోతాదుకు మించి ఎరువులను వాడరాదని తెలిపారు.శాస్త్రవేత్త సుజనీరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులతో పాటు నాణ్యమైన ఉత్పత్తులను సాధించేందుకు వీలుంటుందన్నారు.మండల వ్యవసాయ శాఖ అదికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విధిగా పంటల బీమాను చేయించుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు.దీని వలన ప్రయోజనం ఉంటుందని చెప్పారు.ఈ క్రాప్ తప్పని సరిగా చేయించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్తులకు అండగా ఉంటాం

## -జీడీసి ఎమ్మెస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు

**పొన్నూరు, ఆగస్టు 12,ప్రభాతవార్త:** గోరంట్ల గ్రామ ప్రజల నాటి హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జీడీసి ఎమ్మెస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు అన్నారు.ప్రభుత్వ చెరువు పరిసర ప్రాంతాల్లో, ఇతర ప్రదేశాల్లో అనుమతులు లేకుండా బోర్లు వేసి నీటిని అక్రమంగా వేరే ప్రాంతాలకు తరలించడం చట్టరీత్యా నేరమన్నారు.దీని వల్ల భూగర్భజలాలు



దెబ్బతింటున్నాయన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల హక్కులను కాపాడేందుకు తాను ఎప్పుడు ముందుంటామన్నారు. గతంలో అనుమతులు లేకుండా నీటిని తరలించడం, అక్రమంగా ఎక్కడపడితే అక్కడ బోర్లు వేసి నీటిని తరలిస్తున్న విధానాన్ని గ్రామ ప్రజలు జీడీసి ఎమ్మెస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు దృష్టికి తీసుకెళ్ళారు. అందుకు స్పందించిన హరిబాబు కమిషనర్‌తో మాట్లాడి అక్రమ కార్యక్రమాలను నిలుపుదల చేయించారు. అయితే ప్రస్తుతం మళ్ళీ అక్రమంగా నీటిని తరలిస్తుండడంతో గ్రామస్తులు ట్యాంకర్‌ను అడ్డుకొని వడ్రాణం హరిబాబుకు తెలియజేయడంతో హరిబాబు హుటాహుటిన గోరంట్ల గ్రామానికి వచ్చి గ్రామస్తులకు అండగా నిలిచారు. వడ్రాణం హరిబాబు చొరవను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గంటసాల సోమశేఖర్, యర్రంశెట్టి రాజేష్, చలువాది రాంబాబు, చిల్లర రాంబాబు, అల్లాడి సుబ్బారావు, యక్కిటిల శ్రీను, రాగం సదా, అరిగల రవి, తదితరులున్నారు.

# మత్తు పదార్థాలకు యువత దూరంకావాలి

## -జిల్లా ఈగల్ టీం సిఐ విక్టర్

**కొల్లిపర, ఆగస్టు 12, ప్రభాతవార్త:** సమాజంలో యువత మత్తు పదార్థాలకు బానిస కారాదని గుంటూరు జిల్లా ఈగల్ టీం సిఐ విక్టర్ స ్పష్టం చేశారు.బుధవారం మండలంలోని తూములూరు రామాలయం వద్ద పోలీస్ అధికారులు పల్లెబాటలో ఈగల్ రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన




మాట్లాడుతూ మత్తుకు అలవాటు పడితే భవిష్యత్ నాశనమవుతుందని చెప్పారు.విద్యలో ఏకాగ్రత లోపిస్తుందన్నారు. పిల్లలను గమనించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని ఆయన సూచించారు.మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు సమాచారం అందితే కఠిన చర్యలు తీసుకుంటామని విక్టర్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అడపా నారాయణరెడ్డి, చింతా మోహన్‌రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చింతా వేణుగోపాలరెడ్డి,కార్యదర్శి ఉయ్యూరు మాధవరెడ్డి, కమిటీ సభ్యులు కొండా కిశోర్‌రెడ్డి, కట్టా శ్రీహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

కొల్లిపర, ఆగస్టు 12, ప్రభాతవార్త:మండల కేంద్రమైన కొల్లిపరలో బుధవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.గ్రామ పురవీధులలో ర్యాలీ నిర్వహిస్తూ మేరా భారత్ మహాన్ అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఎంపిపి పద్మావతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాతీయతను చాటేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.హర్ ఘర్ తిరంగా కార్యక్రమం దేశభక్తిని పెంపొందించుకో వచ్చన్నారు.తహశీల్దార్ సిద్ధార్ధ మాట్లాడుతూ జాతీయ ఐక్యతను




చాటేందుకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం దోహదపడుతుందన్నారు.ఎంపిడివో విజయలక్ష్మి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాల పట్ల గౌరవం పెరుగుతుందన్నారు.హర్ ఘర్ తిరంగా కార్యక్రమం పట్ల ప్రజలు ఆకర్షితులవుతున్నారని ఆమె చెప్పారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి,గృహనిర్మాణ శాఖ ఎఇ పద్మావతి,మండల విద్యాశాఖ అధికారిణి యూన్నీలత,డిప్యూటీ తహశీల్దార్ రాజేష్,డిప్యూటీ ఎంపీడీవోలు దానయ్య,భార్గవ్, పరిపాలనాధికారి కిషోర్‌కుమార్,ఆర్ఐ వంశీకృష్ణ,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## టిడిపి మండల అధ్యక్షుడు చినకోటిరెడ్డి

**కొల్లిపర, ఆగస్టు 12, ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా పరిపాలన అందిస్తున్నదని మండల తెదేపా అధ్యక్షుడు చినకోటిరెడ్డి అన్నారు.బుధవారం మండల కేంద్రమైన కొల్లిపర తెదేపా కార్యాలయంలో నాయకులు,కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకోవడం కోసం పెన్షన్‌ను రూ.2 వేల నుండి రూ.4 వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే దక్కిందన్నారు.మహిళలకు తల్లికివందనం,సంవత్సరానికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు,ఉచిత బస్సు సౌకర్యం కల్పించినందున ప్రజలకు ఆర్థిక ప్రయోజనం చేకూరిందని తెలిపారు.ఈ సమావేశంలో నీటి సంఘం ఉపాధ్యక్షుడు ఆరిమండ శివనాగమల్లేశ్వర రెడ్డి,తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కంచర్ల అమృతరాజు,తెదేపా నాయకులు ఆరిమండ రాధాకృష్ణారెడ్డి,బొంతు చంద్రిక,ఎన్ఆర్ఐ వెంకటేశ్వరరావు,షేక్ రఫీ,వెంకటరెడ్డి,వల్లభాపురం బసవయ్య,వి.భరత్ తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు మరువలేనివి

**గుంటూరు విద్య ఆగస్టు 12 ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ గుంటూరు .హర ఘర్ తిరంగా కార్యక్రమం పశ్చిమ ఏడవ మండలం లో జిల్లా అధ్యక్షులు చెరుకూరు తిరుపతిరావు ఆధ్వర్యంలో జరిగింది. వారు మాట్లాడుతూ స్వతంత్ర సమరంలో ప్రాణాలు అర్పించిన స్వతంత్ర వీరులు, దేశ భక్తుల త్యాగాలను స్మరించుకుంటూ, మాతృభూమి కోసం బలిదానం చేసిన అమరవీరుల చరిత్రను భావితరాలకు తెలియజేసి భారతదేశాన్ని ప్రపంచ స్థాయిలో మహోన్నతమైన స్థానం కోసం కృషి చేయాలని, నేటి బాలలు భావితరానికి పునాది రాళ్ళ అని తెలియజేశారు. ఆగస్టు 15.... 80వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకం ఎగురవేయాలని కోరారు. ఈ కార్యక్రమం గుంటూరు పశ్చిమ ఏడవ మండల అధ్యక్షులు గాలేటి బాబు, కూటమి నాయకులు తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ నాగూర్ వలీ, జనసేన నాయకులు ఆళ్ల శ్రీహరి, 22వ డివిజన్ తెలుగుదేశం అధ్యక్షులు ,చింతకాయల సాయి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ రామకృష్ణ, బిజెపి జిల్లా కార్యదర్శికే నారాయణరెడ్డి సీనియర్ నాయకులు బిజెపిఅప్పిశెట్టి వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం శ్రీనివాసరావుపేట 60 అడుగుల రోడ్డు నుండి రామనామ క్షేత్రం ఎదురు భారతమాత విగ్రహం వరకు జరిగింది.

13-08pg10exHMNWJQE_13-08pg10exHMNWJQE.qxd 12/Aug/26 10:46 PM Page 1



ఆట



# సింక్యూఫీల్డ్ కప్‌లో.. సిందరోవ్‌పై ప్రజ్ఞా విజయం

**న్యూఢిల్లీ:** సింక్యూఫీల్డ్ కప్‌లో జవోఖిర్ సిందరోవ్‌పై ప్రజ్ఞానంద గెలుపు సాధించాడు. గ్రాండ్ చెస్ టూర్‌లోని చివరి ఈవెంట్ అయిన సింక్వీల్డ్ కప్ రెండవ రౌండ్ మ్యాచ్‌లో బుధవారం భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద జవోఖిర్ సిందరోవ్ రక్షణను ఛేదించి తన మొదటి విజయాన్ని నమోదు చేసుకున్నాడు. క్వీన్ పాన్ ఓపెనింగ్ నుండి మొదలైన ఎండ్‌గేమ్‌లో, ప్రజ్ఞా అంగుళం అంగుళం చొప్పున తన పాయింట్‌ను కైవసం చేసుకుని, ఆట మొత్తానికి హీరోగా నిలిచాడు. సంపూర్ణ డ్రాగా ముగిసిపోవాల్సిన ఒక సమానమైన ఎండ్‌గేమ్‌ను సిందరోవ్ ఎంచుకున్నాడు.

కానీ ప్రజ్ఞానంద పట్టుదల. కంప్యూటర్ డ్రాగా భావిస్తున్న ఆట క్షణాల్లోనే విజయ దశకు చేరుకున్నాడు. ఈ ఆట ఏకంగా 95 ఎత్తుల పాటు సాగింది. ప్రజ్ఞానంద తన రెండు ఆటలలో 1.5 పాయింట్లు సాధించగా, రాత్రికి అగ్రస్థానంలో ఉన్న అమెరికాకు చెందిన ఫాబియానో కరువానా మాత్రమే హాలండ్‌కు చెందిన అనీష్ గిరితో డ్రాతో ప్రశాంతంగా ముగించాడు. ఆ డచ్ ఆటగాడు ఆరంభంలో చేసే లోతైన సన్నాహాలకు ప్రసిద్ధి చెందాడు మరియు అతను తన అభిమానులను నిరాశపరచలేదు, కానీ కరువానా తన నల్ల పావుతో బాగా సన్నద్ధమయ్యాడు. మొదటి రౌండ్‌లో కేవలం ఒకే నిర్ణయాత్మక ఫలితం వెలువడగా, రెండవ రౌండ్‌లో నాలుగు నిర్ణయాత్మక ఫలితాలతో సమీకరణం మారింది. ఈ రౌండ్లలో అమెరికాకు చెందిన లెవాన్ అరోనియన్ తన ప్రతిభను ప్రదర్శించి జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌ను ఓడించగా, అమెరికాకు చెందిన వెస్లీ సో హాలండ్‌కు చెందిన జోర్డెన్ వాన్ ఫోరెస్ట్‌పై తన ఆధిపత్యాన్ని నిరూపించుకున్నాడు.

## కామన్వెల్త్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో
# భారతకు 3 స్వర్ణాలు,
## ఒక రజతం, ఒక కాంస్యం

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌లో భారత ఫెన్సింగ్ జట్టు వివిధ సీనియర్ వ్యక్తిగత ఈవెంట్లలో ఒక్క రోజునే 3 స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం సాధించింది. నైజీరియాలోని లాగోస్‌లో జరుగుతున్న ఈ ఈవెంట్లలో సీనియర్ మహిళల ఫోయిల్, సీనియర్ పురుషుల ఈపీ, మరియు సీనియర్ పురుషుల సాబ్రే విభాగాలలో టీమ్ ఇండియా ఆధిపత్యం చెలాయించింది. సీనియర్ మహిళల ఫాయిల్ విభాగంలో భారత్ ఆధిపత్యాన్ని నెలకొల్పి, స్వర్ణ, రజత పతకాలను కైవసం చేసుకుంది. కచ్చితమైన, నియంత్రిత ప్రదర్శనతో కనగలక్ష్మి స్వర్ణ పతకాన్ని కైవసం



చేసుకోగా, ఆమె సహచరి జాయిస్ అషిత రజత పతకాన్ని గెలుచుకుంది. తద్వారా కాంస్య పతకం గెలుచుకున్న ఇంగ్లాండ్‌కు చెందిన జార్జియా గ్రీన్, ఎమిలీ గుడ్‌చైల్డ్‌ల కంటే ముందుగా వీరు పోడియంపై మొదటి రెండు స్థానాలను దక్కించుకున్నారు. సీనియర్ పురుషుల ఈపీ విభాగంలో కూడా విజయం కొనసాగింది, ఇక్కడ రాజేంద్రన్ శాంతిమోల్ షేర్జిన్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచి భారతదేశానికి ఆ రోజు రెండవ స్వర్ణ పతకాన్ని సాధించిపెట్టాడు. సీనియర్ పురుషుల సాబ్రే ఈవెంట్‌లో, రజత పతకం సాధించిన ఆస్ట్రేలియాకు చెందిన షిమ్ యోంగీతో జరిగిన ఫైనల్ పోరులో అద్భుతమైన ప్రదర్శనతో సింగ్ కరణ్ సింగ్ భారతదేశానికి మూడవ స్వర్ణ పతకాన్ని అందించాడు. జట్టు సభ్యురాలు కుమారేసన్ పద్మ గిషో నిధి, నైజీరియాకు చెందిన అకిన్యోసోయే ఒలువాఫోలాయెమితో కలిసి కాంస్యం గెలిచి పతకాల సంఖ్యను పెంచింది.



# బంగ్లాదేశ్‌కు బిగ్ షాక్

## అఫ్ఘాన్‌తో భారత్ టి20 సిరీస్ ఖరారు

## సెప్టెంబరు 13న తొలి మ్యాచ్

**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ)కి భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) బిగ్ షాకిచ్చింది. సెప్టెంబర్‌లో తమతో సిరీస్ ఆడేందుకు బంగ్లాదేశ్ పర్యటనకు టీమిండియా వస్తుందని ఆశించిన బీసీబీకి నిరాశే ఎదురైంది. అఫ్గానిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్‌ను ఖరారు చేసి బంగ్లా పర్యటనకు వెళ్లడం లేదని భారత్ క్రికెట్ బోర్డు పరోక్షంగా వెల్లడించింది. సెప్టెంబర్‌లో అఫ్గానిస్థాన్‌తో జరగనున్న మూడు టీ20ల సిరీస్ షెడ్యూల్‌ను బుధవారం బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. అఫ్గాన్ క్రికెట్ బోర్డు వెల్లడించినట్లుగానే ఢిల్లీ వేదికగా మూడు టీ20ల సిరీస్ జరగనుంది. భారత్‌లోనే అఫ్గాన్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. ఢిల్లీ మైదానాన్ని అఫ్గాన్ హోమ్ గ్రౌండ్‌గా ఎంచుకుంది. గత జూన్‌లో భారత్, అఫ్గానిస్థాన్ జట్ల మధ్య ఏకైక టెస్ట్, మూడు వన్డేల సిరీస్ జరిగిన సంగతి తెలిసిందే. భారత్, అఫ్గానిస్థాన్ మధ్య సెప్టెంబర్ 13న తొలి టీ20, 15 రెండో టీ20, 19న మూడో టీ20 జరగనుంది. ఈ సిరీస్ భారత్, అఫ్ఘనిస్తాన్‌ల మధ్య జరగనున్న రెండవ ద్వైపాక్షి క టీ20ఐ మాత్రమే. ఈ రెండు జట్లు చివరిసారిగా జనవరి 2024లో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో తలపడ్డాయి. అప్పుడు భారత్, మొహాలీ, ఇండోర్, బెంగళూరులలో ఆఫ్ఘనిస్తాన్‌కు ఆతిథ్యం ఇచ్చింది. ఆ సిరీస్‌ను భారత్ గెలుచుకుంది. ఇక కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో కష్టకాలం ఎదుర్కొంటున్న భారత టీ20 జట్టుకు, రాబోయే ఈ పోటీ ఒక కీలక దశలో వస్తోంది. ఇటీవలి పరంపరను ఐర్లాండ్‌తో 2-0 సిరీస్ ఓటమితో ప్రారంభించిన భారత్, ఆ తర్వాతి సిరీస్‌లో ఇంగ్లండ్ చేతిలో 4-0 తేడాతో ఓటమి చవిచూసింది. కాగా భారత క్రికెట్ బోర్డు ఎప్పుడూ అఫ్గానిస్థాన్‌కు అండగా ఉంటుందని బీసీసీఐ ప్రెసిడెంట్ మిథున్ మన్హాస్ తెలిపారు. అఫ్గాన్ క్రికెట్ అభివృద్ధి కోసం మద్దతు ఇస్తామని, అత్యున్నత స్థాయిలో పోటీ పడేలా వారికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని చెప్పాడు. ఈ క్రమంలోనే ఆ జట్టుతో ద్వైపాక్షిక సిరీస్‌ను ఏర్పాటు చేశామని, టాప్ టీమ్స్‌తో ఆడటం వల్ల వెలకట్టలేని అనుభవం వస్తుందని అభిప్రాయపడ్డాడు. భారత్ వేదికగా అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు ఆతిథ్యం ఇస్తున్న సిరీస్‌కు బీసీసీఐ అండగా ఉంటుందని సెక్రటరీ దేవజిత్ సైకియా అన్నారు. మైదానంలో ఇరు జట్ల మధ్య పోరు చాలా ఆసక్తికరమని, నాణ్యమైన క్రికెటర్లు ఉన్నారని పేర్కొన్నారు. భారత్‌లోనూ అఫ్గాన్ ఆటగాళ్లకు అభిమానులు ఉన్నారంటే వారి ఆటతీరే కారణమని, ఇటీవల ఒక టెస్ట్, వన్డే సిరీస్ జరిగిందని, మూడు ఫార్మాట్లలోనూ ఇరు జట్లు తలపడేందుకు ఉన్న అవకాశాలను ఏ మాత్రం వదులుకోమని స్పష్టం చేశారు.



## శ్రీలంక సిరీస్‌కు..
# టీమిండియా కఠిన శిక్షణ

**న్యూఢిల్లీ:** శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్ కోసం భారత్ గతంలో ఎన్నడూ లేని విధంగా సన్నద్ధం అవుతోంది. ఈనెల 4న కొలంబోలో అడుగుపెట్టడం మొదలు అక్కడి నాన్‌డెస్క్రిప్ట్స్ క్రికెట్ క్లబ్ (ఎన్‌సీసీ) మైదానంలో వరుసగా ఎలాంటి విరామం లేకుండా చెమటలు చిందిస్తోంది. ఇందులో మూడు రోజుల పాటు సాగిన పూర్తి స్థాయి వామప్ మ్యాచ్‌తో పాటు, మిగిలిన రోజుల్లో రోజుకు ఐదు నుంచి ఆరు గంటల పాటు సాగిన కఠిన నెట్ సెషన్లు ఉన్నాయి. ప్రధానంగా ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసులో నిలవాలంటే శ్రీలంకతో జరిగే ఈ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాల్సిన అవసరం తప్పనిసరి అయింది. అంతేకాకుండా శ్రీలంకపై 18 ఏండ్ల నుంచి ఒక్క టెస్టు సిరీస్ కోల్పోని రికార్డు భారత్‌కు ఉంది. ఈ నేపథ్యంలో లంక సిరీస్‌ను టీమిండియా యాజమాన్యం ప్రతిష్టాత్మకంగా తీసుకోవాల్సి వచ్చింది. ఈనెల 15న మొదలయ్యే సిరీస్ కోసం టీమ్ మేనేజ్‌మెంట్ ఏ చిన్న పొరపాటుకు కూడా తావివ్వకుండా పక్కా ప్రణాళికతో ఆటగాళ్లను సిద్ధం చేస్తోంది. ప్రస్తుత జట్టులో కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్‌కు మాత్రమే లంకలో టెస్టు మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉంది. మిగిలిన ఆటగాళ్లందరికీ ఇక్కడి పరిస్థితులు కొత్త. అందుకే లంకలో అడుగుపెట్టిన 24 గంటల్లోనే మైదానంలోకి దిగిన జట్టు ఇక్కడి విపరీతమైన వేడి, తీవ్రమైన తేమతో కూడిన వాతావరణానికి ఆటగాళ్లు అలవాటుపడేలా హెడ్ కోచ్ గంభీర్ ప్రాక్టీస్ సెషన్స్‌ను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, తిరిగి 2 నుంచి సాయంత్రం 5.30 వరకు రెండు విడతలుగా విభజించాడు. లంక ఎలెవన్‌తో జరిగిన వామప్ మ్యాచ్ సమయంలోనూ ఫీల్డింగ్ చేస్తున్న ఆటగాళ్లను మారుస్తూ, ఒకవైపు మ్యాచ్ ఆడుతూనే మరోవైపు సమాంతరంగా నెట్స్ ప్రాక్టీస్ చేయిస్తున్నాడు.





Creative Visualisation. Images used are for illustration purposes only. | Applicable T&C available at the dealership. | **As certified by Kantar IMRB for an OEM platform for end-to-end usage as on November 28, 2025. | #543 km range: Certified range; actual results may vary by driving conditions and usage. | Assured buyback plan is available on payment basis with the option of 3 years/45 000 km or 4 years/60 000 km ownership plans (whichever is earlier). The program is offered through an insurance company. e VITARA comes with standard warranty of 3 years/1 00 000 km (whichever is earlier) with an option of extending the same on payment basis to 5 years/1 40 000 km and service activated coverage for 6th to 8th year for EV related components.


Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14